(౧)


# ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు
సచిత్రాంధ్రమాసపత్రిక.

స్థాపితము ౧౯౩౩.
సాలుచందా 1-8-0.

సంపాదకుడు :
ఆంధ్ర శేషగిరిరావు, బి. ఏ.

సంపుటము : ౪. యువ, ఆశ్వయుజము : అక్టోబరు, 1935. సంచిక : ౪.


## ఆశాదృష్టి

ఓయి కర్షకా! నీవు స్వేదబిందువులురాల అహర్నిశలు కష్టించి పెంచిన పైరు అనావృష్టిచే మలమల మాడిపోవుచుండ, ఊరక చేనుగట్టుపై నిలబడి చూచుచూ ఉన్నావు. ఏయాశతో?

ఆకసమును చిరుమబ్బుతునకలు ఆవరించుచున్నవనియా? అవి వర్షించే మేఘములుకావు. అయిన ఆ చిహ్నములుమాత్రము ఎక్కడ నున్నవి? ఒకవేళ ఉన్నా, ఈ దహించుకొనిపోవు ప్రచండాతపకాలమున పశ్చిమదిగాగతప్రళయవరుణవాతములచే నవి యెగిరిపోవా?

అది వట్టి తృష్ణాపూరితమగు పేరాశ. నీవు అవి సునీలమేఘములని తలంచి ప్రసన్నచిత్తుడవై ఘోరవృష్టి కురువగలదని గంపెడాశతో ఆకసమువంక కన్నెత్తి చూచుచున్నావు. కాని అది మేఘజాలము కాదు. పెట్టనిగోడలవలె నీపల్లెకుచుట్టూ ఉన్న వెలిగొండల మంట నుండి లేచే నల్లనిపొగ. పెనుగాలిచే ఎగరగొట్టబడి దట్టముగా నలుముకొన్న భూరజము. అందు తరళచంచలవిద్యుత్తుగాని, శీతల జలకణములుగాని లేవు.

అదిగో! అటుచూడుము. కడుపుకాలిన నీభార్య, బిడ్డల త్రాసపూర్ణము, దుఃఖారావమిళితము అగు కనులనుండి కారే ఉత్తప్తాశ్రుకణముల ప్రవాహము. ఇదియే ఉరుముల మెరుముల తోటి వానయగునా నీకు?

పాపము ఈ స్థితిలోకూడ నీకు పన్నులభారము, ఋణదాతల బాధ తప్పదు. కాన ఈ వృధా ఆశాదృష్టిని త్యజించి కర్తవ్యమార్గమునకు రమ్ము.

—పోసకాక నకమ్మ.




# ఆ నలుపు ముంగురులది కాదు

అతనంత నిశిరాత్రి కనపడతాడని ఆమె ఎప్పుడూ తలంచలా. నివ్వెరపోయింది.

'ఇదేనా రావటం. ఎక్కడనుంచి మధూ!'

'ఇక్కడనుంచే...మీ నాన్నగారు నిద్ర పోతున్నారా?'

'నిద్రపోతున్నారులే...కూర్చో...తలుపు దగ్గరగా వేసివస్తా'

'......'

'నాలుగు రోజులనుంచీ కనబడటంలేదేం. మధూ! ఎంత దిగులుగా ఉందో తెలుసా?'

'వద్దామనుకున్నా...కాని...'

'నావలన ఎంతకష్టపడుతున్నావ్.'

'నీ వట్లా అనుకుంటావనే...'

'లేదులే......నా కేం తోచటంలేదు. మననుగురించి ఆలోచించుకుంటే దిగులుగా ఉంటుంది, మధూ! మన జీవితాలు నిరర్థకం కావలసినదేనా?'

'ఎప్పుడూ అదే ఆలోచించి గుండె చెరువు చేసుకుంటే ఏం లాభం జగదా! అనవసరంగా దిగులుపడతావేం.'

'నే నేం చేయను? తలచుకుంటే ఏదో యిదిగా ఉంటుంది.'

'కష్టాలకోర్చుకోవాలి జగదా! మనకు మంచిరోజులు రాకపోవు.'

'...మీ నాన్నగారు లేస్తారేమో?'

'లేవరులే...నాకేంతోచటంలేదు మధూ! బ్రతకటం దుస్సహంగా ఉంది. మా నాన్నగారికి తనమాటే తనది. నేనేమి అనలేకుండా ఉన్నా...చిన్నప్పటినుంచి తల్లీతండ్రీ ఆయనే గదా...కూర్చో మధూ!'

'జగదా! నాకేది సుఖమో తెలియదూ నీకు.'

'తెలియక కాదు మధూ! ఎంత సంతోషంగా ఉందామనుకుంటానో అంతవిచార మేస్తోంది. నన్ను నేను మోసపుచ్చుకోలేకుండా ఉన్నా.'

'నామాట వింటావా?'

'వినకేం మధూ!'

'అట్లాయితే నిద్రపో-ఎంత నీరసంగా ఉన్నావో.'

'మధూ! మధూ!-మనయిద్దరం చచ్చిపోతే.'

........నే వెళ్లాలి జగదా!'

* * *

'మధూ!...మధూ! మధూ:...మధూ.' అప్పుడప్పు డిలాకలవరిస్తూనే ఉంటుంది జగద:

నిద్రలేచేటప్పటికి చాలాప్రొద్దెక్కింది. మనోవ్యథచే పాలిపోయిన ముఖంమీద ముంగురులు వింత అందాన్ని పుట్టిస్తున్నాయి. ఆ గదిలో ప్రతివస్తువంక బిక్కమొగ మేసుకు చూస్తోంది. ప్రతివస్తువు సానుభూతి తెలుపుతోంది ఆమెకు. ఆమెగుండెలచప్పుడు తప్ప గదంతా ప్రశాంతంగాఉంది. టేబిలుమీద పువ్వులు ఎండిపోయాయి......ఆలోచనలలో పడింది.......రోజంతా గడిచిపోయింది ఆమెకు తెలియకుండానే. కాసేపు ఆమె మనస్సు అగాధంలో పడి కొట్టుకుంటుంది. కాసేపు ఆకాశంలో విహారం చేస్తుంది. ఆమెలోని మధనకు సుమారు నాలుగైదేళ్లుంటాయి. ఆమెలోని సంతోషాన్ని, రక్తాన్ని పీల్చుకు పెరుగుతోంది. రాత్రిభోజనం అయాక జగద గదిలో కూర్చుంది. దూరంగా వినబడుతున్న సంగీతం ఆమె విచారానికితోడయింది. ఆమెతండ్రి లోపలికివచ్చాడు.

'ఏంచేస్తున్నావ్? జగదా!'

'ఏంలేదు...ఊరికేకూర్చున్నా.'

'నీరసంగా ఉన్నావేం. ఎప్పుడూ ఎదాలోభంగా ఉంటావేం. ఏదో ఆలోచిస్తూ కూర్చుంటావ్. జబ్బు చేస్తుందని చెప్పలా?'

'...........'

'నీ కెన్నో పెద్ద సంబంధాలు తీసుకొచ్చా. చేసుకోనంటావ్.'

'......'

'మధుమీదుంది నీమనస్సు. అత నేమంత స్థితిపరుడు? అతనితో స్నేహంచేయటం నీ ప్రతిష్టకు భంగంకాదూ?'

జగద తలఎత్తి తండ్రివంక చూచింది. ఆచూపులో దైన్యము, నిస్సహాయత ఉన్నాయి.

'.........చిన్నదానివి కాదుగదా! ఆ మాత్రం తెలీదు నీకు నీ శ్రేయస్సు నాది గాదూ:'

ఆమెను చూస్తే జాలివేస్తుంది. చేత్తో కొంగుపుచ్చుకుంది. కళ్లు అంచును పరీక్షిస్తున్నాయి. హృదయం జీవితాన్ని పరీక్షించుకుంటోంది.

'ఔన్నత్యానికి అణకువ ఎంత మంచి మార్గం! నిన్ను నీవు గౌరవించుకోవాలి, జగదా!

'..........'

'ఇది క్రొత్తగాదు అనేకసార్లు చెప్పా. నే చెప్పేది నీవు వింటేనే దానికి ఫలితం ఉంది.'

'నాకు నిద్రవస్తోంది. మీరుపోయి పడుకోండి నాన్నగారూ!'

'ఎప్పుడు అతన్నిగురించే ఆలోచిస్తావ్! ఎంత చిక్కిపోయావు.'

అశ్రుపూరితనయనాలకు చీరచెంగు అడ్డం పెట్టింది.

'అనవసరంగా నిన్ను బాధించి నీమనస్సు మార్చుదామని రాలా, జగదా! తెలివితక్కువవలన కష్టాలు పాలవుతావ్.'

'నాన్నగారు! నామనస్సు బాగాలేదండి. పడుకుంటా.'

'సరే పడుకో.'

పదకొండుగంట లయింది. మంచంమీద వెలకిలపడుకుంది జగద. కన్నీరు కాలువగట్టి కర్ణరంధ్రాల్లో ప్రవేశిస్తోంది. వీపుక్రింద విడిపోయిన కేశబంధం తడిసిపోతోంది. పన్నెండుగంటలయింది...ఒంటిగంటకూడా అవబో

తోంది...ప్రపంచమంతా అంధకారావృత మయింది. ఆమె మనస్సు విషాదావృత మయింది. కన్నీరు తుడుచుకోటానికి వీపుక్రింద నుంచి చీరచెంగు లాక్కునే ఓపిక లేదు...

* * *

గాలికి తలుపులు తెరచుకున్నాయి. మధు లోపలికి వచ్చాడు...అతనిమీదనుంచి వచ్చే గాలి ఆమెకు పరిచయమే...ఓపిక వచ్చింది. మంచంమీదనుంచి లేచింది.

'కంట తడిపెట్టుకుంటున్నావా? జగదా!'

ఖిన్నుడయాడు – మంచంమీద కూర్చున్నాడు.

'ఇంతవానలో వచ్చావా? మధూ!' కొంగుతో తల తుడుస్తోంది.

'......'

'రెండు రోజులనుంచి కనబడటంలేదేం?'

'ఏంలేదు...ఎప్పుడు విచారంగా ఉంటావేం? నీ కింత వేదన పనికిరాదు జగదా!' దీనంగా అన్నాడు.

'నేనేంచేయను మధూ: అన్నది నీరసంగా.'

'నీ మనోవైభవాన్ని కప్పివేసే మేఘాలు అప్పుడప్పుడు వర్షిస్తాయి. నాలో దుఃఖము పొంగి పొరలుతుంది.'

పూజనీయమైన ఆమె ఆకృతిని ఆరాధించే జ్యోతుల్లాగా ఉన్నాయి అతని రెండు కళ్లూ.

'ఇటురా మధూ! దగ్గరగా కూర్చో-నాది తీరరాని కోర్కె.'

ఆమె కంటిలోని రక్తిమ మనోవ్యథకు చిహ్నం.

'నేనెంత చెప్పినా నెమ్మదిపడ్డ మనస్సు నీకు దుర్లభమవుతోంది, జగదా!'

'భరించలేని దుఃఖము మనది-మధూ!' క్రిందిపెదవి వణకుతోంది. అతని హృదయం తరుక్కుపోతోంది.

'మరిచిపో జగదా! సొంపులొలుకు వెన్నెలలో కూర్చొని అమృతప్రభలను వెదజల్లే నీ చిరునవ్వులు ఏమయాయి. నీ మనస్సు నిబ్బరం చేసుకోవాలి-ఎంత మారిపోయావ్. నిన్ను చూస్తే నాకేదో భయం వేస్తోంది జగదా!'

ఆమెకన్నులు నీరు క్రమ్మాయి.

'అహర్నిశలు నా మనస్సుకు శాంతి లేదు, మధూ! నామనస్సంక్షోభం ఎంత ప్రయత్నించినా తగ్గటంలా.'

వేగుచుక్కలా ప్రకాశించింది అతనిముఖం.

'మాట్లాడుతూ అట్లా చలిస్తావేం. నీ గొంతుక ఎలాబొంగురు పోయింది' శ్రావ్యమైన నీ కంఠం అలామారిందేం. నీ బిగ్గరగా మాట్లాడినమాట అపస్వరంతో పాడినపాట యిప్పుడు జగదా!'

రాగరేఖ లా ఆమె నేత్రగోళాలమధ్య ఉండిఉండి కనబడే కాంతులతో అతనికి మంగళహారతు లిస్తోంది.

'మధూ! నేను శాంతంగా ఉంటాలే.'

'అనవసరంగా మధనపడుతున్నావు! చిన్న నిప్పును ఆర్పేయవచ్చుగాని పెద్దజ్వాలకాని స్తే మహానదులుగూడా ఆర్పేయలేవు.'

'......'

'మధూ!......నీవు......వివాహం చేసుకుని భర్త లాగా ఉంటే ఎలాఉంటావో!'

దడదడకొట్టుకుంటున్నాయి అతనిగుండెలు. సూదిపడినా చప్పుడు వినబడుతుంది ఆగదిలో.

'నామీద నీకు అనిర్వాచ్యానురాగం ఎప్పుడు కలిగిందో అప్పటినుంచి నీ హృదయకుహరంలో నివశిస్తున్నా. నా పంచప్రాణాలు నీ కొంగుముడిలో ఉన్నాయి. నీ ఆనందం కొరకు ఎలాగన్నా ఉపయోగించుకో జగదా!'

జాలివేసింది జగదకు. ఇద్దరు కౌగలించుకున్నారు. ప్రేమాంబుధిలో పునీతములయ్యాయి వాళ్ల శరీరాలు.

'మధూ! నాకు ప్రపంచంలో కోర్కెలేదు. ఉన్నదేమో తీరనికోర్కె......క్షణభంగురమైన ప్రపంచంలోని సౌఖ్యాలకు ఆశ ఎందుకో నాకు. తలచుకుంటే సిగ్గువేస్తోంది. నా మనస్సుపడే మధన తలచుకుంటే నన్ను నేనే అసహ్యించుకుంటూ మధూ! నిజంగా తీరరాదు.'

'..........'

'నాకు బ్రతకాలని లేదు, మధూ! (అతని చేయి పట్టుకుంది) ఆశ అంతరించి పోతోంది.'

ఆమె మనోవైపరీత్యాన్ని చూచి మధు స్తబ్ధుడయ్యాడు. నీరుతో నిండిన ఆమెకళ్లకు అతనిప్రతిచ్ఛాయే కనబడుతోంది.

'నీవు ఆడదానివి కనుకనే వట్టి బేలవైపోతున్నావ్. ఓర్పులేని వారెంత నిర్భాగ్యులు, జగదా!'

అంత తీవ్రంగా అతనిమనస్సులోని తత్తరపాటు ఎప్పుడూ బయటపడలా.

'...........'

'నీవుపోయి పడుకో. చాలప్రొద్దు పోయింది.... వెళుతున్నా'

వెళ్లలేక వెళ్లలేక వెళ్లాడు.

'మ...' ఆగమందామనుకుంది. పెదవులు అదిరాయి. మాట తడబడింది. కన్నులు నీరు క్రమ్మాయి

*     *     *

షుమారు పన్రెండుగంట లయింది. ఇవాళ్ల మధు యింకారాలేదు. వానకురుస్తోంది.

ప్రేమించిన వ్యక్తికి ఆడుది తన సర్వస్వం ధారపోస్తుంది. అతనికోసం తన పరువుప్రతిష్టలు సంఘానికి బలియిస్తుంది—అనేకం త్యజిస్తుంది....జగదమనస్సు స్మృతిమించి రాగానపడింది. ఒకవైపు తండ్రిమీద వాత్సల్యం-వేరొకవైపు మధుమీద అనురాగం. రెంటికి సంధికుదర్చటం ఆమెకు తలమించినపని-దేవుని చేతుల్లోఉంది- ఒకదానికొరకు రెండవదాన్ని త్యజించటం ఆమెకు చేతగానిపని.

*     *     *

రాత్రి చాలాప్రొద్దు పోయింది. వానకురిసి వెలిసింది. తోటలోని చెట్లన్ని కన్నీరు కారుస్తున్నాయి. అందులో నడుస్తుంటే అయోమయంగాఉంది మధుకి. అంతర్యంలో ఏదో బాధపుట్టింది. వానలో బాగా తడిశాడు. వికృతంగా మారాడు. అతన్నిచూచి నక్షత్రాలు వణకుతున్నాయి. చంద్రుడు మేఘాల చాటున దాక్కున్నాడు.... మెల్లగా గదిలోకి వెళ్ళాడు-మంచందగ్గరకు. జగద మంచంమీద పడుకొనుంది. తేజోమయమై విరాజిల్లే ఆమె వదనం కాంతి విహీనమై, రక్తవిహీనమై, జీవరహితమై ఉంది......నెమ్మదిగా కదిలించాడు...బాగా కదిలించాడు ... ముఖానికి నల్లటిముంగురులు అడ్డంపడ్డాయని సవరించబోయాడు......ఆ సలుపు ముంగురులది కాదు...

అతనిగ్రుడ్లు అట్లాగే నిలిచిపోయాయి.

నెమ్మదిగా ముఖంమీద గుడ్డకప్పాడు. జిగిబిగిగా పడిన ఆమె వెంట్రుకలను సవరించి సరిగా పరుండజేశాడు:—వెర్రిగా - గదంతా - చూచాడు....బయటికి వచ్చి తలుపు నెమ్మదిగా వేశాడు.

*     *     *

అతనిలో వాన తుపాను చెలరేగింది. అందులో ఎక్కడికి కొట్టుకెళ్లాడో...?

—కూచిభొట్ల గోపాలకృష్ణమూర్తి, బి. ఏ.

# ౧ రెండు తలలు పగిలాయి

ఒకటి
ప్రేమకోసము.
మరియొకటి
కులాచారము కోసము.

పదుమూడేండ్ల ఆ చామనచాయి అమ్మాయిని చూచీ చూడంగానే, వొక విధమయిన అర్థం తెలీని ఆందోళన యేదో రేకెత్తింది అతనిహృదయంలో. ఆ చిలిపికళ్ళలోని అమాయకత్వమూ, ఆచూపుల అమాయకత్వంలోని నైర్మల్యమూ, అతన్ని కలవర పరచాయి – ఆకలవరం చాల అపూర్వమైంది.

ఒకరిని చూచి వొకరు నవ్వుకున్నారు, ఆనవ్వులో యేదో తెలియరాని వొకవి ముగ్ధభావం తళుక్కుమంది- అతడు అమృతహస్తాలతో పిలచాడు – ఆమె సుధారస పరిప్లుతం అయిన కళ్ళతో మాటాడింది – అతడు తేట తియ్యని పిలుపుతో 'అమ్మాయీ!ఎవరిపిల్లవు' అని పలుకరించాడు.

'నేనాండీ?' ఆకంఠస్వరంలో ఇంద్రజాలం వుంది.

'ఊ'

'రాఁవిని'

'రామీ – రాఁవీ – అది నీపేరు పెట్టిదానా–ఎవరమ్మాయవూ?'

'వెంకడి చెల్లెలినండి'

'వెంకడూ–ఏ వెంకడూ?'

'అయ్యో బాబూ యెఱగరూ పెద్దకాపుగారి చాకలి'

'చాకలీ .. చాకలిపిల్ల ... చాకలి'అని తనకు తెలీకుండానే అప్రయత్నంగా మూడు సార్లు గొణుక్కున్నాడు. పాపం ఆఅమ్మాయి కది అర్థం కాలేదు.

'ఊ, అవును అన్నిసారు లంటారేం'? అంది అమాయకంగా.

'ఏఁవీలేదు. నిన్నెప్పుడూ చూడలేదనీ'

'రోజూవస్తుంటాను యీగుళ్ళోకి'

'నిన్న వొచ్చావా?'

'లేదు'

'మొన్న?'

'ఊఁహూ, మరీ, వారం రోజులనించీ, ఉష్ణంవస్తోంది. అందుకనీ మా అన్న వెళ్ళొద్దు, అదే పోయిందిలే అన్నాడు'

'యీవేళ కాస్త-'

'ఆ సులువుగానేవుంది కానీ – మిమ్మల్నీ ఎప్పుడూ చూడలేదు.'

'అవును. ఈ వూరు కాదు. చదువుకోడానికి వొచ్చాయీ ఆచార్యులవారివద్ద.'

'ఈవూరుకాదూ, చదూకోడానికి వచ్చారు--ఒక్కరే- అమ్మనీ నాన్ననీ వదలేసి వుండగలరా?'

పాపం కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరిగాయి అతగాడికి, అమ్మా, నాన్నా పోయింతర్వాత అంత మృదువుగా, అంత తీయగా మాటాడింది ఆ అమ్మాయి వొక్కతే... తనతల్లి ప్రేమనూ – తండ్రి వాత్సల్యాన్నీ మళ్ళా జ్ఞప్తికి తెస్తోన్నదామె' వొక్కతే ... వణకు కంఠంతో.

'అమ్మా – నాన్నా ... అమ్మా – నన్నే వదలేసినారమ్మా' అన్నాడు.

'ఏఁవీ'

'మంచివాణ్ణి కాననీ'

'మీరు మంచివారు కారూ! ఎలా వదలిపెట్టారమ్మా నేనే అయితేనా?' లోతులేని ఆమాటలు వినేసరికి ఏడుపూ -నవ్వూ-కూడా వొచ్చాయి.

ముత్యాల్లాంటి రెండు అశ్రు కణాలు రాలాయి...వొహటి దుఃఖాశ్రువు...రెండోది ఆనందాశ్రువూ.'

'అదికాదు చనిపోయారమ్మా'

'సచ్చిపోయారు – చ్చ్ – చ్చ్–పాపం–ఒక్కరే–నాలాగే–మరేం...నాకు అమ్మా–నాన్నా నిద్దట్లోవచ్చి అవీ యివీ చెబుతూంటారు – మీకో?'

బరువైన వొక వేడికన్నీటి చుక్క జవాబు.

'నాకు అన్నా, వదినా అయినా వున్నారు – మీకూ–పోనీ నేరోజూ యిలావస్తుంటా లెండి.'.

'ఎందుకూ–నాకోసం వా–ఊహూ–వద్దు'

'ఏఁవీ'

'ఏఁవీలేదు – యీనిర్భాగ్యునికోసం'

'కాదు–యీగుడి తుడవడానికి ఎట్లాగూ రావాలి కదూ?'

'తుడవడానికని వస్తావూ–ఆచేతులతో–ఆమెత్తని, నున్నని, బంగారు చేతులతో–ఆఖరికి దేవాలయం అయినా సరే ..వీల్లేదు'

'మరెలా'

'ఎలాగోలా'

'పోనీ వుత్తనేవస్తా లెండి'

'ఎందుకూ'

'మీరు.ఎంచక్కా– ముద్దుగా చెబుతారన్నీ–మం–చి–వారు'

'మీ అన్నయ్యకన్నానా'

'అన్నయ్యకంటేనా– వుండండి చెబుతా...ఊ–మీరే మంచివారు...మరి నేనూ'

'నువ్వు అందరికన్నాను – భుజాలమీదకి వేలాడుతోన్న ఆ నల్లటి జుట్టూ–ఆముఖం ఎంచక్కా ఎలావున్నాయో–ఆకళ్లూ–నావంకే చూస్తూ–నన్ను పలుకరిస్తూన్నట్టు'

'మీ కళ్లూనూ, అబ్బో ముద్దొస్తున్నాయి. ఆ నున్నటి శరీరం ..మీతో జట్టుకట్టకపోతే ఏవన్నా తోస్తుందీ – ఇదిగో చేతిలో చేయివేస్తున్నా యిక్కణ్ణుంచి మనిద్దరం జతా.'

'ఊ'

'మరచిపోయాను'

'ఏఁవిటి'

'మీ పేరూ'

'చండీదాసు'

'చండీదాసూ–అంత పెద్ద పేరు మరచిపోతానమ్మా నేనూ'

'పోనీ దాసు అను'

'ఊహూ. అలాబావుండదు. –చండీదాసని అంటాను–చండీదాసుకదూ. యింటికివెళ్లాక మరచిపోతానేమో–చండీదాసు–చండీదాసు యీసారి మరచిపోను లెండి–నా పేరో,'

'రామీ–ఎన్నోరోజులు తపస్సుచేసి సంపాదించుకున్న అతీతమైన ఆనందపు తునుకను మరచిపోవడఁవే...అన్నం తినడం మరచిపోవచ్చు–చదువుకోవడం మరచిపోవచ్చు–సంధ్యావందనం మరవ్వొచ్చు – ఆఖరికి నన్ను నే మరవ్వొచ్చు –నీ పేరుమాత్రం ..'

## ౨

'దొంగా, ఇక్కడున్నావా–నీకోసం తోటంతా వెతికాను...నిన్న మనం మొక్కావేం' ఆకొండకోనకూడా చూశాను'

'ఎందుకూ'

'నీకోసఁవే'

'నేనిక్కడుంటే అవన్నీ వెతకమని ఎవరు చెప్పారు?'

'ఎవరుచెప్పారా ... ఎవరా...నీకళ్ళతళతళలు ... నీలోవున్న శాంతినిచ్చే వొక చల్లని వెలుగు...అవీ.'

'నాకనులకన్న మీవే ఎంతో ముద్దుగా వుంటాయిగా మరి మీ కోసం నేను నేవెతకనే'

'వుత్తది. నీకనులే అందంగా వున్నాయి'

'మరి అందుకనే నమ్మా'

'ఏఁవిటమ్మా'

'మీవే'

'అయితే నువ్వూ నాకోసం వెతుకుతోన్నావన్న మాటే'

'నేనేనా? వెదకడంలేదు'

'వెదకుతున్నావు. నీకు తెలీదు'

'ఏమిటమ్మా-నాకు తెలీకుండా వెతకడం ఎట్లాగ? - మీతో మాటాడితే ఇంతే- అన్నీ అర్థంలేని మాటలు'

'ఏమో'

'మరి నేను మీకోసం వెతకడం లేందే అంటారేం'

'పోనీ లేదులే'

'లేదుగదా'

'ఊ, మరి వేగంరా'

'వుండండి యిహ రెండే వుండాయి'

'రావీ, అవన్నీ వొక్కతవే ఎలా వులికావు-ఏవీ చేతులు...అయ్యో ఎలా పొక్కులెక్కాయో.'

'అలవాటు'

'ఏం అలవాటు - ఇక్కణ్ణుంచి వులిక్కు'

'బువ్వో'

'నేను పెడతాలే'

'ఎక్కడది'

'బిక్షమెత్తి'

'అమ్మో. బిక్షంవెత్తడమే. నాకోసంవనీ'

'బిక్షమేకాదు ఏపనై -'

'నేనంటే ఎందుకండీ మీకంతా - పూర్వజన్మంలో మనం ఎవరమో'

'ఏమో ఎవరు చెప్పగలరు -ఆకళ్ళలోని నీలిమబ్బులు ఎలాంటి హృదయాన్నైనా ఆర్ద్రిమొనరిస్తాయి-అంతే తెలుసు నాకు'

'మరి అంత అలా అంటున్నారు కదా - ఒకవేళ నేను మీకు కనపడకుండా వుండాలసొస్తేనో'

'ఏమిటీ-కనపడకుండానా- ఎందుకు రావాలి-వస్తే...నే బ్రతికివుండగా రాదు-వస్తే... రాదు - రాకూడదు...రానీయను'

'మనయిష్టంవా? అలావుండాలని వుంటే'

'అలావుంటే ... ఎందుకుంటుంది- వుండదు - వుండనీయను వుంటే మార్చేస్తాను. బలవత్తరం అయిన విధి వ్రాతను కూడా తుడిచివేసింది సావిత్రీ సత్యవంతుల పవిత్ర ప్రణయం'

'మీతో మాటాడుతున్నాననీ, వదినా, అన్నా కోప్పడుతున్నారు. మీ ఆచారులుగారు చంపేస్తానంటున్నారు -వూళ్ళోఅంతా గుసగుసలే'

'ఏవిటో వెధవ ప్రపంచం. అర్థంచేసికోలేని నిర్భాగ్య లోకం...ఊ - చేస్తారు ... తలపగులగొట్టే యీ మోచనలన్నీ యిపుడెందుకూ-రా-కుశాసాగా యిక్కడ కూచుని కబుర్లు చెప్పుకుందాం- అదిగో చూడు ఆరంగురంగుల పాలపిట్ట సెలయేటి కలకల ధ్వనులతో శ్రుతిగలిపి విపంచీరవంతో మనోజ్ఞంగా ఎలా పాడుతున్నాదో'

'ఇదిగో వస్తా'

'ఆ పక్షులు రెండూ చూడు రావీ! ...జంటగా ఎలా ఎగురుతున్నాయో నీలిమేఘాల్లోకి, రెక్కలల్లాడిస్తూ'

'ఇదిగో ఇలాచూడండి ఆ చిత్రవర్ణాల పాలపిట్ట ముక్కుతో నీళ్ళుపీల్చి ఎలా తాగిస్తుందో'

'అదంతా ప్రకృతియొక్క ప్రణయతత్వం ప్రేమ తెలీని మానవజాతికది అర్థంకాదు'

'అబ్బా చూడండి వాటి వంకచూస్తే ముద్దొస్తోందీ'

'అవును...మరచిపోయాను, అన్నం తిన్నావ్'

'లేదు-ఇదిగో యిక్కడకే తెచ్చుకున్నా-కాస్సేపుండి తింటాలెండి-మీరో'

'ఇంకాలేదు'

'నయంవేగా-ఇంకా లేదట - అయితే యీవాళకి ఆటలూ వద్దు-పాటలూ వద్దు- వెళ్ళి అన్నంతినిరండి ముందు'

'ఊహూ'

'ఏంవీ'

'వద్దు'

'ఎందకనీ'

'వుత్తనే'

'ఆకలి వేయదూ-అయితే నేనూ తిననూ'

'అలాకాదు-నువ్వుతిను'

'ఊఁహూ'

ఈస్టుయిండియా ఫిలుంకంపెనీ



గుల్ అహమద్ - సబితాదేవిగార్లు నటించిన 'చంద్రగుప్త'లోని ఒక దృశ్యము.

Saraswata Niketanam,
VETAPALEM.

# THE SOUTH INDIA CO-OPERATIVE INSURANCE SOCIETY, LTD.,

**MADRAS.**

# ది సౌత్ ఇండియా కో-ఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీ, లిమిటెడ్

పోస్టుబాక్సు నెం 182 రు. మద్రాసు.

ఈ సొసైటీలో ప్రీమియములు చాలాతక్కువే! ఎందుచేత? కార్యనిర్వాహణమునకగు ఖర్చు చాల తక్కువగుటచేత.

దక్షిణహిందూదేశమున కంతకు నీ సొసైటీ యొక్క టియేనా? ఔను ఎందువలన? సహకారధర్మములమీద నడుపబడుటవలన.

జనసామాన్యమునకు చాల ఉపయోగించునట! ఏ విధమున? రు 100 లు తక్కువ మొత్తము మొదలు రు 5000 లు వరకు మాత్రమే పాలసీలు జారీచేయుటవలన.

దీనిలో కార్యనిర్వాహణవ్యయము చాలతక్కువా? ఔను. ఎట్లు? సహకారసంఘలాభములను పొందుటచేతను, విశేషవ్యయమునకు కారణమగు బ్రాంచి ఆఫీసుల నెలకొల్పకపోవుటచేతను.

బ్రాంచిఆఫీసులస్థాపింపకనే మంచివ్యాపారము చేయుచున్నట్లున్నది. ఏలాగున? రాజధానిలోని సహకారసంస్థల కనుబంధములుగా లోకల్ బోర్డులను స్థాపించి.

ఈ ప్రణాళిక పాలసీదారులకు చాల సౌకర్యమే! ఔను. మనియార్డరునకగు కమీషనుఖర్చు లేకుండ పాలసీదారులు సహకారసంస్థలలో వారి ప్రీమియములను చెల్లింపవచ్చును.

సహకారసంఘలాభము లెవ్వి? ముఖ్యమైనవా? ఔను రాబడిపన్ను లేకపోవుట, స్టాంపుడ్యూటీ లేకపోవుట మొదలైనవిన్ని, పాలసీదారులే వాటాదారులగుట.

మీకు లాభముకావలెనా, నష్టముకావలెనా? లాభమే. ఐన, ఆలస్యము చేయక నేడే ఈ సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీలో నొక పాలసీ తీసికొనుము.

'నామాట వినవూ'

'నామాట వినరూ-పోనీ అసలు కారణం ఏఁవిటో చెప్పండి.'

'ఆకలి వేయక.'

'పుత్తది'

'నిజఁవే'

'కాదు-అదిగో మీకంఠసారమే ధ్వనిస్తోంది-ఏదో వుందని-చెప్పరూ'

'ఏఁవీలేదు'

'ఏఁవీ లేకపోవడమేఁవిటీ...అయితే...అదేఁవిటీ...ఆకళ్ళ నీళ్ళేఁవిటీ - ఆమాట వణకేఁవిటీ-ఏఁవండీ'

'...........'

'చెప్పరూ-నన్ను చంపుకుతిన్నట్టే చెప్పకపోతేనీ'

'అబ్బే ఏఁవీలేదోయీ'

'వున్నదే'

'మామూలే'

'అంటే'

'నీతో మాటాడుతున్నాననీ ఎవళ్లూ వారం యివ్వనన్నారు'

'మీఆచారులుగారూ'

'నీతో మాటాడ్డం మానేవరకు పాఠాలు చెప్పనన్నారు-తనకు కనపడవద్దన్నారు'

'ఇదంతా యీదరిద్రదేవత మహిమ - యీపెద్దమ్మ వదిలితేగాని మీకు సుఖం వుండదు-నా మాలాన్ని మీకులంవాళ్ళంతా...'

'రాఁవీ నువ్వులేకపోతే ఏవన్నా వుందీ...నాకు నవజీవనం-పోశావు-లేని సంతోషం యిచ్చావ్...నాకులం అంతా వొక ఎత్తు-నువ్వొక ఎత్తు-ఆ-కాదు-ప్రపంచం అంతా వొకయెత్తు-నువ్వొకయెత్తు'

'ఆ యీదరిద్ర'

'తేపతేపకు అలా అనకు...ముందు అన్నంతిను'

'అన్నంలాగే వుంది బ్రతుకు...మీరు తినకపోతే నేను మాత్రం తింటానా'

'తిను చిట్టీ'

'మీకు వారందొరికేవరకూ నేనూ తిననూ'

'తినవూ'

'ఊహూ'

'పోనీ, మనిద్దరం తిందాం రా'

'మనిద్దరంనా...యిక్కడా'

'ఏఁవీ'

'...ఏఁవీలేదు - అయితే ఆమోదుగాకులు కొయ్యండి నాలుగు'

పక్కనేవున్న మోదుగుచెట్టుమీదవున్న కోవిలమ్మ యీ అభాగ్యజీవి ఉదంతం కావల్సు జాలిగొంతుతో పాడుతోంది. ఇందాకటి ఆపాలపిట్ట రెల్లుమొక్కమీద తిష్టవేసి ప్రియురాలికేదో తినిపిస్తూ అతన్ని వూరిస్తోంది.

అతడు నాలుగు మోదుగాకులు తెంచాడు. కింద వున్న కొబ్బరీనులతో వొక ఆకుగా కుట్టాడు ఆనాల్గింటినీ.

'ఎంచక్కా కుట్టారండీ విస్తరూ'

'ఏఁవీ చేతగాకపోతే ఎలా-ఇదైనా-'

'ఎవరైనా వస్తారేమో-రండి గుడిసలో కూచుందాం-ఏదో గుడిస...మీ గుడిలా వుండదు'

'అలాకాదు...అది రాతిగుడి-ఇదిప్రణయదేవాలయం. అక్కడధిష్ఠానదేవత-జీవమే లేని కఠినపాషాణం - ఇక్కడధిదేవత నవజీవనం యిచ్చే నీవూ-అక్కడుపాసకులు-తోడిమానవుల కష్టపరంపరలను చూచి వొక్క అశ్రుకణమైనా రాల్చని దౌర్భాగ్యసోదరులూ-ఇక్కడర్చకులు-నేనూ-నాలోవున్న ప్రతి జీవాణువున్నూ-అంత- అంత...వ్యత్యాసం వుంది.'

'చాల్లెండి వర్ణనా' అని వదులువదులుగా వున్న ముడి నుండి విడువడి ముఖంమీద వయ్యారంగా వూగిసలాడుతోన్న తుమ్మెద వెంట్రుకలను సవరించుకుంటూ ఆ చిన్ని లేతచేతులతో అతని వేళ్ళను మృదువుగా తాకింది రమ్మనీ. తల్లి వెనకాలె వెళ్ళే

లేగదూడలా కిక్కురుమన కుండా వెళ్ళాడు-బెదరు చూపులతో పచ్చిక బయళ్లందు కసవుమేసే లేడిజంటలా కూచున్నా రిద్దరూ అన్నం ముందు.

దూరాన మెండుమావిడాకుల గలగల... కాళ్ళీడ్చుకుంటూ, బొజ్జ అల్లాడిస్తూ, కాలయముడిలా వస్తున్నాడు ఆచార్యులు - కళ్ళెదుట యీ దృశ్యం...ఇంకేవుంది - ప్రపంచం కూలిపోయింది...ప్రళయం వచ్చేసింది ఆయనదృష్టిలో...కలికాలం అంతా అక్కడే-అప్పుడే కనపడింది అయ్యవారికి-రాక్షసి...పిశాచి...మహామ్మారి... తయారయ్యింది ..ఆఁఆఁ వెధవ... మాలకూడు - చాకలికూడు- అంటూ వెంటనే, పక్కనే దగ్గరగా చాకలిపొయ్యివద్ద వున్న దుంగనెత్తి సత్తువకొలదీ విసరేశాడు పిచ్చికోపంతో...

'అమ్మా-సచ్చా-అయ్యో ...చండీదాసు-చ-ం-డీ-' ఇహ మాటాడలేక పోయింది- ఇదంతా వొక్క ముహుర్తంలో-సినీమాలో ప్రకరణాల్లా జరిగిపోయిం దతని ముందు...

'శనివదిలిందా ... ఇంకా లేదూ...' అని కంఠం నొక్కబోతాడు ఆచార్యులు. చండీదాసు ఆతన్ని వెనక్కి లాగేస్తూ 'నారామి - నాజీవకళ-వదలండి' అంటూ ఏడుస్తాడు.

'తగులడు- ఏడు- ప్రాయశ్చిత్తం' అని గావుకేకలు వేస్తూ యింకాకోపం పట్టలేక పడివున్న రామివైపు వురిమి చూస్తాడు ఆచార్యులు. కాలితో తన్నబోతాడు.

చండీదాసు కవోష్ణరక్తం మరింత వేడెక్కుతుంది. నెత్తుటిలో తడిసివున్న, దుంగనెత్తుతాడు, రెండుచేతులతోనూ.

'ఎందుకూ'

'ఎందుకా...' పిచ్చిగా నవ్వుతాడు.

'ఎందుకా - ప్రాయశ్చిత్తం - ప్రాయశ్చిత్తం...నా బంగారురామి' అని ఫెడీల్మని వొక్కపెట్టు పెడతాడు ఆచార్యునిశిరంమీద...

మిలమిలలాడుతూ ప్రవహిస్తోన్న నెలయేరు జాలి గొంతుతో ఏదో చెబుతుంది చండీదాసుకి.

—కంటిపూడి జానకిరామ చౌదరి.

## ఇంత సౌందర్యమెందులకే ?

*

ఇంత సౌందర్యమెందులకే త్వదీయ
పాదములు కందుననుభీతి బాటలందు
పూలవెదజల్లుచుకన్ ముందు బోవు నన్ను
జూడ నించుక కనురెప్ప లాడవేని.

*

ఇంత సౌందర్య మెందులకే త్వదీయ
రూపరేఖా విలాసమ్ము తేప తేప
జూచినకన్ దృష్టిదోషమ్ము సోకుననుచు
కనుల బంధించుకొను నన్ను గని యొకింత
కరుణ బిలువంగ పెదవులు కదలవేని.

*

—తన్నీరు కృష్ణమూర్తి, బి.ఏ.

# వలచివచ్చిన ఊర్వశి

సీ. వలపించుటే కాని వలచి దక్కవుగదా కుసుమబాణునికైనఁ గోమలాంగి!
యోరకంటనె కాని తేఱిచూడవుగదా యలకళానిధినైన నలసగమన!
వినయంబులే కాని చనువు వేఁడవుగదా దేవేంద్రునైన నిందీవరాక్షి!
బయటిమాటలె కాని భావమియ్యవుగదా రాజరాజునకైన రాజవదన!

అనియు,

సీ. కిన్నరస్వరలీల గేరు నీగానవిద్యామాధురికి వీను లప్పగించి
అవికఁ బిక్కటములై కవబొల్చు నీదుగుబ్బలకు భావంబులు పాలుపఱచి
పైసోఁకు నీగీతపదరసవ్యంజకోజ్జ్వలదృష్టి కాస్యముల్ వశమొనర్చి
యపరంజిపసిఁడిచాయల నీదు మైమెఱుంగులకుఁ గన్కవలు దక్కోలుచేసి

గీ. రక్తిఁగడుజొక్కి చిత్తరుప్రతిమలగుచు నుండుదురుగాదె యింద్రాదు లోలతాంగి!
కామతూర్యాయమానఘల్లులరవాంఘ్రివలయవై నీవు నాట్యంబు సలుపునపుడు.

అనియు పలుతెఱంగుల ప్రస్తుతింపబడిన దేవవేశ్యారత్నము ఊర్వశి వలచి రాగా వలదనిన పురుషుఁ డొక్కఁడున్నాడు. అతడు అర్జునుడు.

ఊర్వశికి పరాక్రమశాలురయెడ మక్కువ యెక్కువ. పరాక్రమము మూలముననే ఆమె పురూరవుని ప్రేమించినది. ఆమె దేవలోకవాసిని. పురూరవుడు మానవలోకవాసి. ఆతని పొందుగోరి ఆమెపడ్డ వలవంత యింతింతకాదు.

క. భువిఁ బుణ్యము లొనరింతురు దివిభోగము లందుకొఱకుఁ దిరముగ వ్రతముల్
దివినుండి చేసె నూర్వశి భువిభోగముకొఱకు నిది యపూర్వముగాదే!

అను చెలికత్తెల అపహాస్యమునకు గుఱియై ఆమె పురూరవునికొఱకు భువికి దిగివచ్చినది. కావుననే

చా, వలచినచోటికేగు శుకవాణి సముద్రములైన నీఁదుఁబో
తలఁప నిరంకుశంబులుగదా జవరాండ్ర తలంపు లెయ్యెడన్!

అను వాక్యము పుట్టినది. పురూరవుని వలెనే అర్జునునికూడ పరాక్రమము కొఱకే ఆమె ప్రేమించినది. కాని పురూరవునిపట్ల ఈడేఱిన ఆమె మనోరథము అర్జునునిపట్ల విఘాతము నొందినది. దీనికి కారణముగలదు. పురూరవుని వలచి వలపించుకొనుటలో ఆమె నిదానమును చూపినది. కాని అర్జునునివలచి వలపించుకొనుటలో ఆమె వేగిరపడినది. 'వనిత తనంతఁదా వలచివచ్చిన చుల్కనగాదె యేరికిన్' అను నుడి ఆమెకు తెలిసినదే. పురూరవుని వలచి వలపించుకొనుటలో

చ. వలచితినంచుఁ బోయి జనవల్లభు నేనయి పల్కరించినన్
జులకఁదనంబుగాదె ననుఁజూచి యనాదరణంబు సేసినన్

అని జాగ్రత్తపడినది. మఱియు

క. మనసియ్యక యలయించును దనువలచిన రంభనైనఁ దావలచినచోఁ
జెనఁటికినైనను వశుఁడై చనువిచ్చును బురుషుఁ డెంతసరసుండైనన్

అని పురుషుని మనస్తత్వమును పోల్చిపట్టినది. అట్టి అనుభవజ్ఞురాలు అర్జునునికామించుటలో ఏల వేగిరపడినది ? శివునితో ఒక్కడై పోరి పాశుపతాస్త్రమును పొంది అర్జునుడు చుట్టపుజూపుగా స్వర్గలోకమునకు వచ్చియున్నాడు. ఆత డక్కడ పెక్కుదినము లుండడు. తిరిగి ఇంద్రసహాయార్థియై నివాతకవచులమీఁదికి యుద్ధమునకు బోవనున్నాడు. వలచి నెమ్మదిమీఁద వలపించుకొనుటకు కాలములేదు. అదియునుగాక ఆమె పురూరవునివలె అర్జునుని వివాహమాడ దలంపలేదు. ఒకసారి మక్కువ తీర్చుకొనుటయే ఆమె ఈప్సితము. కాలహరణమునకు విశేషావకాశము లేకుండుట – ఒక్కసారి మక్కువతీర్చుకొనుట మాత్రము తన ఈప్సితమగుట కారణముగా ఇప్పట్టున ఊర్వశి వలచి వలపించుకొనుటలో 'పక్కన వేసరి' వేగిరపడినది.

వేగిరపడినదియేగాని అర్జునుని వశ్యముగావించుకొనుటకై పచరింపవలసిన మాయలలో, చేయవలసిన వాదములలో ఆమె ఎంతమాత్రమును లోపము చేయలేదు. రాత్రిసమయమున ఒంటరిపాటున 'పురుషులు మమతఁబొందరె చక్కనియింతిఁ జూచినన్' అనుకొన్నది. ఆనిశాసమయమున ఆమె మందారవిపినవీథిని దివ్యసౌధమున విడిసియున్న అర్జునుని కడకు వచ్చినతీరు కవి ఇట్లు వర్ణించుచున్నాడు :

సీ. పదునాల్గు జాతుల త్రిదశాంగనలయందుఁ బేరుఁబెంపునుగల నీరజాక్షి
నీరజనాభుని యూరుకాండంబున నుద్భవంబందిన యుజ్జ్వలాంగి
యంభోనిధానంబు నాపోశనముగొన్న కలశసంభవుఁగన్న కంబుకంఠి
వసుధయందుఁ బురూరువశ్చక్రవర్తికిఁ బ్రాణవల్లభయైన పద్మనయన

గీ. కట్టి తొడి పూసి కైసేసి కౌతుకమునఁ గొంగుదిగఁగ నీలిపుట్టంబు ముసుఁగువెట్టి
గాజు లెగఁద్రోసి చప్పుడు గాకయుండ వచ్చె నూర్వశి యర్జునావాసమునకు.

చంద్రికాధవళదుకూలములు కట్టినది. మణిభూషణములు దొడిగినది. మృగమదకర్పూరకుంకుమోన్మిశ్రితసుగంధములు పూసినది. వివిధసురభికుసుమవిసరములు ముడిచినది. కొంగుదిగునట్లు నీలివస్త్రము ముసుగువెట్టినది. చప్పుడు కాకుండుటకు గాజులు ఎగద్రోసికొన్నది. బయలుదేరి వచ్చినది. వచ్చుసరికి అర్జునుడు ఏస్థితిలో నున్నాడు ?

హంసతూలతల్పమున విశాలనేత్రపద్మములు మొగిడ్చి సుఖసుప్తి నొందుచున్నాడు. ఆకాముకురాలికి అప్పుడాతడు శేషునిపై పవళించిన విష్ణుమూర్తివలె కనిపించినాడు. నిద్రపోవుచున్నవానియెడ కన్నుగీట్లు పనిచేయవు. స్పర్శవలననే ఆతని నాకర్షింపవలయును.

కావున పగడములవంటి తన పాణిపల్లవములతో ఆతని మృదుపాదము లొత్తినది. మెల్లగ మేల్కొల్పినది.

నేత్రములు విప్పిచూచుసరికి అర్జునునకు 'చిత్తజుచార్వసి' అని-'రతిరహస్యజ్ఞానరాశి' అని కొనియాడబడు నిర్జరలోకలలామయైన ఊర్వశి ఎదుట ఉద్యుక్తయైయున్నది. అగుగాక ! పాండుకుమారుని మనమున మన్మథవికారము కలుగలేదు. ఆమెను చూచి పాన్పుదిగి వినయముతో నమస్కరించినాడు. 'పచ్చకప్పురంబువంటి ఆ సుపర్వభోగినీలలామంబు' ఆరాత్రిసమయమున తన పడుకటింటికి ఒంటరిగా ఎందుకువచ్చినదో ఆనిర్వికారునకు అర్థమేకాలేదు. 'ఈనడికిరేయి నొంటిమై యింతదూర మేమికార్యంబు మదిఁగోరి యేగుదెంచితివి ?' అని ప్రశ్నించినాడు. పైగా

గీ. ఆదినారాయణుని యూరు వంబుజాక్షి ! భువనవిఖ్యాతమైన నీ పుట్టినిల్లు
పావనుఁడనైతి నీపాదపద్మములకు వందనముఁజేసి వరభక్తినైభవమున.

అని సంతోషించినాడు. ఆలింగనము కాంక్షించివచ్చిన కాముకురాలికి ఈ నమస్కారలబ్ధి ఎట్లుండును ? అంతతో ఊరుకొన్నాడా ? ఆనిర్వికారుడు ఆమెను 'ముత్తవ్వ'ను గావించినాడు. తనతాతగారైన పురూరవున కామె ఇల్లాలగుట జ్ఞప్తి కెలయించినాడు.

శా. మత్తారాతివిదారణుండు జనసన్మాన్యుండు సీతాంశువం
శోత్తంసంబు పురూరవుండు ప్రచలద్యోగుండు మాతాతగా
రత్నోయాకరమేఖలాపతికి నిల్లాలైతిగా కావున
న్మత్తో వీవిదిలెస్స మన్ననిపయి న్మోహంబు వాటింపఁగన్.

తాను ముత్తవ్వను, తనకు అర్జునుడు మునిమనుమడు అను భావముతో నామె అచ్చటికి వచ్చియున్నదా ? ఇచ్ఛావిఘాతమును సూచించు అర్జునుని వాక్యములు 'చెల్లాటమాడు మోహము లేర్లయి వర్తిల్లు' చుండగా ఆమెకెట్లు హితవులగును ?

అర్జునుడు తన్ను 'ముత్తవ్వా' అనుచున్నను 'అమ్మచ్చకంటి చేతోభవవికారమును' హరింపజాలకపోయినది. కొంచెము విడమర్చి చెప్పినచో లాభము కలుగకపోదని ఆమె తలంచి ఇట్లు చెప్పినది : 'కురువర ! నీవు స్వర్గమునకు వచ్చిననాడు దేవతలందరు ఇంద్రుని పంపున ఒక మహోత్సవము కావించినారు. ఆసభలో నేను నాట్యము సల్పితిని. ఆ సమయమున నీదృష్టి నాపయిని బడినది. అది కారణముగా నీయందు నాకు అనురాగము కల్గినది. కావున నీసంగమము కోరివచ్చితిని. అనుగ్రహింపుము.'

అను పలుకులు వినినతోడనే అర్జునుడు చేతులతో చెవులుమూసుకొన్నాడు. హరస్మరణము చేసినాడు. 'హరహర! ఇట్టి పాతకములాడుటకు నీకు నోరెటులాడినది ? నాతండ్రియగు ఇంద్రునకు నీవు ప్రియువు. అగుట నాకు తల్లివి. నీవును, కుంతియు, మాద్రియు, శచీదేవియు నాకు ఒక్కరూపే. అదియునుగాక నావంశకర్తయైన పురూరవునకు నీవు పత్నివి. అగుట నాకు ముత్తవతల్లివి. పౌరవవంశమాతవని మహాత్ములు చెప్పగా ఆకారణమున సభా

స్థలమున నేను నిన్నుచూచితిని. అంతియకాని అన్యముకాదు. నన్ను పుత్రభావమున కరుణింపుము' అని వేడుకొన్నాడు.

ఆపల్కులు ఒప్పులే అయినను 'నీరుడప్పికి నేయియుంబోలె' అప్పటి ఆకాముకురాలికి అవి అప్రియములైనవి. 'నను జనయిత్రియంచు నొకనాయము( బల్కెదు వక్రభాషలన్' అన్నది. తన్ను తల్లిగా ఉద్బోధించుచున్న అర్జునునిమాట వక్రభాషయ(ట. ఏమినీతి! మఱియామెవైచు ప్రశ్న చూడుడు.

గీ. నీకు నేనాటి తల్లిని నిజముసెపుమ? యమరలోకంబు వేశ్యల మైన మాకు
నిట్టి తగవులు నడవ వహీనబాహువీర్య! యిచ్చట వావియు వెదక(జనువె?

గీ. ఏల యొనొన్నితరంబుల నీడ(బడ్డ పెద్దవావులు శోధించి గుద్దలింప?
వారకాంతాజనములకు వావిగలదె? మాను మర్జున! మొగమోట లేనిమాట.

అర్జునునిది మొగమోట లేని మాటట. మన్మథపీడిత మఱియేమనగలదు? ఇంకను ఆమె చెప్పినది: "మేము అచ్చరలము. తాలి(గట్టి మమ్ము ఎవ్వరును కైవసమున నుంచుకొనరు. పూరువంశమున పుట్టిన పుత్రులు, పౌత్రులు, ప్రపౌత్రులు తపస్స్వప్రులై ఇచ్చటకు వచ్చి నాతోడ గూడి సుఖియింతురు. ఇందు వ్యతిక్రమము ఇంతయును లేదు. కావున నన్ను త్రోసిపుచ్చక నామనోరథము సఫలము గావింపుము. అదియునుగాక ఈలోకమున వనితలును, పురుషులును విచ్చలవిడి క్రీడింతురు. ఇచ్చటి కిది అనిందితమైన ఆచారము. నీవును త్రిదివమునకు వచ్చినప్పుడే దివ్యపురుషుడవైతివి. కావున నామనోరథము సఫలము గావింపుము."

'వలపుగలచోట ఎట్లయిన( గలయ(జూచు' వింతవాదము కాదిది. ఊర్వశి చెప్పినదంతయు సత్యమే. కాని వాదముకంటె వ్రతము ప్రధానముగా నెన్నుకొను మహనీయుడగు అర్జునుని మనస్సున కీవాదము నచ్చలేదు. అతడు నిర్వికారధైర్యధుర్యుడై

క. ఓహో యిమ్మెయి ధర్మద్రోహోక్తులు నలుక(దగునె దోసం బది గా
దే హరిహరి! మనమున( దగవూహింపక నన్ను బలుకు టుచితమె నీకున్?

అని ప్రశ్నించినాడు. 'జగంబులు పుట్టింపను మనుపను సమయింపను గర్తలైన దేవతలకు నెట్లు నడచిన నెగ్గులేదు. నేను గర్మభూమిని జనియించి కర్మఠుండనైతి. నాకు నిచ్చటి యాచారం బుచితంబుగాదు.' అని నిష్కర్షగా చెప్పివైచినాడు.

ఇంతతోనైన ఊర్వశికి ఆశాపరిత్యాగమైనదా? లేదు. దేవవేశ్యయైన తనకు నిరభ్యంతరముగా ఎల్లరిచే భోగింపబడుటకు అర్హతగలదను వాదము కార్యకారి కాకపోగా ఆమె తనపక్షపువాదము మాని ఆతనిపక్షపువాదమును చేకొన్నది. ఆతని మగపోడిమినైన నుపలక్షింపు మన్నది. చూడుడు:

ఉ. వాసవు నిండు(గొల్వునకు వచ్చినయప్పుడు తత్సమంచితా
ర్ధాసనమెక్కియున్న నిను నంగజసన్నిభు( జూచి పుష్పబా

ణాసను పుష్పబాణనివహమ్ములకుం గురియైతి నిట్టి నా
యాస నిరాకరింపఁదగవా? మగవాఁడవుకావ? యర్జునా!

ఆతని మగతనము ప్రశంసించుటతో ఆమెకు ఆతని భార్యవిషయము జ్ఞప్తికివచ్చి అన్య కాంతల సంటనని ఆతడు ఆమెకు బాసచేసెనేమో అను సంశయము కలిగినది. ఆబాస అంత పాటింపరానిదట. చూడుడు :

గీ. ప్రమద మెసలారఁ బాంచాలరాజసుతకు వలచి చేసితివో సత్యవాక్ప్రతిజ్ఞ
యన్యకాంతలదెసఁ బోవననుచు నీవు? భామలకుఁజేయు సత్యంబు పాడిగాదు.

ఎంతటి యుక్తివాదములు చేయుచున్నను అర్జునుని ప్రేమ ఇంకను అంకెకు రాలేదు. వలచి పచ్చినంములకు తాను చుల్కనగుచుండుట గమనించి ఆమె తాను సామాన్యురాలను కానని హెచ్చరించుచు ఇట్లు చెప్పినది :

చ. అతులితధైర్యశౌర్యమహిమాద్భుత సాహసులై మహోగ్రతా
ప్రతతనిశాతనిష్కృపకృపాణవిదారితదేహులై రణ.
క్షితిఁబడి వత్తురై దుపదిసేయక నాకయి యిట్టి నన్ను నీ
వితరులఁబోలెఁ గైకొనక యేఁచెద వక్కట పాండునందనా!

తన ఉత్కర్ష తాను వర్ణించుకొనుటతో ఆమెకు ఒకవిధమైన ఉదుటు వచ్చినది. అందుతో. ‘ఆ మన్మథాస్త్రకీలాకులతప్తచిత్త’

క. నామోహము నావేడుక నామానము నాప్రియంబు న్లాతగులము నా
ప్రేమమ్మును నాతెగువయు తామముఁ బొందంగ నూరకయె పోవుదునే?

అని సాహసోద్రేకమున అర్జునుని ప్రశ్నింపగలిగినది. ఆ ఉద్రేకములో అర్జునుని బిగువంతయు ఆమెకు వట్టివేడబ మనిపించినది. కాగా ఆతుటారికత్తె

క. వేసాలఁ బోకు రమ్మా పూసెజ్జకుఁ బ్రొద్దుపోయెఁ బులియుట చాలున్
వాసవనందన! కుసుమశరాసన కేళీకలావిహారంబులకున్.

అని సాపేక్షవీక్షణములతో పెనగులాడినది.

ఈ పెనగులాటకు జీవముపోయుట కా ఎమ్మెలాడి లేమొలకనవ్వులు అపాంగముప తొంగలింపగా ‘నీవు బ్రహ్మచర్యవ్రతదీక్షాపరాయణుండవే?’ అని అర్జునుని ఉపాలంభించి నది ; తనచేతిలో విలాసార్థము పట్టిన కమలముయొక్క పుప్పొడి అంటుకొనునట్లుగా గాజులు గల్లుగల్లుమనుచుండ నాతనిని కొట్టినది. పుష్పబాణుని పుష్పబాణనివహంబులు పనిచేయ కుండుగాక! ఆపువుబోడి పూవుదాడియైన కార్యకారికాకుండునా?

మ. అతిసౌందర్యము నాటపాటవగ యొయ్యారంబు వాక్ప్రౌఢియున్
రతిఁజొప్పడ్డి కళల్ ఘటించి మనసుల్ రంజిల్లగాఁజేయు ప్రౌ

షతయుం గల్గిన యింతి డాకొనిన నిష్ఠల్ వీడి మోహింతు ర
య్యతిముఖ్యుల్ సెగపొంతవెన్న పురుషుండౌ?బో వధూచేష్టకున్

అనిగదా లోకజ్ఞుడగు కవి చాటుచున్నాడు.

అబ్బే 'దమ్మడు చిక్కలేదు.' అత్యంతధీరోదాత్తుఁడు కావున ఆత డావేటునకు అంత రమున మిసిమింతుడునుగాక ఆత్మనిష్ఠాచలనము కానీయక ఏపాకమునకును రాక తన మొగ మువంచుకొని నిర్వికారుడై యూరకున్నాడు. కానలో కాసినవెన్నెలవలె తనకన్నులవలపు ఇట్లు మిన్నక పాలివోవుటతో ఆమె చిన్నవోయినది ; నిట్టూర్పులు నిగిడించినది ; మనోరథ విఘాతమువలన కోపముపుట్టుకొచ్చినది. అందుపై ఆమె నరునుద్దేశించి 'వలచి వచ్చిన నన్ను నపుంసకునివలె తిరస్కరించితివి గావున నీవు మర్త్యలోకమున మానవర్జితుడవై మానినీ మధ్యమున ఒకఏడాదిపాటు నపుంసకుడవై యుందువుగాక!' అని శపించినది. ఔరా! ఇచ్ఛా విఘాతమైనను 'కలుగదుగదా వివేకంబు కాముకులకును.' ఇట్లు శపించి ఊర్వశి దిగ్గనలేచి మొగము గంటువెట్టుకొని ఇంటికి పోయినది.

సీ. పుట్టనయి ల్లే(ప్రపూర్ణేందుముఖికిని నారాయణస్వామి యూరుసీమ
నాట్యవేదార్థంబునకు నేకళావతి లాస్యనిరూఢి కూలంకషంబు
ప్రథమబహూకారపాత్ర పాత్రలలోన నేయింతి హరిహరాజేంద్రసభలఁ
గారణం బేహంసగమన రూప మరుంధతీమనోహరుపునర్దేహలబ్ధి

గీ. కట్టి యూర్వసి భువనమోహనవిలాసనిజకటాక్షపరంపరావిజితకుసుమ
ధన్వదార్వసి

అనియు,

ఉ. ఆటదియన్న నూర్వశి యదార్థము పల్కుదు నింతెకాని మో
మోటమి నాకు సైపదు బుధోత్తమ! పాటలనాటలందు న
య్యాటలమేటి చక్కఁదనమా గానమా యలబోటికే తగున్
పాటలగంధులెల్ల నలభామిని గోటికి సాటివత్తురే?

అనియు కొనియాడబడిన ఊర్వశికి ఎంతగతి పట్టినది?

మఱి ఊర్వశి శాపమునకు అర్జును డేమైన దిగులొందినాఁడా? లేదు. దానిని విధివశ ముగా ఎన్నుకొన్నాడు. మఱునా డుదయమున ఈ వృత్తాంతము ఇంద్రుడువిని కొడుకును మెచ్చుకొన్నాడు. ఇంద్రునితో కంఠములుకలిపి మనముకూడ అర్జునుని ఇట్లని స్తుతింతము గాక!

క. నీయట్టి ధైర్యవంతుని నేయుగములనైనఁగాన మెన్నండును ద
ర్మాయత్తమతివి మునులకు నీయింద్రియజయము కీర్తనీయము తండ్రీ!

క. విజితేంద్రియుఁడై మెలఁగిన విజయుని యీపూతచరిత విని రేని జనుల్
విజితేంద్రియులై పాపములజతం బడ కెపుడు సుఖములం బడెదరొగిన్.

# ఆనాడు ఆషాఢ శుద్ధ పాడ్యమి

'సౌరభము లేలచిమ్ముఁ బుష్పవ్రజంబు? చంద్రిక నేల వెదఁజల్లుఁ జందమామ?
ఏల సలిలంబుపాఱు? గాడ్పేలవిసరు? ఏల నాహృదయంబు ప్రేమించు నిన్ను?'

—శ్రీ కృష్ణశాస్త్రి.

౧

అబ్బాయి అసలుపేరు మోహనరావు. అదే అతనితల్లి తండ్రులు బాలసారనాడు పెట్టినపేరు. అందుకు నిదర్శనంగా స్కూలు రిజిష్టరులో ఆ పేరు నమోదు చేయబడిఉంది. అతని ఆదరనామమాత్రం అబ్బాయే. అతనికుటుంబమూ మా కుటుంబమేగాక అతని ప్రాణస్నేహితులు, ఆప్తులనదగినవారు, అందరూ అతణ్ణి అబ్బాయిఅనే పిలుస్తారు. మా బంధువు లందరికీ—అతని అసలుపేరు తెలీనివాళ్లకుగూడా—అబ్బాయిఅంటే మోహనరావురూపమే స్ఫురిస్తుంది. అందుకు నేనూ ఆ పేరే వాడుతున్నాను.




అబ్బాయి ఇవాళ మూడుగంటల మెయిలులో వస్తాడని నిన్న సాయంత్రమే తంతివచ్చింది; ప్రపంచంలో ఉన్న ఆనందమంతా ఒక్కసారి మాకు లభించినట్లయింది. 'ఇవాళ అన్నయ్యవస్తాడు, నేను బడికి వెళ్ల' నని ఇంటివద్దనే ఉండిపోయింది మా చెల్లాయి. మధ్యాహ్నం పదకొండు గంటలకల్లా మాభోజనా లయినాయి. తరువాత మా చెల్లెలికి చముర్రాసి తలదువ్వి రిబ్బనుపెట్టి జడవేశాను; సబ్బుతో ముఖంరుద్ది కాటుగా బొట్టూపెట్టి, ఓయలుపరికిణీ ఫ్రాకూ తొడిగాను. దానిముస్తాబు పూర్తయింది.

నేనూ చక్కగా తలదువ్వుకుని మా వొదినకోసం తెప్పించిన మల్లెపూలలో కొన్నిటిని అర్ధచంద్రాకృతిగా ముడుచుకున్నాను; ముఖం రుద్దుకుని కాటుకా బొట్టూ పెట్టుకుని, లేతగులాబీ సన్నచీరా, మబ్బువన్నె వాయిలీ జాకట్టూ ధరించి అద్దం ముందు నిలుచుని నా అందమంతా ఒకసారి చూసుకున్నాను.

తుమ్మెద రెక్కలవలె నిగనిగలాడుతూ, ముడిలో ఇమడక ముందుకు జారే నా ముంగురులూ - వాటికింద

సాంద్రంగా, సున్నగా తళతళ మెరిసే నా ముఖమూ చూస్తూఉంటే నల్లనిమేఘం లోంచి ఉదయించే పున్నపుచంద్రునిలోని శోభంతా స్ఫురణకువచ్చి 'అబ్బ! ఈ అద్దాన్ని వొదిలి ఎలావెళ్లడం!' అనిపించింది.

బింకమైన నా మబ్బురవికను ఏ మాత్రం లక్ష్యపెట్టక సన్నని పైట తెరలోంచి పైకి ఉబుకుతున్న సమున్నతమైన నా వక్షోభాగం తిలకిస్తూఉంటే మేఘుని బిగి కౌగిలినుండి తప్పించుకుందికి పెనుగులాడే మెరపు కన్నెలోని అందమంతా మనసుకెత్తట్టి చూసినకొద్దీ ఆ అందమధికమౌతున్నదేమో ననిపించింది.

మిగలపండిన తామలపాకువంటి పచ్చని నా చంపల మీదుగా వర్ష మేఘంకంటె నల్లనై, నొక్కు-నొక్కులుగా ఇరుపక్కలా దొర్లే నా ముంగురులు చూస్తూఉంటే పండువెన్నెల్లో తేలిపోతూ ఎంతచూసినా తనివి తీరని యమునాతరంగాల్లోని శోభంతా తలుపుకు వచ్చింది.,

చివరకు ఎలాగో అద్దంలోంచి నా శరీరాన్ని మళ్లించుకుని మా వొదిన మల్లెపూలు మా చెల్లెలిచేతి కిచ్చి ఇరువురమూ జానికిగారింటికి బయల్దేరాము.

మేము వెళ్లేసరికి చిట్టిని ఒళ్లోకూచో బెట్టుకుని జడ వేయడానికి అవస్థపడుతూంది మా వొదిన; చిట్టి ఎంత మాత్రము లొంగక అల్లర పెడుతూంది.

'నా బంగారుతల్లివికదూ! మా పిల్ల ఎంతబుద్ధిమంతురాలు! ఇదిగో, యివాళ నాన్నగా రొస్తారు; నీకు హార్మణీపెట్టా, బొమ్మల పుస్తకాలూ అన్నీ తీసుకొస్తారు' అని మరిపింతా లాడుతూంది మా వొదిన.

చిట్టి మట్టుకు ఆమాట లేవీ వినిపించుకోవడంలేదు.

అలాగని నాన్నగారు వస్తారంటే చిట్టికి ఉత్సాహంలేదని మనము భావించడం చాలాపొరపాటు; నాన్నగారి సంగతులు చెబుతే చిట్టికి వొళ్లు తెలీదు. అయితే ఇవాళ ఇంత నిర్లక్ష్యం వహించడానికి కారణం లేకపోలేదు.

వాళ్ళనాన్నగారు వెళ్ళి నప్పటినుంచీ చిట్టి దేనికి పంతంపట్టినా 'ఇవాళ నాన్నగా రొస్తారు; నీకు బొమ్మలపుస్తకాలూ అవీ తీసుకొస్తారు' అనిమరిపింతాలు పెడుతూ ఉండేది మా వొదిన; రెండుమూడుసార్లు పాపం ఆ మాటలు నిజంగా నమ్ముకుని నాన్న గారి కోసం ఎంతో ఉబలాటపడిపడి తుదకు నిరాశ చెందింది చిట్టి.

ఒకసారి మోసమని తెలుసుకున్న తరువాత తిరిగి మోసపోయ్యే స్వభావంకాదు చిట్టిది; అందులో రెండు మూడుసార్లు దగాపడ్డ దీ విషయంలో. అందుచాత ఎంతప్రయత్నించీ కూడా ఇవాళ తనమాట నిజమేనని చిట్టికి నమ్మకం కలిగించలేక పోతూంది మా వొదిన.

సరిగా ఆ సమయానికే మేము వారింటికి వెళ్ళడం తటస్థించింది.

మమ్మల్ని చూసి 'అదిగో, చూశావా? ఉమా, విశాలం ఎలాముస్తాబై వచ్చారో నాన్నగారొస్తారనీ!' అంది చిట్టి నుద్దేశించి మా వొదిన. చిట్టికిగూడా మమ్మల్ని చూడగానే ముస్తాబవాలని బుద్ధిపుట్టింది.

'నేను ఉమచాత జడవేయించుకుంటా' నంది చిట్టి.

నేను చిట్టిని దరికి తీసుకుని జడవేసి ముఖం రుద్ది కాటుగా బొట్టూ పెట్టాను. ఆకాటుగకళ్ళతో మధ్య నల్లనిమచ్చలో వెలుగుతున్న పున్నపు చంద్రుని లాగుంది చిట్టి ముఖము.

మా వొదిన చిట్టికి సిల్కు గౌనూ, రబ్బరుజోళ్ళూ తొడిగించి తాతగారు చేయించిన పులిగోరు పతకం గడియారపుగొలుసూ మెళ్ళో అలంకరించింది; ఆనందం పట్టలేక కెంపెక్కేలాగు చిట్టి రెండుబుగ్గలూ ముద్దు పెట్టుకుంది. వెనువెంటనే 'జుట్టు రేపేసు కోకూ, గౌను మాపేసు కోకూ, కాటుక చెదరగొట్టేసు కోకూ' అని ఆజ్ఞాపించింది.

ఏదోపని, ఏదోకల్పన, ఏదోఅల్లర చేయకుండా ఒక నిముషమైనా ఉండలేని చిట్టికి ఇంతకంటె కఠినమైన ఆజ్ఞ ఇంకేముంటుంది? మరో అప్పుడైతే తల్లిఆజ్ఞని వెంటనే తృణీకరించేదే చిట్టి. కాని, అంత చక్కని తనము స్తాబుచూసి నాన్నగారెంత ముచ్చటపడతారో, రెండేళ్లబట్టి అణిగిఉన్న నాన్నగారి గాఢమైన ప్రేమంతా ముద్దులుగా తనచిన్నిబుగ్గలనిండా, తనువునిండా వర్షించినప్పుడు తనకుకలిగే ఆనందం ఎంత అమూల్యమైందో చిట్టికి బాగా తెలుసు.

అందుచాత కదుత్తే తన ముస్తాబు కెక్కడ భంగం వస్తుందో అనేభయంతో, ఆ నగలతో దుస్తులతో

బంగారుపంజరంలో బంధింపబడ్డ చిలకలాగు చిరిచాప మీద బుద్ధిగా కూచుంది చిట్టి.

'ఎప్పుడు నాన్నగారు వచ్చి తనముస్తాబు చూస్తారు? ఎప్పుడు అమ్మతొలూకు నగలూ దుస్తులూ అమ్మకిచ్చి వేసి తిరిగి స్వేచ్ఛను పొందుతాను' అనే దాని ఆలోచన.

మా వొదినకుగూడా జడల్లి బర్మాముడిచుట్టి దానిపైని వలయాకారంగా నా చాతుర్యమంతా వినియోగించి మల్లెపూలు ముడిచాను. ముఖం రుద్దుకుని కాటుగా బొట్టూ పెట్టుకుంది మా వొదిన.

నేనే ఆమె పెట్టెతెరచి కుసుమరంగుచీరా, తేను పనిచేసిన నీలంరవికా తీసిఇచ్చాను ధరించమని.

ఆమె మొట్టమొదట 'అబ్బా! ఇవెందుకే ఇప్పుడూ!' అని గునిసింది; నామీద తేనికోపం నటిస్తూ వాటిని ధరించింది. అప్పటి ఆమె సౌందర్యం వర్ణించడానికి నాబోటి ఆడదానికి సాధ్యంకాదు.

మెరపు తీగవంటి పచ్చని శరీరచ్ఛాయ, చిరుతవాటు ముఖము, బెదరిన ఆడలేడి చూపుల్ని స్ఫురింపజేసేసోగకళ్లు, పల్చని గులాబీపెదవులు, సన్నని నడుంపైని ఆధారపడిఉన్న సమున్నతమైన వక్షోభాగం అన్నీసహజంగానే మా వొదిన చాలా అందమైందని చెప్పక చెబుతూఉంటాయి. అందులో రెండేళ్ళబట్టి కలుసుకోని తన ప్రాణానికి ప్రాణమైన భర్తను త్వరలో చూస్తాను కదా అని యెంత అణుచుకున్నా అణగక హృదయంలోంచి అలలవలె పొంగి వచ్చే ఉత్సాహం, భర్త దెగ్గిర లేనందున ఇంతకాలమూ యీఅలంకారవిషయంలో ఎంతో ఉపేక్షవహించి నేడొక్కసారి ఇంతలాళ్ళంగారించుకోడం అన్నీ కలిసి మామూలుకన్న వెయ్యిరెట్లు అధికంగా ఆమెను ప్రకాశింప జేస్తున్నాయి.

నిజంగా ఆదుస్తులవల్ల ఆమె రాణిస్తున్నదా? ఆమెవల్ల ఆదుస్తులు రాణిస్తున్నవా అని ప్రశ్నిస్తే మట్టుకు నేను సరిగా జబాబు చెప్పలేను.

నవరత్నములు పలచిన సువర్ణాభరణం; పూలతో నిండిన మాలతీలత.

రత్నములవల్ల బంగారమే రాణిస్తున్నదో, బంగారంవల్ల రత్నములే రాణిస్తున్నవో - పూలవల్ల లతే శోభిస్తున్నదో, లతవల్ల పూలే శోభిస్తున్నవో చెప్పగలిగినవారు ఆ సంగతి సులువుగా గ్రహించగలరు.

మా ముస్తాబులన్నీ పూర్తయే సరికి గడియారంరెండు ప్రోగించింది. మా దొడ్డమ్మకూడా అబ్బాయికి ఫలహారం, కాఫీ అవీ తయారుచేసి మా దెగ్గిరికి వచ్చింది. అందరం అబ్బాయి సంగతులే మాట్లాడుకుంటూ ఎప్పుడు మూడున్నర అవుతుందా అని గడియారంవైపు చూస్తూ కూచున్నాము.

కాలచక్రం గిర్రున తిరుగుతుం దంటారు; ఇవాళ చీమ గంగాయాత్రచేయడానికి తగినకారణం ఏమిటో మాలో ఎవరికీకూడా తెలీకుండాఉంది.

## ౨

— మోహనరావు నాకు బాల్యస్నేహితుడు. అతని కుటుంబమూ మా కుటుంబమూ ఇరుగుపొరుగున ఉండి చాలా కాలంనుంచీ ఎంతో మైత్రితో భేదమన్నమాట ఎరగకుండా వుండేవి. మాకూ వాళ్ళకూ ఏదో దూరపు బంధుత్వంకూడా ఉంది.

వాళ్ళనాన్న గోపాలరావుగారికి కాలేజీలో నూటయేభై రూపాయిలజీతం; వీథేబోయేవాళ్ళందరకూ పని లేకపోయినా తప్పక ఒకసారి ఆగిచూడాలని బుద్ధి పుట్టించే ఇంద్రభవనంవంటి మేడ; మేడకు నాలుగువైపులా ప్రేమకట్టినట్టు నందనవనంవంటి ఉద్యానవనం. గోడలనిండా సీనరీపటాలూ, నిలువుటద్దాలూ. గదులనిండా పట్టు సోఫాలూ, పేముకుర్చీలూ. ఇంటినిండా వెండికంచాలూ, వెండిగిన్నెలూ. పైగా పట్నానికి సమీపంలో ఏభై అరవై ఎకరాల పొలమూ, పెద్దతోటాను. ఊర్లో అతనికి గొప్పపలుకుబడి; అతనిసలహా, అతనిసహాయం, అతనిసమ్మతిలేకుండా ఆ వూర్లో యే ఉద్యమమూ, యేకార్యమూ జరగవు.

మా నాన్నగారికికూడా హైస్కూలులో తెలుగు పండితుడుగా ముప్ఫై రూపాయలజీతం, చిన్నదైనా ఇమ్మయిన పెంకుటిల్లూ, విశాలమైన పెరడూ, కొంచెము భూవసతీ అన్నీ సంసారపక్షానికి మాకు గూడా ఏమీ లోపములేదు. మా నాన్నగారికీ గోపాలరావుగారికీ శరీరాలే వేరుగా ఉండేవి.

గోపాలరావుగారికి మోహనరావొక్కడే కుమారుడు. ఆడపిల్లలులేరు. అందువల్ల ఆడపిల్లలంటే అతనికి ప్రాణం. గోపాలరావుగారూ అతనిభార్యా అబ్బాయినీ, నన్నూ ఒక్కకంటితో చూసేవారు. మా వాళ్ళకు గూడా మొగపిల్లలు లేరు. అందుకని అబ్బాయి అంటే మావాళ్ళకు పుత్రవాత్సల్యం, అందుచేత నాకూ మోహనరావుకీ మంచిస్నేహం కుదిరింది. అప్పుడు మేమిరువురం బాల్యోచితమైన ఆటపాటల్లో కలిసి మెలిసి ఉండేవాళ్ళం.

గోపాలరావుగారు ప్రతిరోజూ సాయంత్రంపూట బడినుంచిరాగానే మమ్మల్నిద్దర్నీ గుర్రపుబండిలో కూచోబెట్టుకుని వాళ్ల పొలాలకేసి షికారు తీసుకు వెళ్లేవారు. ఊరుపొలిమేర దాటేక బండిదిగి అతను పొలాల గట్లంట గడ్డితో మెత్తనై, పాము మెలికలవలె వంపులుతిరిగిన కాలిబాటను వెళుతూంటే అతని వెనకాలే నేనూ అబ్బాయి చెట్టాపట్టాలు కట్టుకుని, సాయంత్రపు సూర్యుని సువర్ణకిరణాలుమీద వాల్తూఉంటే సిగ్గున తల వాల్చిన ప్రియుని కౌగిలిలోని నూతనవధువువలె వెన్నులభారాన వంగిన వరిచేలనూ, సిగ్గువీడిన కులటలవలె నిట్టగా నిలచిన జనుముచేలనూ చూసుకుంటూ, సరదాగా కబుర్లు చెప్పుకుంటూ నడిచేవాళ్లం.

సూర్యుడు క్రుంకుతూఉంటే దూరాన భూమిమీద వాలేచోట నీలిమాకాశం పూసుకునే వింత వింతరంగులు క్రమంగా మాయమయేటప్పుడు, తూర్పుదెస చివరనున్న కొండలమీదకు మెల్లమెల్లగా చీకట్లు దిగేటప్పుడు, నిశాసుందరి అలసిన దివాకాంతుని కళ్లుమూసి చల్లగా నిద్రపుచ్చే సమయాన తిరుగుముఖమై చల్లని సంధ్య వెన్నెలలో ఈదుకుంటూ భోజనాలవేళకు ముందుగానే ఇళ్ళను చేరుకునేవాళ్ళం.

నేను తరుచు రాత్రిళ్ళు వారింటే గోపాలరావుగారి పంక్తిని అబ్బాయితో కలిసి భోజనం చేసేదాన్ని, నా పుస్తకాలూ అవీ వారింటే పెట్టుకుని అక్కడే చదువుకునేదాన్ని. నేను ఫస్టుఫారం చదువుతున్నప్పుడు అబ్బాయి ఫోర్తుఫారం చదివేవాడు. అందుచేత నేను లెఖ్ఖలూ ఇంగ్లీషూ అతనివద్ద చెప్పుకునేదాన్ని. రాత్రి తొమ్మిది పదిగంటలవరకూ అతడు చదువుతూఉంటే నేనుకూడా అంతవరకూ అతనితో పంతంపట్టి చదివేదాన్ని.

ఒక్కొక్కనాడు అటువంటి సమయంలో గోపాలరావుగారువచ్చి 'ఉమా, నీకుగూడా రాత్రి పదిగంటలవరకూ మేలుకుని చదవవలసిన అవసరం యేమీలేదు. పడుకో తల్లీ! జబ్బుచేస్తుంది' అనేవారు. నేను 'అలాగే'నని పుస్తకంముడిచి అతనూ వెళ్ళిపోయిన వెంటనే తిరిగి పుస్తకం తెరచి చదవడం మొదలుపెట్టేదాన్ని.

అబ్బాయి నాపాఠాల్లో ప్రశ్నలువేసేవాడు. నేనూ అతని పద్యాలూ అవీ పుస్తకంచూసి వప్పగించుకునేదాన్ని. ఇద్దరం చదువయ్యాక ఒక్కదగ్గిరే పక్కలు వేసుకుని సరదాగా కథలూ కబుర్లూ చెప్పుకుంటూ ఏ పన్నెండు గంటలకో నిద్రపోయేవాళ్ళం. మళ్ళీ తూర్పు తెల్లవారకముందే ఎవరు ముందులేస్తారో అని పందాలు వేసుకుని మేలుకుని ఒకసారి కొత్తపాఠాలు చూసుకునే వాళ్ళం

అప్పటి మా ఆటలూ చదువూ అన్నీ తలపుకువస్తే నాకు మరి ఒళ్ళు తెలీదు. ముప్పైమంది కుర్రవాళ్ళున్న క్లాసులో నేనొక్కర్తెనే ఆడపిల్లను. తరుచు అన్ని పరీక్షల్లోనూ నాకే ఫస్టుమార్కు వస్తూ ఉండేది. అందుకు కుర్రవాళ్ళంతా నామీదకంటే మోహనరావుమీదనే అధికంగా అసూయపడేవారు.

మోహనరావుతో కలిసి తిరగడమన్నా, అతని స్నేహితులమనిపించుకోవడమన్నా స్కూలు కుర్రవాళ్ళందరకూ ఎంతో గొప్పగా ఉండేది. కేవలం మోహనరావు క్లాసులో ఫస్టుగా ఉంటాడనేకాదు. స్కూలు చదువూ, పరీక్షలూ, ఫస్టుమార్కులు పొందడం మోహనరావువంటి వానివిషయంలో గొప్ప చెప్పుకోవలసినవి కానేకావు. అవన్నీ అతనికి చిన్నపిల్లలాడుకునే ఆటలవంటివి.

అతనికి బాల్యంనుంచీ కవిత్వంలోనూ, గానంలోనూ మంచి ప్రావీణ్యం ఉండేది. వాటికి తగ్గ సుగుణసంపత్తి కూడా ఉన్నందున స్కూలికి సంబంధించిన

ప్రతి ఉద్యమంలోనూ, ప్రతి సంస్థలోనూ అతనికి ముఖ్యమైన పార్టు ఉండేది. అందుకని అతనంటే మాష్టర్లందరికీ ఎంతో వాత్సల్యమూ, అతనితో తిరగాలనీ, అతని మిత్రుల మనిపించుకోవాలనీ కుర్రవాళ్ళందరకూ ఎంతో అభిలాషను.

నేను నిత్యమూ అతనితోటే కలిసిఉన్నందున నాకు కూడా చాలావరకు అతనిమాటలే, అతనిభావాలే, ఆ కవిత్వమే, ఆ గానమే అబ్బినవని చెబితే అందులో అతిశయోక్తి ఏమీలేదు.

ఒక్కొక్కనాడు మా యింట్లో నా పెళ్ళిభోగట్టా వస్తే మాఅమ్మ నాకు అబ్బాయిలాంటి మొగుణ్ణి చూడాలనేది. నాకా ఈడులో వివాహమంటే ఏమిటో తెలీకపోయినా ఆ మాటలు వినేసరికి నా ఒళ్ళు పులకరించేది. కాని అబ్బాయి నాకు భర్త అవుతాడన్న ఆశ మా ఇంట్లో ఎవరికీ లేదు. మాకూ వాళ్ళకూ ఎంతస్నేహమున్నా ఆ స్నేహం కలికపూర్వమే చాలా బాల్యంలోనే అబ్బాయికి వివాహమైపోయింది.

అప్పటినుంచి నోములకూ పండుగులకూ అతనిభార్య జానకి అత్తవారింటికి వస్తూ ఉండడంచాత ఆమెకూ నాకూకూడా మంచి జతకలిసింది.

పదకొండోయేడు వెళ్తుందనగా నాకు మావాళ్ళు పెళ్లిచేశారు. నాభర్త కప్పుడు పంథొమ్మిదోయేడు. మా ఊళ్లోనే విద్వాన్ చదువుతూఉండేవారు.

నా వివాహమైన రెండేళ్ళకు నాకు కార్యంచేసేకే మా నాన్నగారు కాలంచేశారు. అతను పోయేక అతనియందున్న గౌరవంచాతనూ, మావారుకూడా విద్వాన్ పాసయిఉండడం చాతనూ మా నాన్నగారి ఆ మాష్టరు పదవిలోనే, ఆ జీతంమీదనే మా ఆయన్ని వేశారు. మొగపిల్లలులేక మమ్మల్నే నమ్ముకున్నందున నేనూ ఆయనా మా అమ్మవద్దనే ఉండిపోయాము.

ఇదిలా ఉండంగా నాకన్న ఏడాదిముందుగానే జానకి కాపరానికి వచ్చింది. అప్పటికి అబ్బాయి స్కూలు ఫైనలు పాసయాడు. అబ్బాయి 'ఎఫ్. ఏ.' రెండోయేడు చదువుతూ ఉండగా టైఫాయిడ్ జ్వరం వచ్చి గోపాలరావుగారు హఠాత్తుగా చనిపోయేరు. అతను పోయిన నెలనాడే అబ్బాయితల్లికూడా కాలంచేసింది. ఆమె చనిపోయేటప్పుడు మాదొడ్డమ్మకూడా (అబ్బాయి పెత్తల్లి; మేమందరం ఆమెను దొడ్డమ్మ అనే పిలుస్తూ ఉంటాము) చెంతనుంది. అప్పటికి తొమ్మిదిమాసాల గర్భిణి అయిన జానకినీ, అబ్బాయినీ అక్కయ్య చేతుల్లో ఉంచి ప్రాణంవిడిచింది అబ్బాయితల్లి.

అది లగాయితూ మా దొడ్డమ్మ అబ్బాయియింటనే ఉండి తల్లిలాగు వారిసంరక్షణ చేస్తూంది. జానకికి తన చేతులతోనే పురుడుపోసి చిట్టిని తన చేతులమీదనే పెంచింది. అబ్బాయి 'బి. ఏ.' పాసయే సరికి చిట్టికి రెండోయేడు. అప్పుడే అతడు 'బి. యల్.' చదువుకునేందుకు మద్రాసు వెళ్లాడు. ఆ వెళ్ళడం వెళ్ళడం ఇంతవరకూ యే శలవులకూ ఇక్కడకు రాలేదు. మళ్లా ఇదే రావడం——

## 3

గడియారం ఇప్పుడే మూడుగంటలతరవాత అరగంట కొట్టింది. ఈ పాటికి మెయిలు ప్లాటుఫారం మీదకు వస్తుంది. అక్కణ్ణించి ఇంటికి రావడానికి పదినిముషాల కన్న యెక్కువపట్టదు. పదినిముషాలు ఎంతలో గడుస్తాయో మాకు తెలీని విషయంకాదు. కాని ఆ పదినిముషాలూ గడవడానికి అప్పుడెందు కింత కాలం పడుతూంది? కాలానికి కూడా దేవాసురులవలె కామరూపం ఉన్నట్టుంది. యుగ మొకక్షణం లాగు క్షణ మొకయుగం లాగు మారిపోగలదు కాబోలు!

మూడూ నలభై కాకముందే వీధిగుమ్మంలో జట్కా ఆగిన చప్పుడయింది. మెరుపు మెరసినట్టు మా అందరి ముఖాలూ ఒక్కమాటు తళుక్కుమనిపోయేయి. 'అదిగో! వచ్చాడు' అన్నమాటలు రెక్కలు కట్టుకుని అత్యుత్సాహంతో నా పెదవుల్లోంచి బైటికురికేయి.

'అద్దీ, మా నాన్నవొచ్చాడు. మా నాన్న' అని గంతులు వేసుకుంటూ చిట్టి చప్పున సావిట్లోకి పరిగెత్తింది. వెనకాలే మా చెల్లెలూ, జానకీ, దొడ్డమ్మకూడా సావిట్లోకి వెళ్లారు. నాకుమాత్రం అంత హడావుడిగా అతణ్ణి కలుసుకుందికి బుద్ధి పుట్టలేదు. అతణ్ణి చూడాలని నాకెంత ఆత్రుతగా ఉన్నా నా ఆత్రుత అతనికి తెలీడం నా

కెంతమాత్రం ఇష్టంలేదు. అందుచాత ఎవరికీ కనబడకుండా చీడీ చివరనున్న వసారాలో ఒకమూల నక్కిచూస్తున్నాను. ఏంజరుగుతుందో అని.

ఇంతలో 'టక్ టక్'మని జోడు చప్పుడు చెవినిబడి అది అంతకంతకూ ముందుకు వస్తున్నట్లయింది. నేనూ తొంగిచూసేసరికి చిట్టినెత్తుకుని ముద్దులాడుతూ అబ్బాయి, వెనకాలే దొడ్డమ్మా, జానకీ, మా చెల్లెలూ అందరూ గబగబా గదిలోకి నడిచారు. అందుచాత అబ్బాయి ధరించిన ఉత్తరీయపు చివరమాత్రమే చూడగలిగాను.

దొడ్డమ్మ నెమ్మదిగా అబ్బాయి ప్రయాణపు భోగట్టాలు చేస్తోంది. అబ్బాయి తనెప్పుడు బయల్దేరిందీ, ఎక్కడెక్కడ కాఫీతాగిందీ, ఎక్కడ భోజనంచేసిందీ మొదలైన సంగతులు మెల్లగా చెబుతున్నాడు. ఆహా! ఆ మాటలలో ఎంతమాధుర్యం! ఎంతనాగరికత!! ఎంత వేగం అతణ్ణి చూస్తానా అనిఉంది. గదిలోకి వెళ్ళదలుచుకున్నాను. కాని—, నేనంటే అతనికోసం ఇంత తహతహలాడి పోతున్నాను. నాగురించి ఎప్పుడేనా అతడు తలుస్తాడా? నన్నుగూర్చి ఆలోచిస్తాడా? అతని మీద నాకెంత మమకారం ఉన్నా అతనికిగూడా నామీద ఆ మోస్తరుగా ఉన్నట్టు తెలిస్తేగాని నేనతణ్ణి చూడలేను. నామీద నాకంత అభిమానం. వెళ్ళబోయి...నన్ను నేనే ఆపుకున్నాను.

ఇంతలో 'విశాలం! మీ అక్కయ్య యేంజేస్తోంది?' అని అబ్బాయి పలుకులే పాటవలె నా చెవిని సోకేయి. నాశరీరం పులకరించింది. మాచెల్లెలి జవాబుమాత్రం వినిపించలేదు. అది జవాబు చెప్పలేదో చెబితే ఆనందపారవశ్యంలో ఆ మాటలు నా చెవిని బడలేదో!

దొడ్డమ్మగొంతుమాత్రం వినబడింది:

'ఏదీఉమా? ఇంసేపాయి ఇక్కడేఉందీ!...ఇంటికి వెళ్ళింది కావోలు! వస్తుందిప్పుడే.'

'విశాలం! ఓ సారిపిలుద్దూ నే వచ్చాననీ. చూడాలనుందీ!' అని అబ్బాయి కంఠస్వరమే విస్పష్టంగా వినబడింది.

ఆమాటలతో అతణ్ణి చూడకుండా ఉండగలిగే ఓపిక నాలో పూర్తిగా సడలిపోయింది. పైటచెరగుతో ఒకసారి ముఖంతుడుచుకుని, రేగినజుట్టు సవరించుకుని నెమ్మదిగా గదిగుమ్మం సమీపించాను. ఎంత నెమ్మదిగా వేసినా అడుగడుక్కీ కాళ్ళు తడబడ్డాయి. నాలో జనిస్తున్న ఆనందోద్రేకాన్ని చల్లార్చుకోడానికి గుమ్మందగ్గిర ఒక్కనిముషం ఆగి లోనికి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి చిట్టిని ఒళ్ళోకూచోబెట్టుకుని సందర్భం లేకుండా అదిచెప్పే ముద్దుమాటలకు మురిసిపోతున్నాడబ్బాయి.

నేను చిరునవ్వుతో 'ఏంవబ్బాయి! వచ్చావూ!' అని పలకరించాను.

నా మాట వినగానే అబ్బాయి చటుక్కున నిర్ఘాంతపోయినట్టు నావంక నాముఖంలోకి చూసి...చూస్తూ అలా ఉండిపోయాడు ఒక్కక్షణం. అతని చూపు మెరపుతీగ ప్రాకినట్టు నాముఖంనుంచి పాదాలవరకూ మెల్లగా జారింది. నేను సరిగా అతనివంక చూడలేక కళ్ళు పక్కకు తిప్పుకున్నాను.

ఆశ్చర్యం సూచించే స్వరంతో అబ్బాయే అన్నాడు: 'ఎవరిదీ! ఉమేనా?'

ఔనన్నట్టు మందహాసంతో తలఊచింది దొడ్డమ్మ.

మళ్ళీ అబ్బాయిగొంతుకే.

'ఈరెండేళ్ళలోనూ ఎంత యెదిగిందీ! పోల్చుకోనే లేక పోయాను.'

ఆమాటలతో నాచెక్కిళ్ళు చప్పున జాజువారాయి. నాముఖంమీద ఆనందం, సిగ్గూ, ప్రూన్నాటూ ఒకేసారి ఇట్టిట్టే అలుముకు పోయాయి. చప్పున ముఖం దించుకున్నాను.

'నువ్వుమాత్రం బలీలేదూ మెడ్రాసువెళ్ళీ?' అన్న మాట నామనసులో బయల్దేరి పైకిరావాలని ఎంతో ఉబలాటపడింది. అనగలిగితే అందులో అన్యాయమేమీలేదు. చెన్నపట్నం వెళ్ళినప్పటి అబ్బాయికీ ఇప్పటి అబ్బాయికీ చాలా భేదముంది. ఈరెండేళ్ళలోనూ అబ్బాయికి మునుపటికంటె రూపువచ్చింది. చెన్నపట్టపు సముద్రపుగాలీ, ఆచదువూ, నాగరికతా అన్నీ అతని కొకవిధమైన దీప్తినిచ్చాయి. మునుపటికంటె చాలా పుష్టిగా కూడా ఉన్నాడు. అయితే ఆ మాట

అతని ముఖాన అనగలిగే శక్తి ఎంత వెతికినా అప్పుడు నాలో కనబడలేదు. అందుచేత అది మనసులోనే 'నువ్వుమాత్రం బలీలేదూ మెడ్రాసువెళ్ళీ?' అని అటునుంచి యిటూ ఇటునుంచి అటూ రెండుమూడుసార్లు తిరిగి అక్కడే ఆగిపోయింది.

'కూర్చోవే నిలుచున్నావేమిటే' అని జానకి అన్న మీదట ఆమెపక్కనే ఓసరిల్లి కూచున్నాను. ఇంతలో మా దొడ్డమ్మ ఫలహారం, కాఫీతెచ్చి మా కందరకూ ఇచ్చింది. అందరం సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వాటిని పుచ్చుకున్నాము. మధ్యమధ్య అబ్బాయి మా యోగక్షేమాలు అడుగుతూ నావద్దనుంచి క్లుప్తమైన జవాబులు పొందేడు.

మాఫలహారాలన్నీ అయేక మాదొడ్డమ్మ 'అబ్బాయి! రెండు హార్మణీపెట్టెలు తీసుకురమ్మని రాయించాను. తెచ్చావూ?' అని అడిగింది.

'ఆఁ. తెచ్చాను. అంటూ పెట్లోంచి ఒక హార్మణీయం పైకితీసి రెండుమూడు మెట్లు మనోహరంగామీటి వినిపించాడు. తరువాత చిట్టికూడా తన చిన్నివేళ్ళతో మూడేసిమెట్లను కలిపి నొక్కుతూ తనపాండిత్యం వెల్లడించింది.

తరువాత 'ఉమా! ఏదేనా వాయించి పాడుదూ వినాలనుందీ!' అన్నాడబ్బాయి.

అతడంత చనువుగా మాట్లాడుతాడని నేననుకోలేదు. నాకు చాలా సరదావేసింది. అతనిమాట నిరాకరించడానికిగాని ఆచిన్నమాటపైని పాడడానికిగాని నోరురాక ఊరుకున్నాను. నే నూరుకోడం చూసి దొడ్డమ్మ 'పాడుదూ! ఇంతలో నోటిముత్యాలు ఒలికిపోవూ; సరదాపడుతున్నాడూ!' అంది.

హార్మణీయం అందుకుని మెల్లగా మీటుతూ ఒక కృతిపాడాను. పాడుతున్నంతసేపూ అతడేమి హేళన చేస్తాడో అని నాకు భయంగానేఉంది. ఎందుచాతనంటే అబ్బాయి నాకంటె వెయ్యిరెట్లు మనోహరంగా వాయించి పాడగలడని నాకు తెలుసు. పాటంతా అయాక 'చాలాబాగుంది. ఈలోపున బాగా కృషిచేసినట్టుందే!' అన్నమాటలు అబ్బాయి నోటమ్మట వెలువడ్డాయి.

ఆచిన్న మెప్పుకే నాకెంతో సంతోషమైంది. పైగా అతని మాటలు నాకు అమితమైన ఆశ్చర్యంకూడా కలిగించాయి. అబ్బాయిని నేను చిన్నప్పటినుంచీ చూస్తున్నాను. ఇంతవరకూ ఒక్కసారికూడా దేనికీ అతడు నన్ను మెచ్చుకున్న జ్ఞాపకం నాకులేదు. పైగా, నలుగురూ నన్ను మెచ్చుకుంటున్న సమయాల్లోకూడా ఎన్నోసార్లు అతడు నాలోపాలనే ఎంచి చూపించడానికి ప్రయత్నించడం నేను మరిచిపోలేదు. అటువంటి అబ్బాయి పెదవులంట ఇప్పుడిటువంటి మాటలొస్తాయని నేనెన్నడూ అనుకోలేదు.

ఈసారి అతడు నిజంగా అంటున్నాడని తెలిసికూడా 'చాల్లే, ఆక్షేపణ' అన్నాను తమాషాకి.

'ఆక్షేపణ కాదు; నిజంగానే అంటున్నాను. ఇంత చక్కగా పాడగలుగుతావనుకోలేదు' అన్నాడు నా కళ్ళలోకి చూసి నవ్వుతూ.

అతనిమాటలు నన్ను పరవశురాల్ని జేశాయి. నా చెక్కిళ్ళు కెంపుబారాయి. నా ఆనందం బలవంతాన కప్పిపుచ్చి, అతనన్నమాటల్లో నిజమేమీ లేనట్టు నటించి, నిర్లక్ష్యంగా నవ్వినట్టు నవ్వుతూ అన్నాను. 'మరేమిటంటావు లేకపోతే.'

తరువాత అరగంటవరకూ మాసంభాషణ అనేక విషయాలమీద ఎంతో సరదాగా నడిచింది. ఇంతలో అయిదు కొట్టినందున అబ్బాయికి వేగం వంటకావాలని దొడ్డమ్మ లేచింది. నేనూ లేచాను యింటికిపోవాలని. మాచెల్లెలుమాత్రం నేను తరువాత వస్తానంటూ ఎంతో పనున్నదానివలె అబ్బాయిచెంత కూచుంది.

ఇంత స్వల్పకాలంలో అబ్బాయితో మాచెల్లెలికి ఇంత పరిచయం కావడానికి చిన్నకథ ఉంది. మాచెల్లెలిప్పుడు మూడోక్లాసు చదువుతూంది. ఈమధ్యను బడిలో దానిచేత ఆవూ, మేకా మొదలైనవాటిమీద రెండుమూడు వ్యాసాలు వ్రాయించారు దాని మాష్టర్లు. వాటిలో దానికి ఏభైకి నలభైమార్కులకు పైగా వచ్చాయి.

అబ్బాయి గొప్ప విద్వాంసుడనీ అటువంటి విద్వాంసుడే వాటిని మెచ్చుకోందికి తగినవాడనీ దాని వుద్దేశం. అబ్బాయి వస్తున్నాడన్న వార్త తెలిసినప్పటినుంచీ

'అబ్బాయి ఎప్పుడు వస్తాడు? తన వ్యాసాల పుస్తకం ఎప్పుడతనికి చూపిస్తాను?' అని మా చెల్లెలుపడుతున్న ఉబలాటానికింక అంతులేదు. అందుచాత అబ్బాయివద్దకు మేము బయల్దేరినప్పుడు ఆ వ్యాసాల పుస్తకం కూడా మా చెల్లెలివెళ్ళ నతుక్కునే వచ్చింది. మాటల సందర్భంలో దానిని అబ్బాయి చూసేటట్టుకూడా చేసింది మా చెల్లాయి.

అబ్బాయి ఆ కథలనన్నిటినీ శ్రద్ధతో చదివి మెచ్చుకోడమే కాకుండా తను చెన్నపట్ణంనుంచి తెచ్చిన మంచి మంచి బొమ్మల పుస్తకాలుకూడా దానికి బహుమతిచేశాడు. కాని దానిత్రవాత పూర్తిగా అర్ధమయే మెచ్చుకున్నాడని ఎవరమూ అనుకోలేము. ఎందుచాతనంటే మా చెల్లెలి వ్రాతలోని 'మ' కు 'య' కు, 'ష' కు 'ఫ'కు, 'ఛ' కు 'భ' కు, ఉన్న భేదాన్ని గుర్తించడం రీసెర్చిపండితులకు గూడా అంతసులభమైనపని కాదు.

నేను ఇంటికి వెళ్లాక మా అమ్మా, ఆయనా అబ్బాయిని చూడడానికి వెళ్ళారు. వారు వచ్చేటప్పుడు వారి వెంట హార్మణీయంపెట్టా, మంచి విలువైన కళ్ళద్దాలూ, పైట పిన్నులూ, తలపిన్నులూ మొదలైన వాటితో నిండిన రెండుమూడు వింత వింత పెట్టెలు మా యింటదిగాయి. దొడ్డమ్మ బలవంతాన ఆ రాత్రి మేమందరమూ అబ్బాయి పంక్తినే భోజనం చేశాము.

ఆ రాత్రల్లా నాకు సరిగా నిద్రలేదు. అబ్బాయి సంగతులే తలచుకున్నాను. ఆతడు నామీదచూపిన ఆదరణా, నా ముఖంమీద వాలి వింతగా నా మనసుని కలవరపెట్టే అతనిచూపూ, అరవిచ్చిన గులాబివలె చిరునవ్వు లొలికే అతనిపెదవులూ, పువుదేనెవలె వాటిగుండా వెలువడే తీయని పలుకులూ—నే పాడిన పాటా, నా మాటలూ, అవి అతనిహృదయంలో కలిగించిన పరిణామం అన్నీ ఎంత ఆటంకపరచినా లొంగక నా ధ్యానంలో అటూఇటూ సంచరించాయి.

—ఆకుండి సత్యనారాయణ.

☞ ఉమను మెచ్చిన అబ్బాయి, అబ్బాయిని మెచ్చిన ఉమ. వీరి అనంతరచరిత్ర యెట్లుండును ? పై మాసపు సంచికలో చదువగలరు.

విజ్ఞానమునకొఱకు, వినోదమునకొఱకు

ఆంధ్రభూమి

సచిత్ర మాసపత్రికను పఠింపుడు.

మనోహరకథావ్యాసములు, హాస్యవ్యాసములు, మహాపురుషుల జీవితములు, మణిమాల, కారపుశెనగలు, విడ్డూరములు, జిజ్ఞాస : మీమాంస, మహిళాలోకము, బాలబాంధవి, ఆరోగ్యవిజ్ఞానము, రాష్ట్రేతరాంధ్రులు, ఇన్నూరెన్నువిషయములు, ఆంధ్రునిడైరి మున్నగు ఎన్నో విషయములు విద్యాధికులచే వ్రాయబడినవి ప్రతిసంచికయందును ఉండును.

సంపాదకుడు : ఆంధ్ర శేషగిరిరావు, బి.ఏ.

స్థాపితము : 1933. సాలు చందా రూ 1-8-0. విడి సంచిక 2 అణాలు.

చిరునామా : ఆంధ్రభూమి, వేపేరి, మదరాసు.

ఈస్టు యిండియా ఫిలుంకంపెనీ



దుర్గాఖోటే నటించిన 'సీత' అను ఫిల్ములోని దృశ్యము'

## భారతదేశ సంస్థల ప్రోత్సహింపుడు

సల్పప్రీమియములు | ప్రత్యేకసౌకర్యములు | ఆధునిక పద్ధతులు.

1. 'ఏ' మొదలు 'జడ్' వరకుగలస్కీము, 2. బిడ్డల విద్యావివాహముల స్కీము, 3. సమిష్టి జీవితభీమా, 4 స్త్రీలభీమా, 5. యావజ్జీవితపు ఫించను ఏర్పాటు, 6. భార్యాభర్తల జాయింటు లైఫ్‌స్కీము ప్రత్యేకసౌకర్యము.

అదియు నిదియు అననేల ? వీరువారననేల ? ఎల్లరకును అందుబాటుకానున్న జీవిత భీమాపాలసీని పొంది మీపోష్యవర్గమును పోషింపుడు.

కంపెనీ ఆర్థికస్థితి గాంచనగును.

గవర్నమెంటు సెక్యూరిటీ రు 2 లక్షలు.
జీవితమూలనిధి రు 6 ,,
చెల్లించిన క్లైయిములు రు 14 ,,
1933-34 లో చేసిన వ్యాపారము రు 35 ,,

ధారాళమైన కమీషన్, వేతనములపై పలుకుబడిగల ఏజెంట్లు కావలెను.

ఇట్టి విశేషసౌకర్యములు కలవు కాన నేడేవివరములకు వ్రాయుడు:

సూపరింటెండెంటు

**ది వీనస్ అస్యూరెన్సు కంపెనీ, (ఢిల్లి)**

**The Venus Assurance Company Ltd., Delhi.**

బ్రాంచి ఆఫీస్ : 21, సెకండులైను బీచ్, మదరాసు.

లేక మీకు సమీపముసగల ఏ బ్రాంచి ఆఫీసుకైన వ్రాసి తెలిసికొనుడు.



## గోలకొండపత్రికా ప్రచురములు

త్రూపుబజారు, దక్షిణ హైద్రాబాద్,

| | | | |
|---|---|---|---|
| 1. గోలకొండ కవుల సంచిక. 3౫3 కవులభావ విలసనములు. 33 పటములు, ౪౫౦ పుటలు. గోలకొండ పత్రిక చందాదారులకు ... ... ... | 1 | 0 | 0 |
| ఇతరులకు ... ... ... | 2 | 0 | 0 |
| 2. ఉచ్ఛల విషాదనాటకము, కాశ్మీర ప్రాచీన చరిత్రాత్మక విషాదాంత నాటకము. సురవరము ప్రతాపరెడ్డిగారి కృతము ... ... ... | 0 | 12 | 0 |
| 3. సంఘోద్ధరణము. సాంఘిక సమస్యలపై చర్చ. సు. ప్రతాపరెడ్డిగారిది... ... ... | 0 | 6 | 0 |
| 4. గయోపాఖ్యానము. ద్విపద. ప్రాచీనకవి నాదెండ్లగోపప్రధానికృతము ... ... ... | 0 | 6 | 0 |
| 5. సుధాలహరి. ప్రాచీన జైనకవి శ్లోకములు. తెలుగుపద్యములు. | 0 | 2 | 0 |
| 6. కృష్ణాలహరి. శ్లోకములు, పద్యములు ... ... | 0 | 1 | 0 |

# సంభోగము సంతానోత్పత్తికొఱకుమాత్రమే కాదు

సంభోగము సంతానోత్పత్తికొఱకు మాత్రమే అను అభిప్రాయము ప్రజలలో సుదృఢముగా నాటుకొనియున్నది. ప్రాచీనులగు ఋషిపుంగవు లెల్లరు అస్పష్టవచనములలో సంభోగము సంతానోత్పత్తికొఱకే అని చెప్పియున్నారు. సంతానోత్పత్తి సంకల్పముగా లేని సంభోగము వ్యభిచారమేనని వారు నిర్వచించియున్నారు. కాని ఈవిషయమున ఇటీవల కొంతమార్పు అభిప్రాయము శాస్త్రవేత్తలలో అగపడుచున్నది. ఆమార్పుఅభిప్రాయమును ప్రదర్శించుటయే వ్యాసకర్తయొక్క ముఖ్యోద్దేశము.

పశుపక్ష్యాదులనుండి మానవుని వేఱుపఱుచు ప్రధానవిషయములలో వానియందువలె మానవులయందు సంభోగము కేవలము సంతానోత్పత్తికొఱకుమాత్రమే కాకుండుట యొకటని మనము తెలిసికొనవలసియున్నది. జంతువులలో సంప్రయోగవాంఛఅనునది ఒక ఉదుటు; అది ఋతుకాలములందు మాత్రమే కలుగును; నూతనసృష్టికి అదియొక సాధనము, నూతనముగా సృష్టింపబడిన సంతానముయొక్క పరిరక్షణకు వలయు సానుభూతిని కల్గించుట కదియొకయుక్తి. మానవజాతియందు సంభోగవాంఛ అట్టిదికాదు. ఇచట అది పశుపక్ష్యాదులయందువలె ఒకేకాలమునకు నియమితమైయుండదు. నూతనసృష్టి కావించుటకు మాత్రమే అది యొక సాధనమైయుండదు. మానవుని శీలమును, స్వభావమును, వ్యక్తిత్వమును, తదితర సున్నితభావములను ఏర్పఱచుటలో అది మిక్కిలి హెచ్చు బాధ్యతను వహించుచున్నది.

జంతువులు లబ్ధమైనవానితోడనే తృప్తిపడవలయును. మానవు డట్లుకాదు. లబ్ధమైనవానిలో వలసినవి ఎన్నుకొను హక్కు ఆతనికున్నది. కాగా మానవుని కామవాంఛ ఆతని మనస్సునకు స్వాధీనమైయున్నది. మరియు మానవుడు ఆధ్యాత్మికజీవి. అగుటచే నాతడు ఎల్లవేళల తనకు సహజముగా కలుగు వాంఛలతో గొండాడుచుండును. ఆగొండాడుట ఆ వాంఛను మూలముట్టుగ త్రుంచివేయుటకు గాదు. వానిని తన ఆధ్యాత్మికౌన్నత్యమునకు వినియోగించుకొనుటకు. తనవాంఛల తీవ్రతను ఆతడు తగ్గింపలేక పోవచ్చును. (ఆతడేల తగ్గింపవలెను?) కాని ఆ తీవ్రవాంఛలు తన్నులోగొని తన నాశనమునకు కారణముగాకుండ వాని నాతడు తనకు సేవకులనుగాను, తన ఆత్మకు తోడి పనివాండ్రుగను చేసికొనవచ్చును. అదియునుగ్గాక మానవుని కృత్యములలో గల నిస్సందేహమైన సింబలిజమును గూర్చి కూడ మనము ఆలోచింపవలసి యున్నది. మానవుడు చేయు పనులలో ప్రతిదియు ఎల్లవేళల జంతువుల కృత్యములనే పోలి యున్నదని చెప్పుటకు అవకాశములేదు. మానవుని కృత్యములు జంతువుల పనులవలె యత్నములను తృప్తిపఱచు యత్నములుకావు. వివిధములైన వ్యక్తిగత భావములను స్పష్టపఱచు సింబాలిక్ కృత్యములవి. మనయింటికి మిత్రులను విందుభోజనమునకు పిలిచితిమనుకొనుడు. అచ్చట ఆకలితీర్చుకొనుట ఒక్కటియే ప్రధానోద్దేశముకాదు. అట్లే ఒకానొక పురుషునియొక్కయు ఆతని ప్రియురాలి యొక్కయు సంప్రయోగము జంతువుల

యందువలె కేవలము కామవాంఛాపరితృప్తికే కాదు. అది వారిఆత్మలను వ్యక్తీకరింపజాలిన ఒక సింబాలిక్ కర్మ. 'సంభోగము ఒక మహాయజ్ఞము. దేహము, మనస్సు, ఆత్మ అందు సమానభాగస్వాములు' (కృష్ణాపత్రిక) అని రివరెండు పి. సి. గారి నిర్వచనము.

సంప్రయోగముయొక్క ఈ సింబాలిజమ్ను తప్పుఅర్థముచేసికొని అది సంతానోత్పత్తికొఱకు మాత్రమే అని నిర్ధరించుట వ్యక్తిప్రేమయొక్క మూలసూత్రములనే విచ్ఛేదముచేయుట అగునని ఆర్. మేక్నాన్ గారు 'రియల్ హ్యూమన్ నీడ్సు' అను గ్రంథమున వ్రాయుచున్నారు.

ఆడుజంతువులు వినియమముగా వాని ఎద కాలముననే సంభోగమునకు అంగీకరించును. ఈ ఎదకాలము వాని స్వాధీనమునకు అతీతమైనది. పిల్లలుపుట్టిన తరువాత తిరిగి ఎదకాలముకలుగువఱకు అవి సంప్రయోగమునకు అంగీకరింపవు. కాని స్త్రీలవిషయమున అట్లుకాదు. స్త్రీల గర్భాశయమున జన్మాండములు లేనపుడును, గర్భోత్పత్తికి బొత్తిగా అవకాశములు లేనప్పుడును స్త్రీలకు సంభోగవాంఛ ఉండుచున్నది; అట్టి సమయములందు సంభోగకృత్యమును వారు ఆచరించుచును ఉన్నారు. ఈవిధముగా ప్రకృతి మానవజాతి యెడల తనపద్ధతుల నేల మార్చినది?

ముట్లుడిగిన తరువాత స్త్రీ గర్భమును ధరింపజాలదు. కాని అప్పుడుకూడ ఆమెకు సంభోగవాంఛ– అది యౌవనకాలమున దుర్వినియోగము చేయబడకుండినచో– కలుగుచునేయున్నది. మానవుల విషయములో వృద్ధాప్యమునకు కూడ ప్రకృతి ఈ సంభోగవాంఛ నేల పొడుగించినది ?

ఈప్రశ్నల కొక్కటే సమాధానము. మానవజాతిలో సంభోగము ఒక్కసంతానోత్పత్తికే గాక మరి ఇతరములగు మహత్తర కార్యములకుకూడ ప్రకృతిచే ఉద్దిష్టమైయుండుట నిస్సంశయమగుచున్నది. జీవితపథమున హెచ్చుదూరము ప్రయాణముచేయక పూర్వమే ఈ ప్రశ్న ప్రతివానిని ఎదుర్కొనుచున్నది. దీనినిగూర్చి నిర్ధరించి చెప్పి ఒక ఆదర్శమును ఏర్పఱచుట ప్రతివారును వాంఛింతురు. ఆఆదర్శము లేనినాడు మన జీవితములు తాడుతెగిన గాలిపటములే.

సంతానముకొఱకుమాత్రమే సంభోగము చేయుట ప్రకృతిసిద్ధమనియు, వాంఛనీయమనియు నేడుకూడ పలువురు చేయెత్తి చెప్పుదురు. పశుపక్ష్యాదులలో సంభోగము సంతానోత్పత్తికే అని అట్టివారు పలుతడవలు చెప్పుటకు కొంచమేని విసుగుకొనరు. సంతానోత్పత్తికి కాని సంభోగము వంధ్యాసంభోగమని అట్టివారందురు. జంతువుల్లో ఇట్టి వంధ్యాసంభోగములు లేవని వారు పేర్కొందురు. అగుట సంతానోత్పత్తికికాని సంభోగమును నిషేధించుటయే ఆదర్శప్రాయమనియు, ఇది అనుల్లంఘనీయమగు ప్రకృతిధర్మమనియు వారు చెప్పుదురు. మానవస్వభావముకూడ ప్రకృతిలోని ఒకభాగమేననియు, ప్రకృతిలో మానవస్వభావము ఉన్నతశ్రేణికి చెందినదనియు జంతువులస్వభావముకంటె మానవుల స్వభావమే మానవుల అక్కఱలకు సన్నిహితమైనదనియు వారు గుర్తింపరు. పక్షులలో జీవితాంతమువఱకు ఒకే పెంటినిగలిగి సంతానముకొఱకు మాత్రమే సంప్రయోగముచేయు మగపక్షి నొకదానిని ఉదాహరణముగ చూపి ఇది ప్రకృతిధర్మమని చెప్పుచు మానవులనుకూడ నిట్లుచేయ ఒకడు హెచ్చరించు

ననుకొనుడు. మఱియొకడు పెక్కు పెంటులను కలిగియుండు మగపక్షిని నిదర్శనముగా గైకొని పురుషుడు బహుభార్యాలంపటుడగుట ప్రకృతిధర్మమని చెప్పుటకు అప్పుడు అవకాశ ముండును. కావున సంప్రయోగవాంఛవిషయమున పశుపక్ష్యాదులకును మానవునకును ఏ మాత్రమును సంబంధము లేదనుట తేటతెల్ల మగుచున్నది.

సంప్రయోగము సంతానోత్పత్తికొఱకు మాత్రమే కాదనుటకు ఇందు కొన్ని కారణములు చూపియున్నాను. ఈ విషయమై శాస్త్రజ్ఞుల అభిప్రాయములను క్రోడీకరించి కొన్నిటి నిచట ఇచ్చుచున్నాను.

ఉత్పత్తి సాధనమగుట మాత్రమేగాదు. మానవులలో సంప్రయోగము ఇతరరీతులచే మహత్తరమైనది. శారీరక, మానసిక శక్త్యుత్సాహములను ఎప్పటికప్పుడు పునః ప్రతిష్ఠ గావించుటకు సంప్రయోగము ప్రబలమైన ఆధారము. వివేకయుతమును, నియమబద్ధమును అయిన దాని ప్రయోగము ఆరోగ్యవర్ధకము, శక్తిదాయకము, సంతోషప్రదము, తృప్తికరము. సంప్రయోగవాంఛను నిరోధించుట, త్రుంచివేయుట శారీరకముగను, మానసికముగను అనారోగ్యమునకు కారణమగును.

(మారేజ్ : పాస్టు, ప్రెజంటు, అండ్ ఫ్యూచర్.)

జంతువులవలె మానవులలో సంప్రయోగము సంతానోత్పత్తికిమాత్రమే కాకుండుటచేతనే కుటుంబజీవితము, అన్యోన్యప్రేమ యేర్పడినవి. —మారిస్. ఎ. బిజిలో.

గాలిని పీల్చుటలో, చలనశక్తిలో, నిశిత దృష్టిలో, శబ్దగ్రహణములో మానవుని మించిన పశుపక్ష్యాదులున్నవి. కాని కామపురుషార్థమున పశుపక్ష్యాదులన్నియు మానవునకు లోచ్చే. మానవుల కామాసక్తికిని, జంతువుల కామాసక్తిని సంబంధమే లేదు.

—హేవలక్ ఎల్లిస్

సంప్రయోగము జాతిని నిలుపుకృత్యము మాత్రమే కాదు. అది ఒక మహత్తరమైన ప్రేమకార్యముకూడ. ఈసంగతి తఱుచు విస్మరింపబడుచున్నది.

—వాల్టర్. యమ్. గాల్లికన్

సంతానోత్పత్తికి మాత్రమేగాక ఇతర మహత్తరప్రయోజనసంపాదనమునకును సంప్రయోగము అవసరమను విషయము మనము వెల్లడిచేయవలసియున్నది. స్త్రీపురుషుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యమునకు వృద్ధికలిగించునంత తఱుచుగా స్త్రీపురుషులు సంప్రయోగకర్మమున దవిలి యుండుచుండనగును.

—డబ్ల్యు. జె. రాబిసన్, యమ్. డి.

సంప్రయోగము సంతానోత్పత్తికి మాత్రమే అని వాదముకొఱకు అంగీకరింతము. అప్పుడు స్త్రీస్థానము ఎట్టిదిగా నుండును? సంఘమున స్త్రీస్థానము సంతానమును ఉత్పాదించు యంత్రమగుటయేనా?

—మాట్రిమోనియల్ రెవ్యూ.

ఒండొరులు మానసికముగా ఆకర్షింపబడినదానికి స్త్రీపురుషసంప్రయోగము బహిర్లక్షణము. ఈలక్షణము కారణముగా గర్భధారణముకావచ్చును; ఒకక్రొత్త ప్రాణి సృష్టింపబడవచ్చును. కాని ఇది అంతయు మానసికముగా ఆకర్షింపబడిన రెండు ఆత్మల ఐక్యభావమున కలిగిన ప్రశక్తిమాత్రమే.

—రివరెండు యఫ్. బి. మేయర్. బి. ఏ., డి. డి.

—జి. వెంకటరావు, బి. ఏ.

# కారపు శనగలు

['లావుపాటివాడు సరుకులు విస్తారంవేసిన బండిలాంటివాడు'—లావుపాటివాళ్లు మేష్టరుపనికి పనికిరారు- తెలియకపోతే ప్రబుద్ధాంధ్రశబ్దానికి సార్థకమేది?- ఇప్పుడు బియ్యేలు చుట్టకాల్చేవారిలా రోతపుట్టిస్తున్నారు - పెళ్ళినాటికే శ్రీరాములవారిజుట్టు నెరిసిపోయిందా ?]

'ఆంధ్రభూమి' ఆగష్టుసంచికలో 'లావుగా ఉండడాన్నిగురించి' అని ఒకవ్యాసం వ్రాయబడింది. లావుపాటివాళ్ళు డబుల్‌పన్నా మనుష్యులనీ, వారిది నత్తనడకనీ, వారిలో మాంససంబంధమైన విలక్షణతేజం ఉందనీ ఇత్యాదిగా వ్రాసి లావుపాటివాళ్ళని ఆవ్యాసం ఆక్షేపించింది. 'ఆరోగ్యప్రకాశిక' ఆగష్టు సంచిక కూడా లావుపాటివాళ్ళను ఇట్లా ఈసడిస్తోంది : 'శరీరము సన్నపడడానికి అధికంగా శరీరపరిశ్రమలను చేయవలెనని మరికొందరు చెపుతారు. స్థూలకాయులున్నూ, లంబోదరాలున్నూకల ముసలివర్తకులు వీరిమాటలను నమ్మి లావుతగ్గడానికి యీలాటి పరిశ్రమలను చేసి చాలా చిక్కులపాలవుతూవుంటారు. సరకులు విస్తారంగా వేసినబండి యేలాటిదో లావు ఎక్కువైన శరీరంకూడా ఆలాటిదే. యేమాత్రం వడిదుడుకు కలిగినా ఆబండి ఏలాగు బోర్లపడుతుందో యీలాటి మనుష్యుల ఆరోగ్యంకూడా అలాగే చెడిపోతుంది.' ఈవాక్యాలు చాలా అవమానకరంగా ఉన్నాయి. సరకులు విస్తారంగా వేసిన బండి ఏలాటిదో లావు ఎక్కువైన శరీరంకూడా అలాంటిదా? ఆబండిలాగ ఇదికూడా బోర్లాపడుతుందా? ఈ తెలుగుపత్రికలకు లావుపాటివాళ్లంటే ఇంత చులకన ఎందుకయింది? తెలుగుపత్రికా సంపాదకుల్లో కొందరు తాము లావుగా ఉన్నా తమపత్రికలన్నా సన్నంగా (పుటల్లో) ఉన్నాయని సంతోషిస్తున్నప్పటికీ మరికొందరు తాము సన్నంగాఉన్నా తమ పత్రికలన్నా లావుగా (పుటల్లో) ఉన్నందుకు గర్విస్తూ నేఉన్నారు. సాధారణంగా పత్రికో, సంపాదకుడో లావుగాఉంటూన్నప్పటికీ ఈ తెలుగుపత్రికలు లావుపాటివాళ్లని ఇంత చులకనగా చూడడానికి కారణం విచారిస్తే అనేకజాతుల మనుష్యులవున్నట్లు ఈ లావుపాటి జాతి మనుష్యులకు ఆందోళన చేయగల ప్రత్యేకసంఘం ఒకటి లేకపోవడమే అని తేల్తోంది. కావున ఆంధ్రదేశంలోఉన్న లావుపాటి మనుష్యులంతా—స్త్రీలు, పురుషులు—వెంటనే సమావేశమై ఒక సంఘాన్ని స్థాపించి తమనుగురించి తెనుగు పత్రికలు ఇట్లా నిందావాక్యాలు పలకకుండా ఆందోళనచేసి అవసరమైతే ఆపత్రికల్ని బహిష్కరించడానికి ప్రయత్నం చేయవలసి ఉంటుంది. ఖర్మం, నేను సన్నపాటివాడినైపోయాను. లేకపోతే ఈ సంఘానికి నేనే కార్యదర్శినై సమస్తకార్యాలు నెరవేర్చిఉందును. ఈ సంఘానికి కార్యదర్శి కాతగ్గ యోగ్యతగలవాళ్ళు నాయెరుకలో ఇద్దరు ఉన్నారు. ఒకరు నామేనమామ; మరిఒకరు మాకాలేజీ తెలుగుపండితులు. నా మేనమామతో నే నీవిషయంలో ఏమి చెప్పినా అతని కళ్ళు ఎర్రబడతాయి; నామీదికి కర్రఎత్తుతాడు. ఇక రెండోవారైన మాకాలేజీ తెలుగుపండితులు తాము శతావధానాలు చేస్తూ కొంచెమేనా తీరుబడిలేదంటారేమో! ఎట్లా అయినా ఒప్పించి ప్రస్తుతంలో ఈ లంబోదరమహాజనసంఘానికి ఆయన్నే కార్యదర్శిగా పెట్టడం వాంఛనీయం. ప్రస్తుతస్థితిలో లంబోదరుల హక్కులు పరిరక్షించడానికి ఉపాధ్యాయుడొకడు కార్యదర్శిగా ఉండడం అత్యవసరం. ఏమంటారా?

... ... ...

స్థూలకాయులు ఉపాధ్యాయత్వానికి పనికిరారనే నియమం ఒకటి పుడుతోన్నట్లు 'కృష్ణాపత్రిక' ఇట్లా ప్రచురిస్తోంది : "రోజ్ ఫ్రీస్టేటన్ అను 26 ఏండ్ల యువతి న్యూయార్కులో ఉపాధ్యాయపదవికి దరఖాస్తు పెట్టెను. పరీక్షకులామెను తూచగా ఆమె 182 పౌనులు తూగెను. సాధారణముగా ఆమె యెత్తు (5 అ 2 అం) గల స్త్రీ 120 పౌనులు మాత్ర ముండవలెను. అందుచే పరీక్షాధికారులు, ఆమెను కనీసము 150 పౌ

నుల కైనను తగ్గవలెనని హెచ్చరించి, 6 నెలలు గడువిచ్చిరి. ఉద్యోగాభిలాషిణియై ఆమె ఎట్లో తిప్పలుపడి 2 నెలలకు 162 పౌనులయ్యెను. కాని దురదృష్ట వశమున 6 నెలలు పూర్తియగునప్పటికి యథాప్రకారము 180 పౌనులకు పెరిగినది. ఉద్యోగము రాలేదు. ఆమె పైఅధికారులకు అప్పీలు చేసినది. 'స్థూలకాయులు మేడమెట్లను ఎక్కలేరు. డ్రిల్లులో త్వరితముగ కదలలేరు. చురుకుగా పనిచేయుటకును పనికిరారు. మాపులకును అందముగ నుండరు.' అని పాఠశాలాధికారుల వాదన 'మా అమ్మాయిది మంచిగట్టిఒళ్ళుగాని, కేవలము కొవ్వుఒళ్ళుకాదు. అదియునుగాక, మా అమ్మాయి అందముగా లేదనుట శుద్ధ తెలివితక్కువ, ఎంతమంది యువకులు ఆమెచుట్టును చేరుచుండుటలేదు!' అని ఆమెతండ్రి రోషముతో పలికెను.'' ఏమైనప్పటికీ ఆమెకు ఉద్యోగం ఈయబడలేదు. ఈరూలు మనదేశపు విద్యాశాఖాధికారులు కూడా అవలంబిస్తే ముందుగా ఉద్యోగం ఊడేది మా తెలుగుపండితుడు గారికే, కాబట్టి వారు తప్పకుండా స్థాపింపబడపోయే ఈలంబోదరసంఘానికి కార్యదర్శులై కార్యక్రమంలో ప్రథమ అయిటమ్‌గా లావుపాటివాళ్ళు అమెరికాలో మేష్టరుపనికి పనికిరాకపోయినా ప్రతీకార్యానికిముందు లంబోదరుణ్ణి పూజించే ఈ హిందూదేశంలో పనికి వస్తారని నిరూపించుచూ తీర్మానింపవలసి వుంటుంది. కార్యదర్శి పదవి మా తెలుగు మేష్టారు అంగీకరించడం వల్ల లోకోపకారం కావడం ఎల్లా ఉన్నా, ముందు స్వార్థం కొంత కలిసివస్తుంది.

... ... ...

ఆంధ్రయూనివర్సిటీ హాస్టలులో వంట పెద్ద అయ్యారు మహాశయుడనీ, అక్కడ తెనుగు భోజనం దొరకదనీ, ఆంధ్రయూనివర్సిటీ వారి ఆంధ్రత్వానికి ఇది ఒక పెద్ద లోటనీ ప్రబుద్ధాంధ్ర సంపాదకులు వ్రాస్తున్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం విషయంలో అనాంధ్రమైన విషయం ఇదివొకటేకాదు. చాలా ఉన్నాయి. మచ్చుకి రెండు చూపెడతాను. ఆంధ్రయూనివర్సిటీ బిల్డింగులలో విశేషభాగం కట్టింది బెంగాలీకంట్రాక్టర్లు-ఆంధ్రయూనివర్సిటీవారు ప్రచురించిన తంజావూరు సరస్వతీ లైబ్రెరీలోని తెలుగు పుస్తకాల వివరణ గ్రంథమును ముద్రించింది మదరాసు హిందీ ప్రచారక ముద్రణాలయంవారు. ఈసంగతులు ప్రబుద్ధాంధ్రవారికి తెలియవా? తెలియకపోతే ప్రబుద్ధాంధ్రనామం ఎట్లు సార్థకమౌతుంది? బంగాళాదేశాన్నుంచి క్షయరోగపు బాబులువచ్చి ఆరోగ్యాన్ని పొందే వాల్తేరు కొండలమీద బంగాళాఖాతం ఒడ్డున ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయం బిల్డింగులు బంగాళాదేశాన్నించి వచ్చిన ఉపాధ్యాయుల ప్రాపున బంగాలీ కంట్రాక్టర్లచే కట్టబడడం కొంతవరకు సమంజసంగా ఉండేనేమో కాని అరవవారిపట్టణమగు తంజావూరులో మహారాష్ట్రరాజగు శరోఫ్జిపేర పరగే లైబ్రెరీలోని తెలుగు పుస్తకాల కేటలాగు హిందీప్రచారకప్రెస్సువారు ముద్రించటంలో ఏమి సబబుఉంది? ఇంతకీ పూర్తిగా కన్నడపట్టణం అయిన నంజన్‌గూడ్‌నుంచి వచ్చే పళ్ళపొడి ఉంటేగాని పాచిమొగాలు కడుక్కోని ఆంధ్రయూనివర్సిటీ హాస్టల్ విద్యార్థులు అయ్యారుచేతి మెతుకులు తింటే మాత్రం తప్పేముంది? నంజన్‌గూడ్ కన్నడపట్టణమైనా నంజన్‌గూడ్ టూత్ పౌడర్‌కు యజమాని తెలంగాణ్యపు బ్రాహ్మడే అని సమాధానం చెప్పుకుని తృప్తిపడేవారికి ఆంధ్రయూనివర్సిటీ హాస్టల్ వంటపెద్ద పుట్టుకచేత అరవ్వాడైనా ప్రస్తుతం ఉనికి చేత ఆంధ్రుడే అనుకుని సమాధానం చెప్పుకుని తృప్తిపడడం ఒక కష్టంలోదికాదు. ఉప్పుసత్యాగ్రహసందర్భంలో శ్రీకృష్ణజన్మస్థానానికి వెళ్ళిన ఒక ఆంధ్రపత్రికాసంపాదకుడు వెల్లూరు జెయిలులో వంటపెద్దగా ఉండియుండెను. వారిపత్రిక ఈహాస్టల్ వంటపెద్ద విషయంలో ఏమిన్నీ చెప్పకుండా ఉండడం ఆశ్చర్యంగానే ఉన్నది.

... ... ...

కొత్తకోమ్మక్క అంటూరు. మద్రాసుయూనివర్సిటీలో మొదటి అభ్యర్థి బియ్యేపాసైనప్పుడు గౌరవప్రదర్శనానికి గుండుపేల్చారట. ఎంత గౌరవం! గవర్నర్లు మొదలైనవారికి ఏర్పడ్డ గౌరవంవంటి గౌరవం ఆరోజుల్లో బియ్యే పాసైనందుకే చేయబడ్డది. మరియిప్పుడో! బియ్యే పాసైనవాడికి గౌరవార్థం బీడీముక్క ఇచ్చే

వాడన్నాలేదు. అట్లాగే చుట్ట కాల్చడం మొదటి రోజులలో చాలా ఘనకార్యంగా చూడబడ్డది. ఇప్పుడో! ఆఖరికి కిరసనాయిలు డిపోల్లోకూడా 'చుట్ట తాగకూడదు' అనే నోటీసు బోర్డు. 1600 సంవత్సరానికి పూర్వం ఇంగ్లండులో చుట్ట కాల్చడానికి విఘ్నేశ్వరపూజచేసిన మొదటి త్రిమూర్తులలో ఒకనిని అతడు చుట్ట కాలుస్తూ ఉండగా స్వయంగా చూసే మహాభాగ్యం తనకు కలిగిందని ఎలిజబెత్తు మహారాణి నావికసైనికులలో ఒకడైన విలియమ్ మిడిల్ టన్ గొప్పగా చెప్పుకున్నాడు. చుట్ట కాల్చే ఆపిడూర్ఘం చూడ్డానికి అప్పుడుచేరిన జనసమూహానికి లెక్కలేదని అతడు వ్రాశాడు. ఇప్పుడు చుట్ట కాల్చే వాడిదగ్గరకు ఎవ్వరూరారు. ఓకిరింతలతో బాధపడే గర్భిణీస్త్రీల మాదిరిగా చాలామంది చుట్ట కాల్చేవాడికి దూరంగా తొలగిపోతారు. ఎదైనా పాతబడ్డకొద్దీ రోత పుట్టిస్తుందనే పెద్దలమాటలో సత్యం లేకపోలేదు.

... ... ...

ఆనేకులు వివాహశుభలేఖల్లో

'జానక్యాః కమలామలాంజలిపుటే యాః
పద్మరాగాయితాః
న్యస్తా రాఘవ మస్తకేచ విలసత్కుంద
ప్రసూనాయితాః
స్రస్తా శ్యామలకాయకాంతికలితా యా
ఇంద్రనీలాయితాః
ముక్తాస్తా శ్శుభదా భవంతు భవతాం
శ్రీరామ వైవాహికాః,

అను శ్లోకాన్ని అచ్చువేస్తున్నారు. ఈశ్లోకంలో సీతాదేవి తనవివాహకాలంలో తలంబ్రాలుగా ఉపయోగించిన ముత్యాలు వర్ణింపబడ్డాయి. ఆముత్యాలు సీతాదేవి పాణిపల్లవములందుండగా కెంపువర్ణమును, శ్రీరాముని తలపైబడగా కుందపుష్పములవంటి తెల్లనికాంతిని, రాములవారి శ్యామలదేహముపైబడగా నీలవర్ణమును పొందినవని భావము. శ్రీరాముని తలవెంట్రుకలు తెల్లనివిగా ఉంటేకాని ముత్యాలు అతనితలపైబడ్డప్పుడు మొల్లపువ్వుల్లా తెల్లగా ఉన్నాయని చెప్పడానికి వీలుండదు. పెళ్ళినాటికి శ్రీరాముడు ఊనషోడశవర్షీయుడని కదా చెప్పబడుతోంది. అప్పటికే వారి తలవెంట్రుకలు తెల్లబడ్డవా? అని ఇత్యాదిగా 'ఒక నిరపరాధమగు సందేహము' అను శీర్షికతో 'సుబోధిని' పత్రికలో ఒకరు వ్రాశారు. నిజానికి మనపత్రికలకి ఈవెంట్రుకల ప్రశంస ఎక్కువగానే ఉంది. తెనుగు మాసపత్రికల కన్నిటిలోకి తలమానికమని చెప్పబడే భారతిపత్రిక చాలా రోజులు శ్రీకృష్ణునకు మీసములున్నవా లేవా అనే సమస్య తీవ్రంగా చర్చించింది. ఈసమస్య గోలకొండ పత్రికలో శ్రీకృష్ణుని మీసాలవిషయంలో ఒక ప్రత్యేక వ్యాసం ప్రచురింపబడింది. ఇప్పుడు సుబోధిని పత్రిక వారు రాములవారిజుట్టు పెళ్ళినాటికే నెరిసిపోయినదా అనే సమస్య నెత్తుకున్నారు. మనపత్రికలు సమస్తవిషయాలూ చర్చిస్తున్నాయి అనడానికి ఇదో ఉదాహరణం. కాని నే నీనడుమ కలుసుకుని ప్రస్తావన సందర్భంలో ఈవిషయాన్ని గురించి మాట్లాడిన ఆంధ్ర యూనివర్సిటీఅధ్యాపకులొకరు మన పత్రికలు ఇట్లాంటి విషయాలు చర్చించడం సమంజసంగా లేదని అన్నారు. ఆఅధ్యాపకులు కొంతకాలంక్రితం ఒక హైస్కూలులో ఉపాధ్యాయులుగా ఉన్నప్పుడు ఇన్స్పెక్షన్ కు వచ్చిన ఒక నోటిదురుసు ఇన్స్పెక్టరు మీకు క్లాసులో పాఠంచెప్పడంకంటె పిలక ఎగరవేయడం హెచ్చుగాఉందని ఈయన్ని ఉద్దేశించి అండంతోటే తమరు నాపాఠాన్నికంటె నావెంట్రుకల్ని ఎక్కువగా ఇన్స్పెక్టుచేస్తోన్నట్టుంది అనేసిన మహానీయులు. వారికి ఈవెంట్రుకల వ్యాసాలు ఏమినచ్చుతాయి? ఆ అధ్యాపకులంటివారికి కొందరికి నచ్చనంతమాత్రాన మన పత్రికాధిపతులు ఇట్లాంటి విషయాలను చర్చించడం మానివేయనక్కరలేదని మనవి చేస్తున్నాను. ఈవెంట్రుకల వ్యాసాల్నిగూర్చి శ్రద్ధపెడుతూన్న ఈపత్రికలుగాని మరి ఇతర తెలుగు పత్రికలుగాని మన ప్రాచీన ఋషిపుంగవులలో పొడుగుకి దట్టానికి సాటిలేని గెడ్డం ఎవరికి ఉందో తేలిస్తే ప్రస్తుతం గెడ్డాలు పెంచుతూన్న ఆంధ్రయువకులకు ఆ దర్శప్రాయుం డొకడు దొరుకుతాడు.

—వి. విశ్వనాథము, బి. ఏ.

# విడ్డూరములు

## • ఆతనిముక్కు ఏడున్నర అంగుళముల పొడుగు :—

పద్దెనిమిదో శతాబ్దంలో యార్కుషైర్‌లో నివశించిన థామస్ వెడ్డర్సు అనువానికి ప్రపంచకంలో ఇంత వఱకు ఎవరికీ లేనటువంటి పొడుగుపాటి ముక్కు ఉండేదని తెలియవస్తూంది. అతని ముక్కు అతని క్రింది పెదవికి క్రిందుగా సాగివుండేది. దానికొలత ఏడున్నర అంగుళములు. దానిని అతడు బజారుల్లోను, జనులు విరివిగా కూడే ఇతర స్థలాల్లోను చూపిస్తూ డబ్బు గడిస్తూ ఉండేవాడు. అతనికి జీవనాధారం ఆపొడుగుపాటి ముక్కే అయిఉండేది.

## • సాలెపురుగు సర్పమును చంపినది :—

ఒకచిన్న సాలెపురుగు ఏడంగుళముల నిడివిగల పామును తనగూటిలో బంధించి దానితో ఒకరోజల్లా పోరి తుదకు చంపివేసిన వృత్తాంతము న్యూయార్కునుంచి తెలియవస్తూంది. ఒకస్త్రీ తనవంటయింట్లో వేడినీళ్ళకాగు చెంత ఒకపాము దారానికి కట్టబడి వేళ్ళాడుతూ ఉండడం చూసింది. పరీక్షమీద ఆదారం సాలెపురుగుగూడని తేలింది. ఆగూటికి నడిమిభాగంలో సాలెపురుగుఉంది. అది నిరంతరం కొత్తదారాన్ని వడుకుతూనే ఉంది. ఒకక్షణమేనా ఊరికే ఉండడం లేదు పాముతలకాయ సాలెపురుక్కి రెండు అంగుళాల దూరంలో మాత్రం ఉంది. చూస్తే దారాలు సన్నంగానే ఉన్నాయి. కాని ఎంతగింజుకొన్నా ఆదారాలను ఆపాము భేదించలేక పోతూంది. ఆపాముతోకలో మూడంగుళాల నిడివిగల చివరభాగం కింద నేలమీదే ఉంది. ఈసౌకర్యం ఉన్నా ఆపాము ఆ మాయదారి సాలెపురుగు గూట్లోంచి బయటపడలేక పోయింది. ఆసాలెపురుగు బూజుగూట్లోకి ఆపాము ఎప్పుడు ఎల్లా తలదూర్చిందో ఎల్లా అందులో చిక్కుపడిపోయిందో ఎవరూ కనిపెట్టలేదు. పాము గూట్లో తలదూర్చడం తడువుగా సాలెపురుగు దారం దట్టంగా అల్లడానికి ప్రారంభించి ఉంటుంది. చిత్రం ఏమిటంటే పాము మెడచుట్టూ సాలెపురుగు చిక్కగా దారంఅల్లేసింది. ఆపాము ఇప్పుడు నోరు తెరిచేదానికైనా దవడలు విడ్డంలేదు. నడుమనడుమ మాత్రం పాము బాగాకదిలేది. స్వాతంత్ర్యంకోసం అది చేసే తీవ్రయత్నాలే ఆకదలికలు. కాని పాము కదలినప్పుడల్లా సాలెపురుగు మరింత చెలాకీగా గూటిమీద కొత్త దారాలు అల్లుతూ కోటను మరింత కట్టుదిట్టంచేసేది. సాయంకాలానికి ఆపాము బతికేఉంది. కాని సాలెగూట్లో పూర్తిగా చిక్కుపడిపోయింది. మరునాటి ఉదయానికి అది చనిపోయిఉంది.

## • ప్రాణవాయువు ఇంజెక్టుచేసి కుక్కను బ్రతికించారు :—

తనతిత్తులలోనికి ఎట్టి ప్రాణవాయువునుగాని ముక్కురంధ్రములద్వారా పీల్చకయే ఉన్న ఒక కుక్క శరీరములోనికి ప్రాణవాయువును ఇంజెక్టు చేయుటవలన దానిని పదునాలు నిముసములు బ్రతికియుండునట్లు చేయుట కనువైనదని 'లాన్సెట్'పత్రిక ప్రచురించుచున్నది. ఇందువలన ప్రాణవాయువును ఇంజెక్టు చేయుటచేత ప్రాణప్రతిష్ఠ చేయుట కవకాశముండుట తెలియనగును. గుండెలు ఆపరేషను చేయు సందర్భములో ఈ ప్రాణ

వాయువు ఇంజెక్టుచేయు విధానము చాల ఉపకారిగా నుండును. ఈవిధానమున అనంతరపరిశోధనలు చనిపోయిన వారిని బ్రతికించుటకు సావకాశ మేర్పడవచ్చునని ఊహింపబడుచున్నది. ఈనడుమ శరీరశాస్త్రవేత్తల అంతర్జాతీయసమావేశ మొకటి రష్యాలో కూడినది. ఆసమావేశపు ప్రతినిధుల యెదుట రష్యన్ శరీరశాస్త్రవేత్త యస్. యస్. బ్రూక్‌హోనెన్‌క్రాఫ్ అనువాడు ఒక కుక్క చనిపోయిన పదినిముసముల అనంతరము దానిని బ్రతికించినాడు. ఏప్రాణియైనను చనిపోయిన తరువాత 35 లేక 40 నిముసములలోపున ఆప్రాణిని తిరిగి బ్రతికింపవచ్చునని ఆశాస్త్రవేత్త చెప్పుచున్నాడు.

క. ఆకోడి రోజుకి ఒకగ్రుడ్డును పెడుతుంది. :—

అమెరికా సంయుక్తరాష్ట్రములకు చెందిన న్యూజెర్సీలో ఒకకోడిఉన్నది. ఆకోడి నాలుగునెలలుగా రోజు ఒక్కొటికి ఒకగ్రుడ్డును పెడుతూంది. ఇప్పటికి ఈవిధంగా అది నూటఇరవైనాలుగు గ్రుడ్లను పెట్టింది. ఈవిధంగా ఇంతవఱకు ఇన్ని గ్రుడ్లను పెట్టినకోడి మఱిఒకటిలేదు. ఇదివఱకు ఒకకోడి అదేప్రదేశంలో ఈమాదిరిగా నూట ఆరుగ్రుడ్లను పెట్టింగి. ప్రస్తుతపుకోడి దానినికూడా మించింది.

క. అంపపుపొట్టు తినుబండారముగా మార్చబడుతున్నది :—

అంపపుపొట్టు అనేకవిధములుగా ఉపయోగింపబడుతూంది. దానినుండి కట్టెపుల్లలు చేస్తున్నారు. పంచదార చేస్తున్నారు. ప్రస్తుతము ఒకానొక జర్మను రసాయనశాస్త్రవేత్త దానినుండి మానవులు తినుట కనువైన ఆహారపదార్థము చేయుటకు ప్రయత్నము చేయుచున్నాడు. లోగడ ఆశాస్త్రవేత్త కర్రముక్కలు, అంపపుపొట్టు మొదలైనవానినుండి పశువులకు బలకరమైన ఆహారము తయారుచేయు విధానము కనుగొన్నాడు. ఇప్పుడు వానినుండి మానవులకు పనికివచ్చు ఆహారము చేయుటకు ప్రయత్నించుచున్నాడు.

క. ఇకమీఁద తేనెటీగలు కుట్టవు :—

వెస్టన్ సూపర్ మేర్ అను తావునకు చెందిన లూయినెల్ గ్రోవ్ అను శాస్త్రవేత్త కుట్టకుండాఉండే తేనెటీగలజాతిని పెంపొందించుచున్నాడు. బ్రిస్టల్‌నందలి క్లిఫ్టన్ జూలాజికల్ గార్డెన్సునందు ఇట్లు పెంపొందింపబడిన తేనెటీగల పట్టులు కొన్నిగలవు. కుట్టుట యెరుగని మేదకస్తురాలగు ఒక రాణి ఈగవలన ఈజాతి అభివృద్ధి చేయబడినది గొప్ప ప్రతిరోధముకలిగినగాని ఈఈగలు కుట్టవు. వీనితరువాతిసంతతిఈగలు అసలే కుట్టనివగుననియు, వానిముట్టిమాత్రము యథాప్రకారముగనే యుండుననియు ఆశాస్త్రవేత్త చెప్పుచున్నాడు.

క. అతనికిప్పుడు నూట అరవయ్యో ఏడు :—

రామొనాట్వానా అనువాడు జూలురాజైన చాకాకొఱకు నూరుసంవత్సరముల క్రితము యుద్ధము చేసినాడు. అతని కిప్పుడు నూట అరవయ్యోఏడు. బెచుఆనాల్యాంతునందు అంతటి వయోవృద్ధుడు మరిలేడు బెచుఆనాల్యాంతునందే అననేల ప్రపంచముననే లేడని చెప్పవచ్చును. ఇన్నిఏళ్ళు ఉన్నా అతడు బాగా దార్ఢ్యంగానే ఉన్నాడు రోజుకు రెండుపూటలా తృప్తిగా భోజనంచేస్తాడు. పైగా అతనికిప్పుడు మంచి పడుచుతనంలోఉన్న భార్య. అతని జన్మవత్సరము అతనిప్పుడు సరిగా చెప్పలేకున్నాడు కాని అతడు చేసిన యుద్ధములనుబట్టి, కొలచిన రాజులనుబట్టి 1773-లో పుట్టిఉంటాడని తలంచబడుతూంది. ఒకప్పుడు అతనికి పదిమంది, మరి ఒకప్పుడు ఎనమండుగురు భార్యలుండేవారు మొత్తం తనకు భార్యలెంతమంది అయిఉండిరో అతడిప్పుడు చెప్పలేడు. ఇప్పటిభార్యనుమాత్రం 'పిల్లభార్య' అంటాడు, ఈమెయే తన ఆఖరుభార్య అనికూడా అంటాడు.



శ్రీమతి కజ్జాన్ నటించిన 'యింద్రసభ' లోని దృశ్యము.

# ఆంధ్రభూమి బుక్కుడిపో—వేపేరి, మదరాసు

## విపంచి — 80 పుటలు — నాలుగు అణాలు.

తమ మృదుమధురరచనములచే నవ్యాంధ్రభారతిని సేవించుచున్న యువకవులలో నొకరగు శ్రీయుత బొడ్డు బాపిరాజుగారి మధుర కావ్యముల సంపుటి. పత్రికలు, ప్రముఖులు విశేషముగ కొనియాడినది. ముద్దుల మూట. రసముల ఊట. పాలతెల్లని ఆంటిక్ కాగితములు. నాలుగైదు రేఖాచిత్రములు. మొత్తమున కొక అందముల బరిణె

## వైద్యయోగరత్నావళి — 370 పుటలు — రెండు రూపాయిలు.

మద్రాసు సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండియన్ మెడిసిన్ మెంబరు బ్రహ్మశ్రీ పండిత ములుగు రామలింగయ్యగారిచే సంపాదితము. ఇందు గవర్నమెంటు **1929** వ సంవత్సరపు జీ. ఓ. **2411** నెంబరు గల పుస్తకమందు సర్వ శకరణములను చేయుపద్ధతి వివరముగ వ్రాయబడినవి సాంప్రదాయ యోగములు, అవసరమైన పరిభాష చేర్చబడినవి. ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్లకు, ఫార్మశీల వారికి మిక్కిలి ఉపయోగమైనది. చాల పరిశ్రమచేసి వ్రాసిన గ్రంథము. ఇండియన్ మెడికల్ స్కూలు ప్రిన్సిపాల్ శ్రీయుత వైద్యరత్న కెప్టెన్ జి. శ్రీనివాసమూర్తిగారి పీఠికతో అలరారుచున్నది. చక్కని గ్లేజు కాగితములు.

## రామప్రియ — 150 పుటలు — పండ్రెండు అణాలు.

ప్రసాదమైన హాస్యమునకు పేరుకెక్కిన లోత కృష్ణమూర్తి (బి. ఏ యల్. టి) గారిచే సులభశైలిని వ్యావహారిక భాషలో వ్రాయబడిన స్వతంత్రకల్పనాకథలపుస్తకము. 'కథలు మిక్కిలి ముచ్చట లూరుచున్నవి' అని పత్రికారాజమగు భారతి, 'హాస్యరసగర్భితము' అని విశేషప్రచారము గల వినోదినిపత్రికయు ప్రశంసించినవి.

## తర్కసంగ్రహము — పోకెట్ సైజ్ — ఒక రూపాయి

తర్కశాస్త్రపారంగతుడగు అన్నంభట్టు సులభార్థబోధకముగ సంస్కృతములో రచియించిన గ్రంథమునకు ఆంధ్రతాత్పర్యమును రచించి చరకమతదీపికాఖ్యాయుర్వేదమతవివరణముతో ఆయుర్వేదాచార్య డాక్టరు ములుగు విశ్వేశ్వరశాస్త్రి, యల్.ఐ.యమ్.; హెచ్.పి.ఐ.యమ్. గారు వెలువరించియున్నారు. ఆయుర్వేదమునకు అత్యావశ్యకమైన పదార్థవిజ్ఞానపటముకూడ కలదు. ఆయుర్వేదానుబంధముతో వ్రాయబడిన ఈగ్రంథము ప్రతి ఆంధ్రాయుర్వేదవైద్యునకు ఎంతయు ఉపకరించుటయేగాక ఆంగ్లలాజిక్ విద్యార్థులుకూడ చదువతగినది.

## కామశాస్త్రము — 150 పుటలు — ఒక రూపాయి.

ఇది వాత్స్యాయన మహర్షి సంస్కృతభాషలో వ్రాసిన సూత్రములకు కొత్త సత్యనారాయణ చౌదరిగారు గావించిన చక్కని తేటతెల్లమగు తెలుగుసేత. రైలులో అమ్ము పుస్తకాలవంటిది కాదు. సరియైన శాస్త్రగ్రంథము. కామపురుషార్థమునకుగల ప్రాముఖ్యము, ప్రాభవము ఇది చదివినచో తెల్లమగును

# వధువు కావలెను

ఈనెలలో మా సాహిత్యాచార్యునకు వివాహముచేయ పెద్దలు నిశ్చయించుకొనిరి. అందులకు దగు ఏర్పాటులుకూడ గావింపబడినవి. వధు వింకను కుదురలేదు. కుదుర్చుటకొక సంఘమేర్పడినది. తదితరమగు ఏర్పాటులకు మరికొన్ని సంఘముల నియమించితిమి. సంఘసభ్యులుగాజేర నిశ్చయించుకొనువారు ఆయాసంఘాధికారులకు వ్రాసి తమ శుభనామముల రిజిష్టరీ చేయించుకొనవలసినదని మాప్రార్థన.

వివాహ మాంధ్రభూమిలో జరుపబడును. గృహాలంకారమునకును, వెల్ల వేయుటకును ప్రభాతము, ప్రకృతి, రవియు బూనుకొనిరి. గృహలక్ష్మి, చంద్రిక, భారతి, మాధురియు ముగ్గులుపెట్టి తోరణాద్యలంకారము లొనర్తురు. ఆంధ్ర ప్రజామిత్ర, ఉదయిని, కృష్ణాలు పెండ్లిపందిరి వేయుచున్నారు. పెండ్లిపందిరి నలంకరించుటకు జ్యోతి, ప్రభ, కళ, పూర్ణిమలు తగు ప్రయత్నము లొనర్చుకొనుచున్నారు. పెండ్లిపెద్దలకు, సదస్యులకు తాంబూలాదులు సమర్పించుటకు సమదర్శిని, ధర్మసాధని, లోకసంచారియు నడుముకట్టినారు. త్రిలింగదేశపు హిందూసుందరీమణులకు ప్రత్యేకముగా భాగ్యనగరమున విడిది యేర్పాటు గావింపబడినది. అచ్చట ఆంధ్రజ్యోతి, కౌమోదకి, భాషామణియు నాహ్వానసంఘమువారు. భీమాప్రచారిణి, సహకారము, స్వతంత్ర రైలుస్టేషనువద్ద దిగినవారిని సన్మానించి దారిచూపుదురు. మాస్వంత కామ్రేడ్ మోటారు పెండ్లివారి యాధీనములో నుండును. పెండ్లి యైదుదినములు ఢంకా మ్రోగుచునే యుండును. సత్యవాణి తంబుర మీటుచుండును. శాంతి సన్నాయి వాయించుచుండును. ముత్తైదులకు కావలసిన పూలు, పూలదండలు నవ్యలతోటనుండి వచ్చును. కావలసిన బట్టలు వగైరాలు పద్మసాలి, హరిజన, పట్టుశాలీలు పంపుచున్నారు. వంట సామగ్రి భారతవైశ్యులు, ఆంధ్రవ్యాపారులు పంపుదురు. జమీందారీరైతులు, అగ్నికులక్షత్రియులు బియ్యపుబస్తాలు సప్లై చేయుదురు.

సనాతనధర్మప్రచారిణి, భక్తిప్రబోధిని, శ్రీరామసేవయు స్వహస్తపాకమున కనుమతినిచ్చినచో వచ్చెదమని వ్రాసియున్నారు. ఊరేగింపునకు బర్మానుండి యైరావతమును బంపుచున్నామని యొక వర్తమాని తెలిగ్రాము పంపినాడు. ఇన్సూరెన్సు, రైల్వే, హోమియోపతి, లోకల్‌బోర్డులకు సంబంధించిన సభ్యులు కార్యభారముచే రాజాలమని వ్రాసియున్నారు.

గాడిపొయ్యిదగ్గర జ్వాల పనిచేయును. ఆంధ్రజాతి వంటచేయును. ఆరోగ్యప్రకాశం కూడ వంటచేయును. శ్రీవైష్ణవులు పులిహోదర మొదలగునవి చేయుటకు ప్రత్యేకముగా నాహ్వానింపబడిరి. యుగంధరుడు ఇచ్చట కర్రపెత్తనము చేయును. దర్బారు స్టోరుకీపరు. గౌతమి, వాసవి, సుబోధిని అప్పడాలు వడియాలు చేయుదురు. వీరు అరిశెలు కూడ పెట్టుదురు. ప్రజాబంధు, దీనబంధు, దేశసేవ, ప్రజాసేవ వీరు కుంటివారికి గ్రుడ్డివారికి అన్నము పెట్టుచునేయుందురు.

గ్రంథాలయసర్వస్వము, ప్రబుద్ధాంధ్ర,

ఆంధ్రసాహిత్యపరిషత్తు, రామబాణం, ప్రేమప్రచారకులు బోయీలు. సాహిత్యాని పల్లకీ మోయుదుమనుచున్నారు. ఆంధ్ర విద్యార్థి, ఆంధ్రసహకార, కృష్ణాసహకారులు దీపములు వెలిగించుట, కాగడాలుపట్టుట మొదలగుపనులు చేయుదు మనుచున్నారు.

పంచానన, సరస్వతి స్నాతకపుపీటలపై గూర్చుందురు. యదార్థభారతి పౌరోహితుడు. పెండ్లిసమయములలో సుధర్మ, సంజీవి, విజయలు కలసి మంగళహారతులు పాడుదురు. పెండ్లికుమారునకు కాటుకబెట్టి కాళ్ళకు పసుపువ్రాయునది నవ్వులరాణి.

గోలుకొండ తెలగలు బయట పెత్తనదారులు. వైఖానసులు సంభావనదారులు. భోజనాలవద్ద చిత్రగుప్త వినోదినీలు హాస్యకారులు. రెడ్డిరాణి పెట్టుబడిదారిణి. శెట్టిబలిజీలు సప్లైలందుకొనువారు. ఆయుర్వేద, వైద్యప్రదీపికలు వచ్చినవారి యారోగ్యస్థితిగతుల విచారింతురు. కాకినాడనుండి నెరజాణ మేళమువచ్చును. అభినవసరస్వతియొక్క రోజుమాత్రము పాటకచేరీ చేయును. నాట్యకళ సంఘము తమ ప్రదర్శనమున కేర్పాటులు గావించుచున్నారు. గ్రామసేవ, సాహితి, నవశక్తి సఖియలతో సహా వచ్చుచుంటిమని వ్రాసినారు. విశాఖ, ఆదిశైవ, ప్రారంభవిద్య, దివ్యజ్ఞాన ప్రదీపికయు వచ్చుచుంటిమి, మాకుతగిన పని గల్పింపుడని వ్రాసినారు.

చేయవలసిన యేర్పాటులైనవి. వధువు కుదురలేదు. శీఘ్రముగా జూడవలసినదని యాంధ్రులందఱకు నివేదన లర్పించుకొనుచున్నాము. వధువు కావలెను. వధువును గుదిర్చి సాహిత్యసేవ చేయుడు.

—శ్రీ గిడుగు రామారావు.





స్థాపితం. 1920.

# అత్యద్భుత కుష్ఠరోగనివారిణి

(రిజిష్టర్డు)

గుణములేదని ఋజువుచేయువారికి రు 500 లు బహుమానము.

18 రకముల కుష్ఠులు, శ్వేతకుష్ఠు, తదితర చర్మవ్యాధులు యెంతకాలమునుండి జీర్ణించియున్ననూ గ్యారంటీగా బాగుచేయబడును. 'అత్యద్భుత కుష్ఠరోగనివారిణి' యను దివ్యౌషధమువలన అనేకవేల రోగులు పూర్ణారోగ్యమును బొంది సంసారసుఖము ననుభవించుచున్నారు. చిరకాలమునుండి ప్రసిద్ధికెక్కిన కంపెనీ రెడ్డికంపెనీయే. యింజక్షనులవలన ఫలితముపొందని రోగులనేకులు మాయొద్ద చికిత్సబొంది పూర్ణారోగ్యమును బడయుచున్నారు. పైవ్యాధులకేగాక శెగ, సవాయి, శుక్లనష్టము, మూర్ఛ, మూలశంక మొదలగువ్యాధులకు మాయొద్ద గ్యారంటీ ఔషధము లున్నవి.

"నకలు మందులనుచూచి మోసపోకుడు"

పూర్తివివరములకు యీక్రింది యడ్రసునకు వ్రాయుడు.

| | | |
|---|---|---|
| గోపాలపురము పోస్టు<br>(వయా) కొత్తపేట,<br>తూర్పుగోదావరి జిల్లా. | **రెడ్డి అండ్ కో**<br>(రిజిష్టర్డు) | బ్రాంచి ఆఫీస్:<br>(కుష్ఠరోగచికిత్సానిపుణులు)<br>వాల్తేరు.ఆర్.యస్.పోస్టు. |

# డబ్ల్యు. హెచ్. స్మిత్ అండ్ సన్

[డబ్ల్యు. హెచ్. స్మిత్ అండ్ సన్ కంపెనీవారు న్యూస్ ఏజెంట్లు. వారి ప్రధాన కార్యస్థానము లండను మహానగరమున. వారికి ఇంగ్లండునందును, వేల్సునందును కలిసి పదునైదువందల న్యూస్ ఏజెన్సీ కార్యస్థానములున్నవి. న్యూస్ ఏజెన్సీ నిర్మాణములలో ఇంతటి బృహత్పరిమాణ మందినది మరియొకటి ప్రపంచమున లేదు. ఆ కంపెనీవారి అల్పారంభము, క్రమాభివృద్ధి, నేటి విస్తృతి ఈ వ్యాసమున వివరింపబడినవి.]

నూరేండ్లకు పూర్వపుమాట. లండనునందలి గ్రాస్వినర్ స్క్వేర్ నందలి డ్యూక్ స్ట్రీట్ లో ఇరువురు సోదరులు ఒక చిన్న స్టేషనరీసామగ్రుల కొట్టును నడుపుచుండిరి. వారి నామములు వరుసగా హెన్రీ ఎడ్వర్డు స్మిత్, విలియమ్ హెన్రీ స్మిత్. వారల తండ్రి పేరు హెన్రీవాల్టన్ స్మిత్. ఆతడు అప్పటికి ముప్పది యేండ్ల క్రితము సౌత్ డీవన్ నుండి లండనుకు కాపురమువచ్చినవాడు. ఆ అన్నదమ్ముల కొట్టుయొక్క సైన్ బోర్డుపై 'హెచ్ అండ్ డబ్ల్యు స్మిత్, న్యూస్ పేపర్ ఏజెంట్సు, బుక్ సెల్లర్సు అండ్ బైండర్సు' అని చెక్కబడియుండెను

ఈ దుకాణమును నడుపుచున్న ఇరువురి సోదరులలో పెద్దవాడగు హెన్రీ ఎడ్వర్డు వట్టి సాపాటురాముడు, సుఖవాసి. చిన్నవాడు చురుకైనవాడు కొట్టుకు పెందలకడనే వచ్చువాడు. చాల పొద్దుపోవుచుండుగాని దానిని వీడువాడుకాడు. పనిలోనే ఆతనికి ఆనందము కలుగునది.

ఆరోజులలో వార్తాపత్రికలు మిక్కిలి ప్రియమైయుండునవి. న్యూస్ పేపరు ప్రతికాపీమీద నాలుగు పెన్నీల పన్నుఉండునది. కాగా పెక్కుపత్రికల సంచికలు ఒక్కొక్కటే ఆరుపెన్నీలకు తక్కువధరకు దొరకకుండునది. అంతటి హెచ్చువెలలో వాని విక్రయము పరిమితమైయుండుట ఒక ఆశ్చర్యముకాదు. ఇద్దరు ముగ్గురు కలిసి ఒకప్రతి కొనుక్కొనువారు. ఒకరి తరువాత నొకరు వాటాలవంతున పెక్కుదినముల పర్యంతము దానిని వారు చదువుకొనువారు. వార్తాపత్రికల ఈ హెచ్చువెల విలియమ్ హెన్రీస్మిత్ నకు ఒక చక్కని అవకాశమును కల్గించినది. ఆతడొక రీడింగు రూమును ఏర్పాటుచేసినాడు. అందు సభ్యులుగా చేరువారికి ఏడాదికి ఒకటిన్నర గిన్నీలచందా. కార్యస్థానము స్ట్రాండ్ వీధిలో **192**-వ గృహమున. మాసపత్రికలు గాక నూటఏబది వార్తాపత్రికలు ఆరీడింగురూమునకు తెప్పింపబడునవి. వీని నన్నిటిని ఆసభ్యులు చూడవచ్చును.

ఈపద్ధతి ఆదినుండియు లాభమునే ఆర్జించెను. అందలి లాభములను పెట్టి వారు స్టేషనరీ సామగ్రుల కొట్లు, సంచారపుస్తకవిక్రయశాలలు క్రొత్తవి తెఱచుటకు వారికి అవకాశము కలిగెను. ఆసోదరులలో పెద్దన్నగారికి ఈ క్రొత్తపద్ధతులేవియు నచ్చలేదు. కాగా **1828**-వ సంవత్సరములో విలియమ్ హెన్రీ కొంతడబ్బు ముదరాయిచ్చి సాపాటురాముడగు అన్నను వదల్చుకొని అప్పటినుండియు వ్యాపారమంతయు తానే నడుపుట కారంభము చేసెను.

ఆరోజులలో లండను పోస్టాఫీసువారు పట్టణేతర ప్రాంతపు టపాలను సాయంకాలముగాని పంపువారు కారు. దినపత్రికలన్నియు ఉదయమునకు తయారగునవి. కాగా మెయిల్ కోచ్ పై అవి లండనులో బయలుదేరుసరికే పండ్రెండుగంటలు పాతవియగునవి. లండనుకు నూరుమైళ్ళదూరములోనున్న చందాదారునకు పత్రిక చేరుసరికి అది నలుబది ఎనిమిది గంటలు పాతది

డైయుండునది. డబ్ల్యు. హెచ్. స్మిత్ తానీవిషయములో కొంత త్వరసౌకర్యమును కలిగింపవచ్చుటను గమనించినాడు. కొన్ని గుఱ్ఱపుబండ్లను కొన్నాడు. వివిధపత్రికాకార్యాలయములనుండి ముద్రింపబడుటతోడనే పత్రికలనుగైకొని వానిని ఉదయముననే వివిధప్రాంతములకు పోవు కోచ్‌లపై బంపువాడు. ఒక్కొక్కప్పుడు పత్రికలను తనబండ్లు కొనివచ్చులోగా ఒక్కొక్కకోచ్ వెళ్ళిపోవునది. అట్టి సమయములందు స్మిత్ గుఱ్ఱపుబండి - అతని గుఱ్ఱములన్నియు బలిష్ఠములైనవి, గాలప్ పరుగుకు ఖ్యాతిగాంచినవి— ఆకోచ్‌ని వెనుదగిలి అచిరకాలముననే దాని నంటుకొని ఈయవలసిన పత్రికలకట్ట దానికిచ్చి తిరిగి వచ్చునది. ఒక్కొక్కప్పుడు వార్త మరీ అర్జెంటు అయినచో తనగుఱ్ఱపు బళ్ళవాళ్ళే అంచెలకు గుఱ్ఱములను ఏర్పాటుచేసికొని వారే స్వయముగ పత్రికలను బట్వాడాచేయునట్లు స్మిత్ ఏర్పాటుచేయువాడు. ఒకసారి అప్పటి రాజగు నాలగవజార్జి చనిపోయినపుడు-స్మిత్ ప్రత్యేకముగా ఒక లాంచిని కంట్రాక్టుతీసికొని ఐర్లెండు దేశపు రాజధానియగు డబ్లిన్‌లో వార్తాపత్రికలను అతిత్వరితగతిని బట్వాడా చేయించినాడు మరి ఇరువదినాలుగు గంటల కాలము కదలిపోయిన పిమ్మటగాని పోస్టాఫీసుద్వారా ఈవార్త తెలియలేదు!

రైళ్లు ఏర్పడినప్పుడు వాని త్వరసౌకర్యమును అతడు పూర్తిగ ఆచుకొన్నాడు. 1847 నాటికే అతడు ఉత్తర ప్రదేశములకు వార్తాపత్రికలను కొనిపోవుటకు తొమ్మిది ప్రత్యేకమైన ఎంజినులను గుత్తకు గొనువాడు. 1848 లో గ్లాస్గోకి పత్రికలు చేర్చుటకు నాతని కంట్రాక్టు ఇంజిను గంటకు ఏబదిమైళ్ళవంతున ప్రయాణముచేయునది. లండన్‌నుండి పోస్టుఆఫీసువారి తపాళ్ళు గ్లాస్గోకు ప్రయాణమగుటకు రెండుగంటల ముందుగనే గ్లాస్గోలో స్మిత్ తన పత్రికలను పాఠకుల కందించువాడు.

1817 లో స్మిత్ వివాహము గావించుకొనినాడు. ఆ స్మిత్‌దంపతులు ప్రారంభదినములలో డ్యూక్ స్ట్రీట్ నందలి వారి దుకాణపు పై అంతస్థున కాపురముండువారు. షాపు స్ట్రాండ్ వీధికి మార్చినపుడు వారి కాపురముకూడ ఆభవనములోని మేడమీది గదులలోనికి మార్చిరి. ఇచ్చటనే 1825-వ సంవత్సరమున వారికొక పుత్రుడుకలిగెను. అతనిపేరుకూడ డబ్ల్యు. హెచ్. స్మిత్తే. అగుట నితనిని డబ్ల్యు. హెచ్. స్మిత్ జూనియర్ అని వ్యవహరింతము.

జూనియర్ స్మిత్ విద్యాబుద్ధులు నేర్చి ఇరువదియొక్క సంవత్సరములవాడైన తోడనే తండ్రి వ్యాపారమున భాగస్వామి అయినాడు. నాటినుండి- 1847-వ సంవత్సరము - కంపెనీనామము 'డబ్ల్యు హెచ్. స్మిత్ అండ్ సన్.' తండ్రి కొడుకు లిద్దరును కలసి ఒడలు దాచుకొనక కష్టించువారు. స్ట్రాండ్ వీధినుంచి వారి బస కిల్‌బరన్‌కు మార్చినారు. ఆకిల్‌బరన్‌నుండి ప్రతిదినము వారు - అది వేసవికాలమైనను, చలికాలమైనను - ఉదయము నాలుగుగంటలగుసరికి స్ట్రాండ్‌వీధిలోని తమ వ్యాపారస్థానమునకు వచ్చి వ్రాలువారు. కార్యస్థానమున అడుగుపెట్టుటతోడనే వారి కోట్లు చిలకొయ్యల కెక్కునవి, వారు పనివారలలో పనివారలై వార్తాపత్రికలు ప్యాక్‌చేయుటలోను, డిస్పాచ్ చేయుటలోను నిమగ్నులగువారు. వార్తాపత్రికలను అతిత్వరగ బట్వాడాచేయుటలో డబ్ల్యు. హెచ్. స్మిత్ అండ్ సన్‌వారు చూపు అతిశ్రద్ధ పలువురి ప్రశంసలనందెను. లోకఖ్యాతిగాంచిన టైమ్సు పత్రికవారు ఈప్రశంసకు నిదర్శనముగా ఉదయము ఆరుగంటల నలుబదియైదు నిముసములకు పూర్వము టైమ్సు పత్రిక కాపీలు ఒక్క-స్మిత్ కంపెనీవారికే ఇచ్చుటకు ఒడబడిరి. ఇందువలన ప్రతిఉదయము ఆరుగంటల నలుబదియైదు నిముసములకు పూర్వము టైమ్సుపత్రిక వలసిన వారు స్మిత్ కంపెనీకి రావలసియుండునది.

వ్యాపారము అతివిస్తృతమయ్యెను. ప్రస్తుతము ఉన్న మందిరము చాలినదికాదు. 1849-వ సంవత్సరమున స్ట్రాండ్ వీధిలోని 192 నుండి 136 కు మార్చబడెను. మరికొంతకాలమునకు పిమ్మట ఈ మందిరములు విస్తృత మొనర్పబడెను. ఇటీవల పోర్చుగల్ వీధిలోని బ్రహ్మాండమగు స్ట్రాండ్ మందిరము నిర్మింపబడెను.

1846 కు పూర్వము ఆంగ్లదేశపు రైలుస్టేషనులలో బుక్కుస్టాలులు లేకుండెను. అంగవైకల్యము మొదలగు కారణములచే ఉద్యోగములు పోగొట్టుకొనిన పోర్టర్లు కొన్ని స్టేషనులలో మిఠాయిదుకాణములు పెట్టువారు వారే ఒక్కొక్కప్పుడు పుస్తకములను, పత్రికలను విక్రయించువారు. ఇట్లుండ 1848-వ సంవత్సరమున యూస్టన్ స్టేషనులోని బుక్ స్టాల్ ఖాళీఅయినదని జూనియర్ స్మిత్ చెవినిపడెను. దానిని తమ కంపెనీవారేల కైకొనరాదు అని అతనికి తట్టెను. క్రొత్తక్రొత్త వార్తాపత్రికలు, మంచి పుస్తకములు అచట స్టాక్ చేయుచో మంచి అమ్మకము ఉండగలదను సత్యము నాతడు ఆకళించెను. ఏడాదికి నూరుపౌనుల బాడుగచొప్పున ఆ స్టాల్ నాతడు కైకొనెను. 1848-వ సంవత్సరము నవంబరు 1-వ తేదీని స్మిత్ కంపెనీవారి మొదటి, రైల్వే బుక్ స్టాల్ తెరువబడెను రైలుప్రయాణికులు దీనికెంతయో సంతసించిరి. రైల్వేకంపెనీలవారుకూడ ఈబుక్ స్టాలుల ప్రయోజనమును గుర్తించిరి. కారణముగా తరువాతి పదునాలుగు సంవత్సరములో ఇంగ్లండు, వేల్సు, ఐర్లండులందలి ముఖ్యమైన ప్రతి రైల్వేస్టేషనునందును స్మిత్ కంపెనీవారు బుక్ స్టాలులను తెరచిరి.

ప్రత్యేకము రైలుప్యాసెంజర్ల సౌకర్యార్థము ఆ కంపెనీవారు చవుకగా నవలలు కూడ ముద్రించి విక్రయించువారు ఈపద్ధతి విశేషముగా ప్రజామోదమును బడయుటచే పలువురు గ్రంథప్రచురణాలయములవారు ఈపద్ధతి నవలంబించిరి.

స్టేషనరీసామగ్రుల విక్రయము, న్యూస్ పేపర్ల బట్వాడా, రైల్వేబుక్కుషాపుల నిర్వహణము, చవకధరకు నవలల ప్రచురణము—స్మిత్ కంపెనీ ఇప్పటికి ఇన్నిశాఖలలో వ్యాపారము చేయుచున్నది. ఇపుడు మరియొకటి, రైల్వేఎడ్వర్టయిజింగు డిపార్టుమెంటు.

నేడు ఏరైలుస్టేషను చూచినను అచటి గోడలకు పెక్కు కంపెనీలప్రకటనపత్రికలో, బోర్డులో ఉండితీరును. కాని 1851 కి పూర్వము ఇంగ్లండులోని రైలుస్టేషనులలో గోడలపై ఎట్టి ప్రకటన పత్రికలుగాని లేకుండెను. 1851 లో బ్రహ్మాండమగు లండను ప్రదర్శనము జరిగెను. వలసరాజ్యములనుండి, తదితర ప్రదేశములనుండి ఆ ప్రదర్శనమునకు వచ్చిన జనులకు మితి లేదు. ఆసందర్భములో వర్తకులు తమ విక్రయవస్తువులను ప్రకటించ నుద్దేశించి రైలుకంపెనీలవారిని కోరిరి. రైలుకంపెనీలవారు ప్రకటించుటకు అనుమతించిరిగాని ప్రకటన పత్రికలను గోడలకు అతికించు కార్యభారమును తాము వహింపజాలమనిరి. ఆ కార్యభారము కంట్రాక్టున కిచ్చుటకు వారు తలపెట్టిరి. స్మిత్తు ఉత్సాహపూర్వకముగ ఆకంట్రాక్టును కైకొనెను ప్రారంభములో లాభము కొద్దిగనే యుండెను. 1854 లో ఈ విషయములో ఖర్చుపెట్టిన 9800 పౌనులమీద 130 పౌనులు మాత్రము లాభమువచ్చెను. కాని దరిమిలాను రైల్వేబుక్కుస్టాలులవలెనే ఈ రైల్వే ఎడ్వర్టయిజింగు డిపార్టుమెంటుకూడ విశేషలాభప్రదమైనది.

1858 లో సీనియర్ స్మిత్ వ్యాపారమునుండి విశ్రాంతి గొని మరి యేడుసంవత్సరములకు ఇహలోకమును వీడెను. 1858లో జూనియర్ స్మిత్ వివాహము గావించుకొనెను. తండ్రి వ్యాపారమునుండి విరమించినాడు, తాను వివాహితుడైనాడు—కాగా ఆవిస్తృత వ్యాపారమునంతను ఒక్కడై నిర్వహించుట కష్టమనిపించినది. అగుట తన సహాధ్యాయిగానుండిన విలియమ్ లెత్ బ్రిడ్జి అనువానిని భాగస్వామిగా చేకొనెను. ఈ రోజులలో భాగస్వాములు తమ కంపెనీ తరపున మరియొకశాఖను ప్రారంభించిరి. లండను పట్టణేతరభాగములందు నివసించు జనులకు చందా పద్ధతిని పుస్తకములు సరఫరాచేయుట. ఆదిలో ఈ శాఖయొక్క జయమునుగూర్చి వారు అత్యుత్సాహులు కాలేదు. కాని అచిరకాలముననే అది ఆకంపెనీ వారి పెద్ద శాఖలలో నొకటియయ్యెను. స్టేషనునందలి బుక్కుస్టాలులే గ్రంథములను సరఫరాచేయునవి. దరిమిలాను పట్టణములందుకూడ వారు బుక్కుస్టాలులను ప్రారంభించిరి.

1868 లో స్మిత్ వెస్టు మినిస్టర్ నుండి పార్లమెంటుకు ఎన్నుకొనబడెను 1874లో ఆర్థిక కార్యదర్శిగను, 1877 లో ఫస్టులార్డు ఆఫ్ ది ఎడ్మిరాల్టీగాను, 1885

లో యుద్ధమంత్రిగను, 1886 లో లీడర్ ఆఫ్ ది హౌస్ ఆఫ్ కామన్సుగను ఆతడు నియమితుడై తన దేశపు రాజ్యాంగవ్యవహారములందు పాల్గొనెను. లార్డు బిరుదము ఇత్తుమనగా అతడు నిరాకరించెను. 1891 లో అతని ఆరోగ్యము చెడిపోయెను. ఆ సంవత్సరము అక్టోబరు మాసమున అతడు దివంగతుడయ్యెను.

అతని అనంతరము అతని కొమారుడు డబ్ల్యు. యఫ్. డి. స్మిత్ వ్యాపారమునకు అధ్యక్షుడయ్యెను. అవిస్తృత వ్యాపారమున ఇపుడు పలువురు భాగస్వాములు. ఇంతటి విస్తృత వ్యాపారమును చేయుచు ఇంకను ప్రయివేటు పార్ట్నర్‌షిప్‌లో ఉండిపోయిన స్మిత్ కంపెనీ వంటి కంపెనీలు ఇంగ్లండున చాలతక్కువగ నున్నవి. అది అట్లు ప్రయివేటు కంపెనీగా ఉండిపోవుటయే మంచిదని పలువురి అభిప్రాయము. పబ్లిక్ కంపెనీ అయినచో ఏదైన ఒక పబ్లిషింగ్ కంపెనీ దాని నిర్వహణమున వ్రేలుజొనుపుటకు అవకాశముండును అందుతో నేడు నిష్పక్షపాతబుద్ధికి పేరుపొందియున్న స్మిత్ కంపెనీ నామము చెడిపోవును నిష్పక్షపాతబుద్ధి విషయమున తమకు కలిగిన మంచి నామమునకు స్మిత్ కంపెనీ వారంతయు గర్వింతురు. పత్రికలవిషయములో కాని, పుస్తకముల విషయములో కాని ఏఒక్క కంపెనీయెడల గాని ప్రత్యేకాభిమానము లేకుండుట ఆకంపెనీవారి వ్రతము. డబ్ల్యు. హెచ్. స్మిత్ అండ్ సన్ వారి రైల్వేబుక్కు స్టాలులలో పనివారలు గమనింపవలసిన విధులు అని 1855-వ సంవత్సరమున ఆకంపెనీవా రొకపుస్తకమును అచ్చువేసినారు. అందలి ఒకవిధి ఇట్లున్నది: 'రైలుబళ్ళవద్ద ఏఒక్క దినపత్రిక పేరుగాని ప్రత్యేకముగ పేర్కొనబడరాదు. పత్రికలమ్ము బాలురు లండను పత్రికలనిగాని ఉదయపుపత్రికలనిగాని కేకలువేయవలయును. ఏకారణముచేతగాని ప్రత్యేక మొకపత్రిక అభిమానింపబడరాదు.' 1855 లో ఏర్పడిన ఆవిధి నేడు కూడ అనుల్లంఘనీయమై అనుసరింపబడుచున్నది.

బ్రహ్మాండమంత వ్యాపారము. పలుశాఖలు. ఇంగ్లండునందును, వేల్సునందును, ఐర్లండునందును కలిసి ఆకంపెనీవారివి పదునైదు వందల బుక్‌షాపులుగలవు. ఈ పదునైదువందల బుక్‌షాపులకు అమ్మకమునకు పత్రికలు, పుస్తకములు, స్టేషనరీ సామగ్రులు పంపు ప్రధానకార్యస్థానము ఎంత పెద్దదైయుండునో ఊహింపుడు. ఆవ్యాపారవిస్తృతికి కొన్ని నిదర్శనములిత్తును న్యూస్‌పేపర్లకు, పార్శెలులకు అచట ఏడాదికి ఉపయోగింపబడు రేపరుకాగితముయొక్క మొత్తపుతూకము ఆరువందల టన్నులు. వారమునకు అచట మూడు టన్నుల దారము ఖర్చుఅగును. ఒకటన్ను దారము ఎన్నిమైళ్ళుండునో చెప్పగలరా? దినమునకు అరటన్ను దారము ఉండినగాని ఆకంపెనీకార్యస్థానమున ప్యాకింగు జరుగదు. ఆకంపెనీవారి స్టాలులకు, షాపులకు కలిసి ఏడాదికి దామాషాన పండ్రెండులక్షల ఏబదివేల ఉత్తరములు వచ్చును. ఆకంపెనీవారి న్యూస్‌పేపరు డిపార్టుమెంటువారు పోస్టుద్వారా పంపు పత్రికలకుగాను అగు పోస్టల్ స్టాంపులకు నెలకు రెండువేల ఐదువందల పౌనులు ఖర్చు! వారి బుక్కుబైండింగు శాఖలలో వారమునకు పండ్రెండువందల పాతవి, మాసిపోయినవి అగు పుస్తకములు బైండుచేయబడును. ఫవుంటెన్ పెన్నులు బాగుచేయు శాఖయొకటి. ఆశాఖామందిరమున కాలుపెట్టినచో అది ఫవుంటెన్‌పెన్నుల కొరకైన ఆసుపత్రివలె నుండును. ఆ ఆసుపత్రిలో ఏడాదికి అరువది వేల కలములు ప్రథమచికిత్సను బడయుచుండును.

ప్రధానశాఖలన్నియు వేరువేరు మందిరములలో నెలకొల్పబడి యున్నవి. వాని నిర్వహణముకూడ వివిధ వ్యక్తుల పరిశీలనమున. ఈశాఖలన్నిటిలో పెద్దది గ్రంథాలయశాఖ. జనసమ్మతినొందిన గ్రంథకర్త వ్రాసిన ఒక క్రొత్త నవలయొక్క కాపీలు అప్పటికప్పుడు రెండు వేల కాపీలయినను వారు సరఫరాచేయగలిగియుందురు అచ్చట స్టాక్‌చేయబడిన వివిధగ్రంథముల రకములసంఖ్య పదిలక్షలకు మించియుండును. అదనపుకాపీలు తగ్గింపు ధరలకు అమ్మబడును. కొన్ని తిరిగి బైండుచేయబడును. కొన్ని తిరిగి శుభ్రముచేయబడును. బొత్తిగా పాడైనవి నాశనము చేయబడును. ఒక్కొక్క సంవత్సరము బొత్తిగా పాడైన కారణమున నాశనముచేయబడు పుస్తకముల సంఖ్య పదునాలుగువేలు. ఈకంపెనీవారు ముద్రణా

లయములు వాటర్లూబ్రిడ్జికి సమీపమునగలవు. అవి బ్రహ్మాండమైనవి. ఆముద్రణాలయమునుండి వెలువడు నవి మాసపత్రికలైననేమి వారపత్రికలైననేమి ఏబదింటికి మించియున్నవి. ఆముద్రణాలయమున ఒక్క యంత్రములు ఉంచబడినతావుయొక్క వైశాల్యమే ఇరువదియైదువేల చతురపుటడుగులు. ఆకంపెనీవారికి ప్రత్యేక మొక కర్మాగారము. వారి క్రొత్తస్టాలులన్నియు ఆ కర్మాగారముననే కట్టబడును. లండనులో పత్రికలు పంచుటకు ఆకంపెనీవారు ఇంకను గుర్రములనే ఉపయోగించుచున్నారు. వాని గుగ్గిళ్ళకొఱకు ఏడాదికి ఆకంపెనీవారు ఐదువేల పౌనుల ఖరీదుగల ఓట్సుధాన్యమును కొందురు.

న్యూస్ పేపర్ డిస్పాచింగు ఆకంపెనీవారి మొదటి డిపార్టుమెంటు. నేటికిని ఆశాఖయే వారి ముఖ్యమైన వ్యాపారశాఖయై యున్నది. నూరేండ్లకు పూర్వము డబ్ల్యు. హెచ్. స్మిత్ ఆపనిని ఇద్దరు తోడిపనివాళ్లతో నిర్వహించుచుండువాడు. నేడు ఆదేశాఖలో అయిదు వందలమంది వంతులవారీని పనిచేయుచున్నారు. ఉదయపు పత్రికలు - సాయంకాలపు పత్రికలు - వారపత్రికలు-మాసపత్రికలు మేటులుమేటులుగ వచ్చిపడుచుండును. ఆపత్రికల మేటులతో ఆఐదువందలమంది పనివాండ్రును నిరంతరము గొండాడుచుందురు. దినమున ఇరువదినాలుగుగంటలలోను ప్యాకింగు జరుగుచునేయుండును. కాని ఉదయకాలముననే పనిరద్దీగా ఉండును. టైమ్సు, డెయిలీ మెయిల్, డెయిలీ ఎక్స్ప్రెస్, డెయిలీ న్యూస్ మొదలగు దినపత్రికలు కుప్పతిప్పలుగ-పుంఖానుపుంఖములుగ ఎడతెగక వచ్చిపడుచుండును. అవి వచ్చుకాలమునకును - వానిని వివిధ ప్రదేశములకు గొనిపోవు రైళ్ళు బయలుదేరు కాలమునకును విశేషకాలవ్యత్యాసముండదు. ఆకాలమును నిముసములమీదను, రెప్పపాట్లమీదను లెక్కింపవలసి యుండును. రాత్రి పండ్రెండున్నర గంటలకు ప్యాకింగుపని రద్దీ ప్రారంభమగును. మరి ఐదుగంటల కాలము కదిలిపోవువఱకును ప్యాకింగుపనివారలు ఊపిరిపీల్చుకొనుటకే అవకాశము కలుగదు. ఆసమయమున పోర్చుగలు వీధిలోని ఆకంపెనీవారి ప్యాకింగురూము దేవతలకు కూడ చూడదగినదై యుండును. కట్టవలసినవి వేలకొలది పార్సెళ్ళు. వచ్చిపడు బహుసంఖ్యాకపత్రికలలో నిర్ణీతసంఖ్య సంచికలు విడదీయబడి ఒక్కొక్క పార్సెలులో ఒక్కొక్క పత్రికవి చేర్పబడవలయును. నిముసము ఆలస్యము జరుగరాదు. లెక్కతప్పరాదు. పని గాలప్ పరుగుమీద నిర్దుష్టముగా జరిగిపోవలయును. అది ప్యాకింగ్ రూమ్. పొడుగుపాటి బల్లలు వరుసలుతీరి యుండును. వానివెనుక బారులుతీరి నిర్ణీతస్థలములందు పనివాండ్రు నిలబడియుందురు. అచ్చుతీరి ముద్రణాలయమునుండి వచ్చినతోడనే ఒక్కొక్కనికి ఒక్కొక్క దినపత్రికలమేటి. ఏస్థలమునకు ఎన్నెన్ని ఆదిన పత్రిక కాపీలు పంపవలెనో అన్నన్ని కాపీలు ఎన్ని ఆతడావేలకొలది పార్సెలులకు అందీయవలయును. రేపరుకాగితములు ఈ సరికే సిద్ధముచేయబడి యుండును. అవి గోధుమవర్ణపు పెద్దకాగితములు. ఆరేపరుకు పైభాగమున చిరునామా కాగితము అంటించబడి యుండును లోపల ఆబ్రాంచిఆఫీసుకు ఒక్కొక్క దిన పత్రిక ఎన్నిప్రతులు వలయునో సూచించు ముద్రితపత్రము. టైమ్సుకాపీలు ఇన్ని—మార్నింగు పోస్టు కాపీలు ఇన్ని—స్కెచ్ ప్రతులు ఇన్ని—మిర్రర్ ప్రతులు ఇన్ని...ఇత్యాది. ఒక్కొక్కడు తన పత్రికలలోని నిర్ణీతసంఖ్య ప్రతులనైకొని రేపరుకాగితముచుట్టి ఆపార్సెలును తనతరువాతివానికిచ్చును వాడు ఆపార్సెలుకు తన ఒద్దిలోని పత్రికనుండి చేర్పవలసిన కాపీలను చేర్చి తనతరువాతివానికి దానిని చేర్చును. ఇట్లే ఆ పార్సెలు ఒకచేతినుండి మరియొకచేతికి జారుచు పోయిన కొలదిని క్రొత్తపత్రికలను లోగొని పెద్దది అగుచుండును ప్రతిబల్లకును చిట్టచివర ఒక చెక్కర్ (సరిచూచువాడు) ఉండును. వాడు ప్రతికట్టయందును నిర్ణీతసంఖ్యసంచికలున్నవో లేవో సరిచూచును. ఆ బండిల్ అంత కట్టగా కట్టువాని చేతికిపోవును. 'స్మిత్ ముడి' అని ఒక ప్రత్యేకపు ముడి వేయబడును. స్మిత్ ముడి పడినతోడనే పార్సెలు ట్రాలీ (తోపుడుబండి) ఎక్కును. ట్రాలీనిండినతోడనే బయటికి. బయట మో

టారు కారులు, మోటారు వాన్‌లు బారలు తీర్చియుండును. ఒక్కొక్క మోటారుకారు, ఒక్కొక్క మోటారు వాన్‌ను నిండిన మఱునిముసమున నిద్రాముద్రితమగుట నిర్జనమైయున్న లండను వీధులలో నిర్నిరోధముగ స్టేషనుకై పరుగెత్తును.

అదే కంపెనీ అగే సమయము. అది మరియొక మందిరభాగము. అందు పనిచేయునది పోస్టలుసెక్షన్. పోస్టులో పోవలసిన వార్తాపత్రికలు రేపర్లు మట్టబడుచున్నవి. అప్పటికే తపాలాబిళ్ళలు, ఎడ్రస్‌స్లిప్పులు ఆ రేపర్లకు అంటించబడియుండును. ఇప్పుడు రేపర్లు మాత్రము పత్రికలకు అంటించబడుచున్నవి.

స్మిత్ కంపెనీవారిచే దినమునకు పంపబడు వివిధ దినపత్రికల సంచికల సంఖ్య పదిలక్షలకు మించియుండును. మరియొక పదిలక్షల వార, మాసపత్రిక ప్రతులు వారిచే ప్రతిదినమును పంపబడుచుండును. వారమునకు వారు వివిధ పత్రికలవి నూట ఇరువది లక్షల ప్రతులను బట్వాడా చేయుదురు. కాగా ఆకంపెనీవారు ఏడాదికి ఆరువందల టన్నుల రేపరు పేపరు -మాసమునకు పత్రికలు పంపుటకై పోస్టుబిళ్ళలకు రెండువేల ఐదువందల పౌనుల ధనము--వారమునకు మూడుటన్నుల ప్యాకింగు దారము ఖర్చుపెట్టుచుండుటలో ఆశ్చర్యమేమున్నది?

ముగించుటకుముందు ఒక్కమాట. ఈ వ్యాసము చదివిన ఉదుటులో మనలనుగూర్చి, మనపత్రికలను గూర్చి, మనపత్రికల ఏజెంట్లనుగూర్చి ఒక్కసారి ఆలోచించినచో ఎట్లుండును?


# అత్యాశ్చర్యకుష్ఠురోగనిర్మూలిని. (రిజిష్టర్డు)

గుణములేదని ఋజువుచేయువారికి రు 1000 లు బహుమానము. 20-వ శతాబ్దమునయొక్క క్రొత్త వింత. 18 రకముల కుష్ఠులు, బొల్లి, సర్వచర్మవ్యాధులు. యేస్థితిలో యెంతకాలమునుండి జీర్ణించియున్నను గ్యారంటీగా బాగుచేయుదుము. విశాఖపట్టణమున మొదట స్థాపనకాబడి వేలకొలది రోగులను బాగుచేయుచున్న కంపెనీ మా లక్ష్మీ అండు కంపెనీయే. డాక్టర్లు కుష్ఠులపాలిటి కల్పతరువని సర్టిఫైచేయుచున్నారు.

డాక్టరు వి., యన్. శోషన్, యం. బి. హెచ్. యమ్. డి., చర్మరోగ చికిత్సానిపుణులు, సేలం, గారు యీక్రిందివిధముగా వ్రాయుచున్నారు.




"లక్ష్మీ అండు కంపెనీవారి అత్యాశ్చర్య కుష్ఠురోగ నిర్మూలిని అను ఔషధము, నాకుష్ఠురోగులకు వాడితిని. 30 దినములలో అద్భుతముగు గుణమిచ్చినది. ఆమందువలన కుష్ఠురోగము పోయినపిమ్మట రోగి రక్తము పరీక్షచేయగా కుష్ఠుక్రిము లేమియులేవు. లక్ష్మీ అండు కంపెనీ వారిమందు యిప్పటి కాలపు మందులన్నిటిలో కిమిన్నయని సర్టిఫైచేయుచున్నాను." పూర్తి వివరములకు యీదిగువ అడ్రసుకు వ్రాయుడు.

## లక్ష్మీ అండు కంపెని, (రిజిష్టర్డు)
## కుష్ఠురోగచికిత్సానిపుణులు.
## వాల్తేరు. ఆర్. యస్. పోష్టు.

# టాకీయాక్టర్లకు టూకీజాబులు

['సినీమాసిసింద్రీ' అను మారుపేరుగల ఒక బెజవాడపౌరుడు - ఆంగ్లవిద్యాధికుడు; నాట్యకళాభిమాని; సినీమావిషయములందు నిష్ణాతుడు- మాసముమాసమును స్వప్నవిమానముపై స్వర్గలోకమునకు పోయి అచటి పురాణపురుషులను సందర్శించి వారివారి వేషములు వేయు నేటి తెనుగుటాకీయాక్టర్లనుగూర్చి వారివారిఅభిప్రాయములను టూకీగా వ్రాయించుకొని వచ్చుచుండుటకును - ఆటూకీజాబులు మా 'ఆంధ్రభూమి'తోపాటే ఆటాకీయాక్టర్లకు ప్రతినెల 25-వ తేదీని అందజేయుటకును ఏర్పాటులు చేసినాము. స్వర్గలోకమునుండి విమానపుటపాపై వచ్చిన ఈజాబులకు జబాబుగ భూలోకములోని మామూలుటపాలో ఏమైన లేఖలు వచ్చుచో వానిని మేము ప్రచురింపజాలమని మనవి. —సంపాదకుడు.]

౧. 'శ్రీకృష్ణతులాభారము' లోని శ్రీకృష్ణునకు:—

యమునాతీరంకంటే, ద్వారకాపట్టణంకంటే భారతదేశంలో మీదేశం అంటే నాకు ప్రీతి ఎక్కువ - నాచరిత్ర నిజంగా భాగవతంచేసి మీభాషలో వ్రాసిన పోతన్నగారిని పట్టి. ఆమహనీయుడు నన్నుగురించి వ్రాసిన 'నల్లనివాడు, పద్మనయనంబులవాడు...' అనే పద్యం నేను - మీభాష రాకపోయినా - నేర్చుకుని తరుచు చదువుకుని తన్మయుణ్ణి అవుతూ ఉంటాను. నన్ను పూర్తిగా అర్థంచేసుకుని నామూర్తిసౌందర్యాన్ని పోతన్నగారి పద్యాలద్వారా పొత్తిపట్టిన ఆంధ్రదేశంలో నువ్వు మొగంమీద సుడిపిడికాయలతో నావేషంవేసి పూవులమ్మిన ఊళ్ళో నాచేత కట్టెలమ్మిస్తున్నావు. 'శ్రీకృష్ణుడి ముక్కుకి రెండు ప్రక్కలా కాపలాగా నల్లమందు మాత్రలలాంటివి రెండుకాయలు, కోలగా కొయ్యబొమ్మలాంటి మొఖం, ఈదురోమనే నడక' అని సరస్వతిపత్రికలో నిన్నుగురించి వ్రాసిన వాక్యాలు విన్నప్పటినుంచీ నేను ఏస్థితిలో ఉన్నానో వివరించలేను. ఎనమండుగురు పట్టమహాదేవులు, పదహారువేల గోపికలు, పైగా రాధ ఇంతమంది స్త్రీలకు మోహంకొల్పిన నారూపు నీవేషంలో సినీమాలు చూడవచ్చే చిల్లరస్త్రీలకు కూడా వెగటుగా ఉంది. —భాగవతంలోని శ్రీకృష్ణుడు.

౧. 'భక్తకుచేల' లోని కుచేలుని భార్యకు:—

నీవు నాకు మల్లే పేదహిందూదేశపు స్త్రీవే. కాబట్టి నాపేదతనం నీకు ఆకళింపుకు వస్తుందనుకొన్నాను. కాని నీకు కొంచెమేనా రాలేదు. నీకు ఇవ్వ నిర్ణయించుకొన్న డబ్బు కంపెనీవారు ముందుగానే ఇచ్చేశారు కాబోలు! నీవు ఎట్టి చీకూ, చింతా లేకుండా నటించావు. అసలు మనకు బిడ్డలు ఎంతమందో తేల్చలేక పోవడం సినీమా డైరెక్టర్ల లోపమే అనుకుందాం. కాని నీ ఆ లావుపాటి శరీరం - ముఖంమీద కొంచమేనా దైన్యంలేకపోవడం బొత్తిగా బాగుండలేదు. భూలోకంలో జీవించిఉన్నప్పుడు పేదతనంచేత నేనుపడ్డ కష్టంకంటె ఇప్పుడు నావేషం ప్రదర్శించడంలో నీవుచూపిన నేర్పులేమికే నేను చాలా దుఃఖిస్తూఉన్నాను. ఆదుఃఖాన్ని నాలో నేను జీర్ణించుకోలేక నీకు ఈసినీమాసిసింద్రీగారిద్వారా ఈ ఉత్తరం పంపిస్తున్నాను. మనపిల్లాడిచేత కృష్ణవిగ్రహానికి పాలు ఇప్పించారు. ఈవిషయంలో డైరె

క్టర్లు నీసలహా ఏమన్నా పుచ్చుకున్నారా? నిన్ను అడక్కుండా ఆడైరెక్టర్లే ఆపాలు తెచ్చి ఉంటారని అనుకుంటాను. మనయింట్లో పాలుఎక్కడివీ? —పురాణంలోని కుచేలునిభార్య.

౬. 'సీతాకళ్యాణము' లోని విశ్వామిత్రునకు :—

ఆంధ్రులంతా నాసంతతివారే. నాసంతతివారిలోని వాడవైన నీవు నావేషం బాగా అభినయించగలిగినందువల్ల తెనుగువారిలో నారక్తం ఇంకా బాగా ప్రవహిస్తోంది అని నిశ్చయమైంది. నీముఖవర్చస్సు, దీర్ఘశరీరం నాకు చాలా సన్నిహితంగా ఉన్నాయి. కాని వేద మంత్రాల స్పష్టమైన ఉచ్చారణకు పేరుమోసిన మన తెనుగుకంఠం నీదగ్గర పూర్ణత్వం పొందలేదు. అయినా ఇంతవఱకు వచ్చిన తెలుగుటాకీలన్నిటిలోకీ నీవేషధారణమే అద్వితీయమైందని చెప్పగలను. వసిష్ఠాదు లడ్డువచ్చినా ఈ విషయంలో నామాటకే చెలామణీ. - ఇది పూర్తి తెలుగుటాకీ అవడంవల్ల తెలుగుసంతతికి మూలపురుషుణ్ణి అయిన నాకు చాలా ఆనందంగావుంది. —రామాయణంలోని విశ్వామిత్రుడు.

౬. 'సక్కుబాయి' లోని శ్రీకృష్ణునకు :—

నీవు ఈటాకీలో నావేషంవేసి నీపేరు చెడగొట్టుకున్నావు. నాపేరు చెడగొట్టావు. సక్కుబాయి వేషం వెయ్యడంలో నీకు మంచిపేరు ఉంది. సినీమాప్రపంచంలోని ఆచారం ప్రకారం మగవాడు ఆడవేషం వెయ్యకూడదని కారణంచేత నీవు ఆసక్కుబాయివేషం వెయ్యడానికి వీలులేకపోగా నీకు పేరుతెచ్చిన సక్కుబాయి సంపర్కం వదలలేక ఎట్లాఅయినా ఆ టాకీలో ఒకవేషం వెయ్యాలని సంకల్పించుకుని నీకు ఎంతమాత్రం సరిపడని వేషంవేసి ఇది స్త్రీధరించిన పురుషవేషం అనిపించావు. నేను నీవేషంలో పట్టి ఆడఙ్గిఅబ్బాయిని అయిపోయాను. నీవుధరించిన ఆతెల్లబనియన్ ఒక్కటే నీది మగవేషంఅని సూచించిన వస్తువ. మీ ఆంధ్రులకు పక్కని ఉన్న అరవవారిలో ఒకస్త్రీ 'భక్తనందనార్' టాకీలో పురుషవేషంవేసి అతిప్రశంసనీయంగా యాక్టుచేసింది. మీ ఆంధ్రుల్లో పురుషవేశమే పురుషుడు తిన్నగా వెయ్యలేకపోయాడనే అపఖ్యాతి తెచ్చినావు. ఇన్నివిధాల నీవువేసిన నావేషం ఇంత భ్రష్టుగా వుంది. —భాగవతంలోని శ్రీకృష్ణుడు.

౬. 'లవకుశ' లోని లవకుశులకు :—

మాపాత్రలు ధరించి మీరు జయప్రదంగా నిర్వహించినందులకు అభినందిస్తున్నాం. మీరు పాడిన 'రఘురామచరితముపాట' చాలా బాగాఉంది. కాని మీప్రవర్తనమాత్రం చాలా దురుసుగాఉంది. అనగా ఉండవలసిన దురుసుపాలుకంటె హెచ్చుగా ఉందన్నమాట. మీ తెలుగుభాషలో ఉన్న కుశలవకుచ్చలకధ అనేపాట ఈనడుమనే చదివించుకొని అర్థం చెప్పించుకున్నాం. మీప్రవర్తన ఆపాటలోని వర్ణనాపద్ధతికి సరిపోయిఉంది. కాబట్టి మిమ్మల్ని ఏమీగట్టిగా అనలేకపోతున్నాం. సమర్థులైన డైరక్టరు పుల్లయ్యగారి అదుపాజ్ఞలు లేకపోతే మీరింకా దుడుకుగా ప్రవర్తించి మమ్మల్ని ప్రజలదృష్టిలో కొంచపరిచి ఉందురు. భయంకాని, ఎబ్బెట్టుగాని లేకుండా మీరు సహజంగా నటించి మాబాల్యపుదినాలు మాకు తిరిగి చూపించారు. మాకు చాలాసంతోషంగాఉంది. —రామాయణంలోని లవకుశులు.

## జిజ్ఞాస — మీమాంస

విజ్ఞానసంపాదనావసరమున వివిధవిషయములందు కలుగు సందేహములను నివారించుకొన పత్రికాముఖమున జిజ్ఞాస సలుపుటకును—ఇందలి ఏ ఒక్క జిజ్ఞాసకైననుసరే సరియైన సమాధానము తెలిసియున్నచో దానిని కూడినంత సంగ్రహముగ వ్రాసి, ప్రచురణార్థము పంపుటకును ఆంధ్రభూమి పాఠకులను ప్రార్థింతుము.

—సంపాదకుడు.

### ౫౮. ఒకశ్లోకముయొక్క వివరణము.

శ్లో. సభాయాం మగ్రపూజాయాం
యస్తుతాంబూల మిచ్ఛతి
తస్యపాపో నలిప్తోహం
సహ నిష్యామి సైంధవమ్.

ఈ శ్లోకార్థమును సహేతుకముగా వివరింపవలెను.

—హరి. సూర్యనారాయణశాస్త్రి.

### ౫౯. భార్యాభర్తల ఏకపాత్రభోజనము.

తేజస్సుకోరు పురుషుడు తనభార్యతో ఏకపాత్రమున భుజింపరాదని నీతిశాస్త్రములో ఉన్నది. దీనిని ఆరోగ్యశాస్త్రరీత్యా సమర్థింపవచ్చునా? —ఆకుండి వెంకటశాస్త్రి.

### ౬౦. ముట్టు నీళ్లనాడు కూరలు తరుగడం.

ముట్టు నీళ్ళు పోసుకున్ననాడు స్త్రీలు కూరగాయలు తరుగకూడదంటారు. దీనికి కారణమేమై ఉండును? —కొత్తపల్లి రామారావు.

### ౬౧. తెనుగులో సినీమాపత్రిక.

హిందీ, ఉర్దూ, మరాఠి, బెంగాలీ, గుజరాతి మున్నగు దేశభాషల్లో సినీమా పత్రికలున్నవి. తెలుగులో ఏల లేవు? నడుపువారు లేకనా? పోషించువారు లేకనా?

—యస్. యస్. యన్. గుప్త.

### ౬౨. పెద్ద సినీమామందిరం.

ప్రపంచకంలోకల్లా పెద్ద సినీమామందిరం ఎచ్చటవుంది? దాని పేరేమిటి? అందు ఒక్కసారి ఎంతమంది ప్రేక్షకులు పడతారు?

—తిరువీధుల తాయారమ్మ.

### ౫౪. 'ఒకసంశయము' నకు జవాబు.

శ్రీ శంకరశాస్త్రిగారిచ్చిన—"భుక్త్వా శతపదంగచ్ఛేత్ । వామపార్శ్వేతుశాయన"—మ్మను నీ శ్లోకపూర్వార్థము ఈవిధముగ గ్రంథములయందు కానరాదు. ఇది ఒక చాటువుగా లోకప్రసిద్ధి. అట్టి యాచాటువు వ్యావహారికమునందు పండితపామరులనోట బడి యిట్టి పాఠాంతరమంది యుండవచ్చును. భిషగ్భూషణమునందు ఉపయుక్తాంశసంగ్రహము నను పేరున—"భుక్త్వాశతపదంగత్వా తాంబూలం తదనన్తరమ్ । శయనే వామభాగేచ వైద్యతః కింప్రయోజనమ్"—అనిచెప్పబడియున్నది. మహర్షి ప్రణీతమగు సుశ్రుతమునందు స్వాస్థ్యసంరక్షణవిధియందు—"భుక్త్వా శతపదంగచ్ఛే ద్వామపార్శ్వేన సంవిశేత్ । శబ్దరూప రసస్పర్శ గంధాంశ్చ మనసఃప్రియాన్ భుక్త్వావానుపసేవేత తేనాన్నం సాధుతిష్ఠతి.—" అనికూడ వివరింపబడి యున్నది. బహుశః యీశ్లోకమే భిషగ్భూషణకారునకంది పైచెప్పబడిన స్వరూపముతో వివరింపబడినదేమో. భోజనానంతరము ఆరోగ్యనియమావళి ననుసరించి వ్యాయామాదిగురుతరకృత్యముల చేయరాదుకదా? మరేమి చేయవలయుననగా—"భుక్త్వా శతపదంగచ్ఛేత్—" అనగా నూరడుగుల దూరమును మెల్లగా నడువవలయును. నడచిన తదుపరి సుగంధాదిమిశ్రితద్రవ్యతాంబూలమును సేవించినవాడై ఇష్టులయిన ప్రియురాండ్ర సరససల్లాపములచేత మనస్సు నాహ్లా

దకరముగా నుంచుకొని సుఖశయ్యపై నెడమపార్శ్వమున కొంచెముసేపు పరుండవలయును. అనంతరము నిత్యకృత్యాది నిర్వహణము. నూరడుగులు నడచుటచేత మనము కూర్చుని భుజించిన యాహారము అన్నాశయమునం దంతటను సమముగా నిండును. అట్లు కుదింపబడిన యాహారము జీర్ణము కావలయును. ఆహారపదార్థములను జీర్ణము చేయుటకు పైత్యరసము కావలయును కదా ? పైత్యరసము నుత్పన్నము గావించు అగ్న్యాశయము ప్రతిమానవునకును కుడివైపున యకృత్తు క్రిందిభాగమున నుండును. అన్నాశయము వామభాగమున నున్నది. కుదిలించుకొన్న అన్నాశయములోని ఆహారము మానవుడు వామపార్శ్వమున పవ్వళించగా తొందరగా ఆహారము అగ్న్యాశయమున జేరక కొంచెము కొంచెముగా జేరి అచ్చటి పైత్యరసముచేత వెంట వెంటనే పక్వమగును. ఇప్పుడు ప్రస్తావింపబడినది శయ్యయొక్క వామ దక్షిణ పార్శ్వములుగావు. మానవుని, దక్షిణ వామ పార్శ్వములు. ఆ పైత్యాన్నరససంయోగమునకు అనుకూలమగుటకు కుడిపక్క పరుండుటకన్న ఎడమపక్క పరుండుట ముఖ్యము. శరీరనిర్మాణము కూడ నట్లే యున్నదికదా ?—ఆహారముతోపాటు దేహధారణకు వలయునది ముఖ్యముగా గాలి. ఆగాలి నాసాపుటములద్వారా దేహమున ప్రవేశించి విడియుట కేర్పరుచుకొన్నవి ఊపిరితిత్తులు. ఆయూపిరితిత్తులు యురఃప్రదేశమున యిరువైపుల నాక్రమించియున్నవి. అందు దక్షిణపార్శ్వమందున్న ఊపిరితిత్తి మిక్కిలి విశాలముగలదై శరీరధారణకు వలయునంత వాయుకృత్యముల నెరవేర్చుచుండును. వామభాగమందలి ఊపిరితిత్తి హృదయము మొదలగువానికి తావీయవలసియుండుటచే చిన్నదియై పోయినది. అందుచే కుడిప్రక్కనుపరున్న యెడల ఆప్రక్కయూపిరితిత్తి ముకుళించుకుని పోవలసివచ్చును. దాన కార్యహాని. యెడమప్రక్క శయనించినను నయ్యెడమయూపిరితిత్తి చిన్నదగుటచే ఒత్తిడి పొందనేరదు - రక్తప్రసరణము హృదయమునుండిగదా జరుగును. ఆహృదయభాగమునకు ఒత్తిడికి వామపార్శ్వశయనము కావలయును. ఊర్పులవలన ఆయుర్నిర్ణయమని యోగశాస్త్రవిధిజ్ఞుల మతము. అట్టి యూర్పు దక్షిణనాసాపుటమున ఎనిమిది అంగుళముల పర్యంతమును వామనాసాపుటమున పదురెండునుండి పదునారు అంగుళముల పర్యంతమును వెలికి వచ్చుచున్నది. ఎక్కుడు దూరము వెలికివచ్చు యూర్పులవలన ఆయుక్షీణమగునను శాస్త్రవిధిచే యోగశాస్త్రజ్ఞులు రేచక పూరకములను కుడినాసాపుటమున జరుపుచుందురు. అదియుంగాక వామభాగము అశుభకరమనియు దక్షిణభాగము శుభకరమనియు నైన ప్రతీతిచే సర్వకాలసర్వావస్థలయందు దక్షిణనాసాపుటమున రేచక పూరకముల జరుపుచుండుటయు కద్దు. ఇది జ్యోతిశ్శాస్త్రజ్ఞులు ఆరూఢ ప్రశ్న ఫలములు చెప్పుటలో అనుష్ఠించు మార్గములలో నొకటి. అట్లు ఎల్లప్పుడును కుడిముక్కున ఉచ్ఛ్వాసనిశ్వాసములు జరుగవలెనన్న యెడమచేతిమీదుగనే పరుండవలయును. కుడిప్రక్కన పరున్నయెడల ఎడమముక్కున ఈ కృత్యములు జరుగుచుండును. ఇది యనుభవ దృష్టాంతము. ఈపై కారణములచేతనే - "భుక్త్వా శతపదంగచ్ఛే ద్వామపార్శ్వేతు శాయన" మ్మని విధించబడియున్నది.

—హరి సూర్యనారాయణ శాస్త్రి.